
# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 20 | సంచిక : 308 | ఆదివారం,మే 31 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00


## దేశరక్షణ కోసం 'ధర్మ హింస' అవసరమే: యోగి ఆదిత్యనాథ్



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దేశ భద్రత, అహింస, ధర్మరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు. లక్నోలో నిర్వహించిన 'నౌసేన శౌర్య వాటిక' ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ... అహింస మానవాళికి పరమ ధర్మమే అయినప్పటికీ, దేశానికి లేదా సమాజానికి ఎవరైనా ముప్పుగా మారినప్పుడు కేవలం అహింసతోనే సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేశారు. దేశాన్ని, ధర్మాన్ని కాపాడే క్రమంలో అవసరమైతే బలప్రయోగం లేదా 'ధర్మ హింస' చేయడం

2లో..

## మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు

### రాహుల్ గాంధీ

- సీయూఈటీ యూజీ 2026 పరీక్షలో సాంకేతిక లోపం
- పలు కేంద్రాల్లో రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభం
- సమస్యను పరిష్కరించామని, అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ప్రకటన
- విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారంటూ కేంద్రంపై రాహుల్ గాంధీ ఆగ్రహం



**న్యూఢిల్లీ(భారత శక్తి)** దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ) 2026 పరీక్షలో సాంకేతిక లోపం తలెత్తింది. దీనివల్ల రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమస్యను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ధృవీకరించింది. ఇంతకుముందు నీట్ (యూజీ) పరీక్ష లీకైంది. ఈ నేపథ్యంలో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. దేశాన్ని విశ్వగురువుగా మారుస్తున్నామని ప్రధాని చెబుతుంటారని, కానీ కనీసం

2లో..

## రూట్ మార్చండి... లేదంటే లైఫ్ రిస్క్!



- మల్కాజ్‌గిరి షీ టీమ్స్ 'సంస్కార్' మెగా కౌన్సెలింగ్‌లో సీ.పీ సుమతి హెచ్చరిక.
- వేధింపుల కేసుల్లో చిక్కితే భవిష్యత్తు ఖతం..
- 138 రోజుల్లోనే 760 మంది రోమియోలు బోనులోకి..
- నిందితుల్లో 137 మంది మైనర్లే!
- 'మనోజాగృతి' సహకారంతో ప్రవర్తనా పరివర్తన సదస్సు..

మల్కాజ్‌గిరి షీ టీమ్స్, 'మనోజాగృతి' సంస్థ సంయుక్తంగా నిర్వహించిన 'సంస్కార్' మెగా కౌన్సెలింగ్‌లో 'సీ.పీ సుమతి' నిందితులను హెచ్చరించారు. మహిళల జోలికొస్తే భవిష్యత్తు అంధకారమవుతుందని స్పష్టం చేశారు. గత 138 రోజుల్లోనే 760 మంది రోమియోలను (137 మంది మైనర్లు) షీ టీమ్స్ పట్టుకున్నాయి. ఈ సదస్సులో మనస్తత్వ నిపుణులు నిందితులకు ప్రవర్తనా పరివర్తన క్లాసులు తీసుకోగా, న్యాయ నిపుణులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), పోక్సో చట్టాల కఠినత్వాన్ని వివరించారు.

**మల్కాజ్‌గిరి, మే 30 : భారత శక్తి** "తప్పులు తెలుసుకుని బాధ్యతాయుత పౌరులుగా మారతారా.. లేక జైలు ఊచలు లెక్కబెడుతూ జీవితాలను పాడుచేసుకుంటారా? తేల్చుకోవాల్సింది మీరే! మహిళలు, బాలికల జోలికొస్తే ఉపేక్షించేది లేదు. ఒక్కసారి పోలీస్ రికార్డుల్లో పేరు నమోదైతే భవిష్యత్తు అంధకారమవుతుంది" అని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ (సీపీ) బి. సుమతి హెచ్చరించారు. మహిళలు, పిల్లలపై నేరాలకు పాల్పడి షీ టీమ్స్‌కు చిక్కిన నిందితుల్లో పరివర్తన తీసుకురావడమే లక్ష్యంగా 'మనోజాగృతి' సంస్థ సహకారంతో మల్కాజ్‌గిరి కమిషనరేట్ ఆధ్వర్యంలో శుక్రవారం 'సంస్కార్ మెగా కౌన్సెలింగ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సుమతి మాట్లాడుతూ.. షీ టీమ్స్ ప్రాథమిక ఉద్దేశం కేవలం చట్టాన్ని అమలు చేయడం, శిక్షలు వేయడమే కాదని.. తొలిసారి తప్పు చేసిన యువతలో మార్పు

2లో..

## టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి..

## ఖండించిన ఖర్గే



**న్యూఢిల్లీ (భారత శక్తి)** పశ్చిమబెంగాల్ టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీపై శనివారం జరిగిన దాడిని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఖండించారు. రాజకీయ భేదాభిప్రాయాలున్నంత మాత్రాన హింసకు దిగడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన హింసాత్మక ఘటనల బాధితులను పరామర్శించేందుకు టీఎంసీ ఎంపీ శనివారం సోనార్‌పూర్ వెళ్లిన సందర్భంగా కొందరు కోడి గుడ్లు, రాళ్లతో దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిని తాజాగా కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఎక్స్ వేదికగా ఖండించారు. ఆయనకు తగినంత పోలీసు భద్రత లేకపోవడాన్ని బట్టి బీజేపీ రాజకీయాలు, ప్రతీకారాలను అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రతిపక్ష నేతల భద్రత కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## మారుతున్న కాలానికి అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు అప్ గ్రేడ్ కావాలి

### – హరీష్ రావు





**సిద్దిపేట(భారత శక్తి)** సిద్దిపేటలో ఫోటోగ్రాఫర్ల కోసం ఏర్పాటు చేసిన వెడ్డింగ్ ఫోటోగ్రఫీ బిజినెస్ వర్క్ షాప్ కు మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. హరీష్ రావు మాట్లాడుతూ వంద మాటలు చెప్పలేని భావాన్ని, సారాంశాన్ని ఒక అద్భుతమైన ఫోటో చెబుతుంది. ఫోటోగ్రఫీకి సమాజంలో అంతటి గొప్ప విలువ ఉందని అన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ మారి ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు వచ్చాయి. ఫంక్షన్లలో అందరూ సెల్ఫీలు, ఫోటోలు తీసుకుంటున్నప్పటికీ.. ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ వృత్తికి ఉన్న డిమాండ్ ఎప్పటికీ తగ్గదు, దానికి ఎప్పుడూ మంచి భవిష్యత్తు ఉంటుంది. ఆర్టిఫిషియల్

2లో..

## దేశంలో భారీ ఉగ్ర కుట్రకు ప్లాన్..


### - పాక్ ఐఎస్ఐ, దావూద్ ఇబ్రహీంతో సంబంధాలున్న 9 మంది అరెస్ట్



**న్యూఢిల్లీ (భారత శక్తి)** దేశంలో భారీ ఉగ్రవాద కుట్రను ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ భగ్నం చేసింది. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ తోనూ, పరారీలో ఉన్న గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీంతోనూ సంబంధాలున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఢిల్లీ, ముంబై సహా దేశంలోని పలు ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించేందుకు వీరు పథకం రచించినట్లు తెలిపారు. దేశంలోని అణు కేంద్రాలు, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, విద్యుత్ ప్లాంట్లు, భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులకు ప్లాన్ చేసినట్లు అధికారులు గుర్తించారని తెలుస్తోంది. అరెస్టయిన వారిలో ఢిల్లీ, ముంబై, పంజాబ్‌కు చెందినవారితో పాటు కొందరు విదేశీయులు కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి భారీ ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గత కొంతకాలంగా ఈ ముఠాపై నిఘా పెట్టిన పోలీసులు, సరైన సమయంలో వారిని అదుపులోకి తీసుకున్నారు.

2లో..

## రైతు ముసుగులో కేసీఆర్ రాజకీయం: సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ (భారత శక్తి):** తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ధి కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్తే, తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం, హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## చదువే ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం

- అంగన్వాడీల బలోపేతం నుంచి బాలికల సాధికారత వరకు ప్రజా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ
- రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో మహిళా వారోత్సవాల సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి సీతక్క



**హైదరాబాద్(భారత శక్తి)** రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో మహిళా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన స్నేహ సంఘాల మాక్ పార్లమెంట్, "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం, అంగన్వాడీ యూనిఫార్ముల పంపిణీ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "ప్రపంచాన్ని, జీవితాన్ని మార్చే శక్తి చదువుతోనే సాధ్యమవుతుంది.

2లో..

## 'హైడ్రా' దూకుడు

### ముష్కి చెరువు కబ్జాలపై ఉక్కుపాదం..

- భారీ పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు, కంచె ఏర్పాటు



**హైదరాబాద్ (భారత శక్తి)** పరిధిలోని చెరువుల సంరక్షణే ధ్యేయంగా ఏర్పడిన హైడ్రా అధికారులు శనివారం ఉదయాన్నే నార్సింగిలో మరో భారీ ఆపరేషన్ చేపట్టారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి రంగంలోకి దిగిన హైడ్రా బృందాలు.. నార్సింగిలోని ప్రముఖ ముష్కి (ముష్కిన్) చెరువు పరిరక్షణ చర్యలను వేగవంతం చేశాయి.?10 ఎకరాలు కబ్జా.. రియల్ వ్యాపారుల చేతుల్లో చెరువు స్థలం!?మొత్తం 60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ముష్కి చెరువులో, సుమారు 10 ఎకరాల మేర చెరువు స్థలం కబ్జాకు గురైనట్లు హైడ్రా అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పలువురు బిల్డర్లు చెరువు పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించి పెద్ద ఎత్తున నిర్మాణాలకు పాల్పడినట్లు తేలింది. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలకు అధికారులు

2లో..

## 111 జీవో ఎత్తివేస్తామని మీకు హామీ ఇస్తున్నా

### – టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



**మోయినాబాద్(భారత శక్తి)** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత శనివారం మొయినాబాద్ లో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరించారు. కవిత మాట్లాడుతూ మొయినాబాద్, చేవెళ్ల ప్రజలందరికీ నమస్కారం. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా మనం పుట్టుకొచ్చాం. తెలంగాణ వస్తే అన్ని సమస్యలు పోతాయనుకుంటే అది జరగలేదు. ఆ లక్ష్యాలను సాధించుకోని, తెలంగాణ హక్కులను తెలంగాణ రక్షణ సేన పరిరక్షిస్తుంది. ఈ ప్రాంతంలో చూస్తే ఎకరాకు వందకోట్ల రూపాయలు పలుకుతున్న పరిస్థితి మనం చూస్తున్నామని అన్నారు.తే 120 గ్రామాలకు సంబంధించి 111 జీవోను ఎత్తివేస్తే ఇక్కడి రైతులకు మేలు జరుగుతుంది. పిల్లల పెళ్లిళ్ల కోసం ఒక పావు ఎకరం అమ్ముకున్న మంచి ధర వచ్చే పరిస్థితి ఉంటుంది. కానీ 111 జీవో ఎత్తివేస్తామని అన్ని పార్టీల వారు చెబుతున్నారు. అధికారంలోకి వచ్చాక పట్టించుకోవటం లేదు. తెలంగాణ రక్షణ సేన కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. మేము 111 జీవో ఎత్తివేస్తామని మీకు హామీ ఇస్తున్నా. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉంటారు. ఈ గుంపుమేస్త్రీ నాకు రియల్ ఎస్టేట్ వ్యాపారమే బాగా తెలుసు అని చెప్పాడు. కానీ ఆ వ్యాపారాన్ని కూడా ఊడగొట్టిండు. అందుకే గుంపు మేస్త్రీ పై పోరాటం చేయాల్సి ఉంది. చేవెళ్ల, మొయినాబాద్ ప్రజలు ఈ ప్రభుత్వం పై పోరాటానికి సిద్ధంగా ఉండాలి. మన పార్టీలోకి పెద్ద ఎత్తున

2లో..

## తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

- పలు జిల్లాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశముందని హెచ్చరిక
- మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో తీవ్ర వడగాల్పులకు అవకాశం
- ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ



హైదరాబాద్ **(భారత శక్తి)** హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. పలు జిల్లాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశముందని హెచ్చరించింది. ఈరోజు మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో వడగాల్పులు తీవ్రంగా ఉండవచ్చని పేర్కొంది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని హెచ్చరించింది. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. సిద్దిపేట, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కూడా ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. క్యుములోనింబస్ మేఘాల ప్రభావం కారణంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఈరోజు ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల్లో వర్షాలకు ఆస్కారం ఉందని వెల్లడించింది. నేటి నుంచి నాలుగు రోజుల పాటు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది.

# రూట్ మార్చండి.. లేదంటే లైఫ్ రిస్కే!

తీసుకురావడమేనని స్పష్టం చేశారు. ప్రగతిశీల సమాజంలో మహిళలకు సమాన గౌరవం, పూర్తి రక్షణ దక్కాలని ఆకాంక్షించారు.

### ఆందోళనకరంగా 'రోమియోల' గ్రాఫ్.. సగానికి పైగా యువతే!

ఈ ఏడాది జనవరి 1 నుండి మే 18 వరకు (కేవలం 138 రోజుల్లో) మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్ల పరిధిలో షీ టీమ్స్ సాధించిన ప్రగతి నివేదికను సీపీ వెల్లడించారు. పట్టుబడిన వారిలో మైనర్లు, యువత సంఖ్య ఎక్కువగా ఉండటం పట్ల ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.మల్కాజ్‌గిరి షీ టీమ్స్ 138 రోజుల్లో 61 ఎఫ్‌ఐఆర్‌లు, 236 పెట్టీ కేసులు నమోదు చేసి, 760 మంది నిందితులను పట్టుకున్నాయి. వీరిలో 137 మంది మైనర్లు, 384 మంది 24 ఏళ్ల లోపు యువకులు, 11 మంది వృద్ధులు ఉన్నారు. సగానికి పైగా యువతే ఉండటం సమాజంలో ఆందోళన కలిగిస్తోంది.యువతలో పెరుగుతున్న ఈ విపరీత ధోరణిని అరికట్టేందుకు భవిష్యత్తులోనూ ఫాలో-అప్ కౌన్సెలింగ్‌లు నిర్వహిస్తామని, నిందితుల్లో దీర్ఘకాలిక మార్పు కోసం 'మార్పు మార్గదర్శకులను' (చేంజ్ మెంటార్స్), నియమిస్తామని సీపీ ప్రకటించారు.

### సోషల్ మీడియాపై నిఘా.. 53 వేల మందికి అవగాహన

మహిళల భద్రతతో పాటు సైబర్ సేఫ్టీ, పోక్సో (గూజూూా) చట్టం, సామాజిక మాధ్యమాల సురక్షిత వినియోగంపై షీ టీమ్స్ నిరంతరం క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్నాయని సీపీ తెలిపారు.



ఇందులో భాగంగా ఇప్పటివరకు 406 విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి, 53,000 మందికి పైగా పౌరులను చైతన్యపరిచినట్లు వివరించారు.

### మనస్తత్వ నిపుణుల క్లాస్.. చట్టాల కొరడా!

మెగా కౌన్సెలింగ్‌లో భాగంగా ప్రముఖ సైకాలజిస్ట్, 'మనోజాగృతి' సంస్థ అధినేత్రి 'గీతా.చల్లా' బృందం నిందితులకు ప్రవర్తనా పరివర్తన, ఆత్మనియంత్రణ, భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడంపై ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు.మరోవైపు న్యాయ సలహాదారు కృష్ణమోహన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రశేఖర్ లు మాట్లాడుతూ.. కొత్తగా అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత (BNS), పోక్సో చట్టం, ఐటీ యాక్ట్ (IT Act) పరిధిలోని కఠినమైన శిక్షలు, జైలు నిబంధనలను నిందితులకు కళ్లకు కట్టినట్లు వివరించారు.

తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ ఉండాలని సూచించారు.ఈ సదస్సులో ఎల్బీనగర్ డీసీపీ డాక్టర్ బి. అనురాధ, మహిళా భద్రత డీసీపీ టి. ఉషా రాణి, అదనపు డీసీపీ బి. కోటేశ్వర్ రావు, షీ టీమ్స్ ఏసీపీ పి. వెంకటేశ్వర్లు, పలువురు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది మరియు నిందితులు వారి తల్లిదండ్రులతో కలిసి పాల్గొన్నారు.

## మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు

ఒక్క పరీక్షను కూడా సజావుగా నిర్వహించడం లేదని విమర్శించారు.సర్వర్ లోపం కారణంగా కొన్ని పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన పరీక్షను సాయంత్రం 4 గంటలకు ప్రారంభించారు. విద్యార్థులను మధ్యాహ్నం 2:30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. సాంకేతిక సమస్యను పరిష్కరించామని, పరీక్ష సమయం కోల్పోయిన విద్యార్థులకు నష్టపరిహారంగా అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో జరిగిన ఇతర పరీక్షల వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "నీట్, సీబీఎస్ఈ, ఎస్సెస్సీ, ఈరోజు సీయూఈటీ. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. కానీ ఒక్కదాన్నీ నిజాయితీగా నిర్వహించలేకపోయారు" అని ఆయన ఆరోపించారు.భారత్‌ను 'విశ్వగురువు'గా మారుస్తున్నామని చెబుతూనే, మరోవైపు ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని రాహుల్ మండిపడ్డారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయస్థాయి పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలు, పారదర్శకత లోపంపై ఈ ఘటన మరోసారి ఆందోళనలను రేకెత్తించింది.

# 'హైడ్రా' దూకుడు

ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఇందులో భాగంగానే, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ప్రసిద్ధ 'స్కైలా' అపార్ట్మెంట్‌కు చెందిన కాంపౌండ్ వాల్ (రక్షణ గోడ)ను అధికారులు ఈరోజు ఉదయం జెసిబిల సహాయంతో నేలమట్టం చేశారు.50 ఎకరాలకు కంచె.. భారీ పోలీస్ బందోబస్తు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మరియు స్థానికులు, బిల్డర్ల నుంచి ప్రతిఘటన ఎదురుకాకుండా ఉండేందుకు పటిష్టమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. భారీగా పోలీస్ బలగాలను మోహరించి, వారి బందోబస్తు మధ్య ప్రస్తుతం ఆక్రమణల తొలగింపు ప్రక్రియను కొనసాగిస్తున్నారు. కబ్జాల బారిన పడకుండా మిగిలిన సుమారు 50 ఎకరాల చెరువు స్థలానికి చుట్టూ ఇరిగేషన్, హైడ్రా అధికారులు సంయుక్తంగా శాశ్వత కంచె (ఈవనిఇతినిణ) ఏర్పాటు చేసే పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నారు.?అధికారుల హెచ్చరిక: చెరువుల పరిరక్షణలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, ఎంతటి వారైనా సరే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను వదిలిపెట్టేది లేదని అధికారులు స్పష్టం చేశారు. చెరువు కానుకొని ఉన్న విల్లాలు, పెద్ద భవనాల్లోని తాత్కాలిక గుడిసెలను తక్షణమే ఖాళీ చేయాలని హెచ్చరించారు.

## చదువే ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం

ఒకవేళ జీవితంలో అన్నీ కోల్పోయినా చదువు ఉంటే మళ్లీ నిలబడగలుగుతాం" అని పేర్కొన్నారు. బాలికలు కార్పొరేటర్లు, మేయర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కావాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నెల్సన్ మండేలా చెప్పిన ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు ఉంది అనే సూక్తిని ప్రస్తావించిన మంత్రి, చదువుతో పాటు సంస్కారం కూడా జీవితంలో అంతే ముఖ్యమని తెలిపారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించడం, సమాజంతో మమేకం కావడం, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడం అవసరమని సూచించారు.స్నేహ సంఘాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది టీనేజీ బాలికలను పదివేలకు పైగా స్నేహ గ్రూపులుగా ఏర్పాటుచేసి భద్రత, ఆరోగ్యం, పోషకాహారం, విద్య, సాధికారత అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా వాటిని విద్య, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. "పెళ్లి అయినా, వృద్ధాప్యం వచ్చినా మీతో ఉండేది మీ చదువు, మీ విజ్ఞానం మాత్రమే" అని పేర్కొంటూ ప్రతి బాలిక ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే దిశగా కృషి చేయాలని కోరారు. అంగన్వాడీ యూనిఫార్మ్‌ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ, తెలంగాణకు ఐసిడిఎస్ సేవల బీజం మహబూబ్నగర్ నుంచే పడిందని గుర్తు చేశారు. 1975లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ చిన్నారుల కు పోషకాహారాన్ని అందించే విధంగా ఐసిడిఎస్ సేవలను ప్రారంభించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అంగన్వాడీ సేవలను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతోందన్నారు. గర్భధారణ దశ నుంచి మూడేళ్ల వయస్సు వరకు పిల్లల పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. గతంలో లేని యూనిఫార్మ్‌లను ప్రస్తుతం అందిస్తున్నామని, 57 రకాల విద్యా, ఆట వస్తువులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. "తొలి ముద్ద" కార్యక్రమం ద్వారా అల్పాహారం, పాలు, గుడ్లు, పోషకాహారం అందిస్తున్నామని వివరించారు."ప్రైవేట్ నర్సరీల్లో అన్నం, పాలు, గుడ్లు ఇవ్వరు. కానీ ప్రభుత్వ అంగన్వాడీల్లో పిల్లల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రయివేటు బడి వద్దు.. అంగన్వాడి ముద్దు" అని మంత్రి పేర్కొన్నారు. అంగన్వాడీ విద్య పూర్తి చేసుకుని మొదటి తరగతిలో చేరుతున్న చిన్నారులకు విద్యారంభ ధ్రువపత్రాలను మంత్రి అందజేశారు. స్నేహ సంఘాల మాక్ పార్లమెంట్లో బాలికలు విద్య, ఆరోగ్యం, సైబర్ భద్రత, రవాణా, పాఠశాల మౌలిక వసతులు, మహిళా ఉపాధ్యాయుల నియామకం, సానిటరీ న్యాప్కిన్ల పంపిణీ తదితర అంశాలపై ప్రశ్నలు సంధించారు. ప్రభుత్వ పథకాలపై సంబంధిత అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కూడా సీతక్క అసెంబ్లీలో చేసిన చర్చలు అధికారులను ఆలోచింపజేసేవని గుర్తుచేశారు. గ్రామస్థాయిలో బాలికలు తమ సమస్యలను ధైర్యంగా వ్యక్తపరిచే వేదికగా స్నేహ సంఘాలు నిలుస్తున్నాయని తెలిపారు.మహిళల అక్షరాస్యత పెంపు కోసం చేపట్టిన "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం ద్వారా లక్షలాది మంది మహిళలు చదవడం, రాయడం నేర్చుకుని వేలిముద్రకు బదులుగా సంతకం చేసే స్థాయికి చేరుకున్నారని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య,మహిళా కమిషన్ సభ్యురాలు సదాలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, శాఖ డైరెక్టర్ శృతి ఓజా, పంచాయతీరాజ్ కమిషనర్ మరియు సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అధికారులు, స్నేహ సంఘాల సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు

# ప్రతి విద్యార్థి చట్టసభలపై అవగాహన కలిగి ఉండాలి

**- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు**
**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**






మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 30 (భారత శక్తి ): ప్రజల యొక్క - ప్రజల చేత - ప్రజల కొరకు ఏర్పడిన ప్రజాస్వామ్యం మన దేశంలో కొనసాగుతూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాక్ పార్లమెంట్ నిర్వహణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, ఇతర శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా రాజ్యాధికారాన్ని చేపట్టే వారిని ఎన్నుకునే శక్తివంతమైన ఓటు హక్కు ప్రజలకు కల్పించబడిందని తెలిపారు.రాజ్యాంగం దేశాల వారీగా వివిధ రకాలుగా ఉంటుందని, మన దేశంలో అమలులో ఉన్న రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం కలిగి ఉన్నామని తెలిపారు. శాసన సభ, పార్లమెంట్, సర్పంచ్, మండల పరిషత్, జిల్లా పరిషత్, స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా ప్రజాప్రతినిధులను ఎన్నుకునే స్వేచ్ఛ కలిగి ఉన్నామని, రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘాల ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని, సరైన నాయకులను ఎన్నుకునే స్వేచ్ఛ, హక్కు ప్రతి ఓటరుకు ఉంటుందని తెలిపారు. ఎన్నికలలో ప్రజలకు కల్పించిన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికలలో గెలుపొందిన ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని తెలిపారు. ప్రజలకు కల్పించిన హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

- మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ సాగర రావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రతి ఒక్కరు చదువుకోవాలని తెలిపారు. విద్య అనేది ఉద్యోగం కోసం మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి అంశాన్ని తెలుసుకోవాలని, జ్ఞానం సంపాదించుకోవాలని, హక్కులు, చట్టాలు తెలుసుకోవాలని, విద్యార్థిని, విద్యార్థులు ఆత్మ రక్షణ విద్య నేర్చుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లల కోసం పడుతున్న కష్టాలు తెలుసుకోవాలని, ఏకాగ్రత, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. మహిళల రక్షణ, పోషణ, స్వావలంబన, సంక్షేమం కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. దేశంలో అనేక రకాల మతాలు, కులాలు, విభిన్న సంస్కృతులు ఉన్నప్పటికీ అందరం కలిసి జీవిస్తున్నామని, మనది యువ భారత దేశమని, దేశ భవిష్యత్తు యువతదేనని అన్నారు. భౌగోళికంగా, ఆర్థికంగా మన దేశం పటిష్టంగా ఉందని, దేశ భవిష్యత్తులో విద్య అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉందని తెలిపారు. అక్షరాస్యతలో మంచిర్యాల జిల్లాలో ముందంజలో ఉంచాలని, జిల్లా ప్రజల సంక్షేమం కోసం అధికార యంత్రం సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు.

## దేశంలో భారీ ఉగ్ర కుట్రకు ప్లాన్..

ఈ ఉగ్ర ముఠాకు సరిహద్దు ఆవల నుంచి అందుతున్న సహకారం, నిధుల సమీకరణ, విదేశీ హ్యాండ్లర్ల పాత్రపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల ఉగ్రవాద దాడుల హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీలో హై అలర్ట్ కొనసాగుతోంది.

## 111 జీవో ఎత్తివేస్తామని మీకు హామీ ఇస్తున్నా

మైనార్టీలు చేరారు. వాళ్ల చేరికతో మరింత బలపడ్డాం. ఇక్కడున్న గంగా, జమునా తెహజీబ్ సంస్కృతిని చెడగొట్టే వాళ్లకు సరైన బుద్ధి చెప్పాలి. తెలంగాణ వస్తే మన ఆడబిడ్డల జీవితాలు మారుతాయని అనుకున్నాం. కానీ అలా జరగలేదు.

ఆడబిడ్డలకు కచ్చితంగా మంచి చేసేందుకు నేను పార్టీ పెట్టాను. ఒక ఆడబిడ్డ, మీ సోదరిగా నాకు మీ సమస్యలన్నీ తెలుసు. మన యువతకు కూడా ఉద్యోగాలు రావాల్సి ఉంది. కచ్చితంగా తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తుంది. అప్పుడు యువతకు అవసరమైన ఉద్యోగాలు కల్పిస్తాం. ఎలాంటి గ్యారంటీ లేకుండా వారికి 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు అందిస్తామని అన్నారు.

# అంగన్వాడి వైపు అడుగు చిన్నారి భవిష్యత్తుకు బంగారు బాట

**- జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 30 (భారత శక్తి): అంగన్వాడి వైపుగా చిన్నారులు వేసే ప్రతి అడుగు బంగారు భవిష్యత్తుకు బాట అని జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ అన్నారు.శనివారం మంచిర్యాల పట్టణంలోని రామ్ నగర్ సెక్టార్ లో నిర్వహించిన అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమానికి సి డి పి ఓ విష్ణు ప్రియ,సూపర్వైజర్ జ్యోతి,అంగన్వాడీ టీచర్లతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. చిన్నారుల సంక్షేమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించడంతో పాటు సమయానుసారంగా పిల్లల ఎత్తు, బరువు లను నమోదు చేసి వారి శారీరక, మానసిక ఎదుగుదలను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు.పోషణ్ అభియాన్ లో భాగంగా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు.ఆరోగ్యం, పోషణ,విద్యతో పిల్లల భవిష్యత్తు ప్రగతి బాటలో నడిపేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, పిల్లల తల్లితండ్రులు,సిబ్బంది పాల్గొన్నారు.

# కారులో తండ్రి, కూతురు.. లారీ డ్రైవర్ అరాచకం

ఒడిశాలోని భువనేశ్వర్లో ఓ లారీ డ్రైవర్ అరాచకం సృష్టించాడు. హైవేపై సైడ్ ఇచ్చే విషయంలో వివాదం తలెత్తడంతో పలాసునీ బ్రిడ్జి వద్ద నిన్న రాత్రి ఓ కారును ఢీకొట్టాడు. ఆపై దాన్ని 500 మీటర్లకు పైగా లాక్కెళ్లాడు.

అదృష్టవశాత్తూ కారులో ఉన్న తండ్రి, కుమార్తె స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనతో కారులో ఉన్నవారితో పాటు ఆ రోడ్డుపై ప్రయాణించే వారు భయాందోళనకు గురయ్యారు. అఅ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేశారు

## కూలిపోయిన దొంగపిండి గ్రామ వంతెన

**భీమవరం** పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం దొంగపిండి గ్రామం వద్ద కాల్వ పై వున్న వంతెన శనివారం ఉదయం కూలిపోయింది. ఇసుక లోడ్ తో వెళ్తున్న లారీ బ్రిడ్జి మీదకు రాగానే కూలింది. డ్రైవర్ తప్పించుకోగలిగాడు. ఎవరికీ ప్రమాదం జరగలేదు. వంతెన కూలడంతో దొంగపిండికి బైట ప్రాంతాలకు సంబంధాలు తెగిపోయాయి.

## దేశరక్షణ కోసం 'ధర్మ హింస' అవసరమే: యోగి ఆదిత్యనాథ్

కూడా అంతే ముఖ్యమన్నారు.బలహీనులను ప్రపంచం ఎప్పుడూ గౌరవించదని, భద్రతాపరంగా శక్తివంతమైన దేశాలతోనే ఇతర దేశాలు స్నేహాన్ని కోరుకుంటాయని యోగి పేర్కొన్నారు. శాంతిభద్రతలు సజావుగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని చెబుతూ.. 2017కు ముందు యూపీలో మాఫియా ఆధిపత్యం, నేరాలు ఎక్కువగా ఉండేవని, బీజేపీ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా మెరుగయ్యాయని గుర్తుచేశారు. దేశ సరిహద్దుల్లో అహర్నిశలు శ్రమిస్తూ భారతదేశాన్ని కాపాడుతున్న సైనికుల త్యాగాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని సీఎం యోగి ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు.

## మారుతున్న కాలానికి అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు అప్ గ్రేడ్ కావాలి

ఇంటెలిజెన్స్ లాంటి కొత్త టెక్నాలజీలు వస్తున్న తరుణంలో సాఫ్ట్వేర్ ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు, రాజకీయ నాయకులు సైతం ఎప్పటికప్పుడు అప్గ్రేడ్ అవుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు కూడా తమ నైపుణ్యాలను అప్గ్రేడ్ చేసుకోవాలి, లేకపోతే వెనుకబడిపోతారు. మీ నైపుణ్యాలను పెంచేందుకు ఏర్పాటు చేసిన ఈ వర్క్ షాప్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

సిద్దిపేటలోని కోమటి చెరువు, రంగనాయక సాగర్ వంటి సుందరమైన ప్రాంతాలు ఇప్పుడు ఫోటోషూట్లకు కేరాఫ్ అడ్రస్గా మారి, ఎప్పుడూ కళకళలాడుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో మార్కెట్లో డబ్బుల చెలామణి ఆగిపోయింది. రియల్ ఎస్టేట్ పడిపోవడంతో ప్రజల చేతుల్లో డబ్బు లేక శుభకార్యాల ఖర్చులు బాగా తగ్గించుకుంటున్నారు. దీనివల్ల ఫోటోగ్రాఫర్లకు వచ్చే గిరాకీ, ఆదాయం కూడా సగానికి పడిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఫోటోగ్రాఫర్లకు ప్రభుత్వ స్థలం ఇచ్చి, ప్రభుత్వ నిధులతో ప్రత్యేకంగా ఒక భవనం నిర్మించిన ఏకైక ప్రాంతం మన సిద్దిపేట మాత్రమే.

ఆ భవనానికి సంబంధించి మిగిలి ఉన్న కొద్దిపాటి పనులను కూడా త్వరలో పూర్తి చేసి, పూర్తిగా వినియోగంలోకి తీసుకొస్తాము. ఫోటోగ్రాఫర్లకు ఉచిత ఓపీ సేవలు అందించే ఉద్దేశంతో హెల్త్ కార్డులు పంపిణీ చేయడం చాలా సంతోషకరం. ఈ కష్టకాలం పోయి ఫోటోగ్రాఫర్లకు మళ్లీ మంచి రోజులు రావాలని, వ్యాపారం బాగా జరిగి మీరంతా ఆర్థికంగా స్థిరపడాలని ఆ దేవుడ్ని ప్రార్థిస్తున్నానని అన్నారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## డేటా సెంటర్ల వెనుక రెండో కోణం

ప్రస్తుత ప్రపంచంలో కృత్రిమ మేధ మౌలిక సదుపాయాలు కూడా రహదార్లు, ఓడరేవుల వంటి వ్యూహాత్మక జాతీయ ఆస్తులుగా మారుతున్నాయి. ఇటీవల విడుదలైన ఒక నివేదిక ప్రకారం, రాబోయే ఐదేళ్లలో భారతదేశంలోని డేటా సెంటర్లలో దాదాపు 7 లక్షల గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లను మోహరించే అవకాశం ఉంది. ఇది దాదాపు 23 బిలియన్ డాలర్ల పెట్టుబడి అవకాశాన్ని సృష్టిస్తుంది. దేశంలో ఎఐ స్వీకరణ, డేటా సెంటర్ల విస్తరణ అనేది ఒక భారీ ఆర్థిక అవకాశాన్ని తెరిచింది. 2025 లో 1.6 గిగావాట్ల (జిడబ్ల్యు)గా ఉన్న భారత్ నిర్మిత డేటా సెంటర్ సామర్థ్యం, 2030 నాటికి దాదాపు 5 జిడబ్ల్యుకు చేరుకుంటుందని అంచనా. దీని వలన దాదాపు 25 బిలియన్ డాలర్ల మూలధన పెట్టుబడి అవసరమవుతుంది. 2024లో 10 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతదేశపు ఎఐ మార్కెట్, 39 శాతం సమ్మేళన వార్షిక వృద్ధిరేటు (సిఎజిఆర్)తో 2032 నాటికి 131 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు. ఇతర అంచనాల ప్రకారం, కృత్రిమ మేధ భారత ఆర్థిక వ్యవస్థకు 2035 నాటికి 1.7 ట్రిలియన్ డాలర్లను జోడించగలదని ప్రభుత్వ అంచనా: ప్రస్తుతం భారతదేశపు టెక్నాలజీ రంగంలో 60 లక్షల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. గత పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, 2024లో ప్రారంభించిన 'ఇండియా ఎఐ మిషన్' కింద ఇప్పటికే సుమారు 38,231 జిపియులు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ జిపియులు భారతీయ స్టార్టప్‌లు, అకాడమియాకు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉంచబడుతున్నాయి. ఇది కొత్త రకాల ఉద్యోగాల సృష్టికి అలాగే దేశీయ పరిశోధనలను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది. ఎఐ యుగంలో జిపియులు పారిశ్రామిక యంత్రాలతో సమానంగా మారుతున్నాయి. పెద్దఎత్తున కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలకు లభ్యత కలిగిన దేశాలు ఎఐ మోడల్ డెవలప్‌మెంట్, డిఫెన్స్ టెక్నాలజీలు అలాగే ఎంటర్‌ప్రైజెస్, ఆటోమేషన్‌లో అసమాన ప్రయోజనాలను పొందగలవు. అదే సమయంలో, ప్రతి మౌలిక సదుపాయాల విస్తరణ వలే, ఎఐ డేటా సెంటర్లకు కూడా తీవ్రమైన సవాళ్లు ఉన్నాయి. ఎఐ డేటా సెంటర్లు చాలా ఎక్కువ విద్యుత్తును వినియోగించుకుంటాయి. 2030 నాటికి భారతదేశంలో డేటా సెంటర్ లోడ్ 1.2 జిడబ్ల్యు నుండి 4.5 జిడబ్ల్యుకు అవసరమవుతుందని, ఎఐ-డ్రివెన్ ఫెసిలిటీలు మాత్రమే సంవత్సరానికి అదనంగా 40 50 టెరావాట్-గంటల (టిడబ్ల్యుహెచ్) విద్యుత్తును వినియోగించగలవని అంచనా. డేటా సెంటర్లు 2030 నాటికి భారతదేశం మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో దాదాపు 5 శాతాన్ని వినియోగిస్తాయని నివేదికలు హెచ్చరిస్తున్నాయి. దాదాపు 13.5 జిడబ్ల్యు వరకు ఎలక్ట్రిసిటీ డిమాండ్ ను చేరుకోవచ్చు. ప్రస్తుత ఎలక్ట్రిసిటీ గ్రిడ్‌పై ఈ ఒత్తిడి, భారీ స్థాయి విద్యుత్ కోతలకు లేదా వోల్టేజ్ అస్థిరతకు కారణం కావచ్చు. డేటా సెంటర్లు అధిక ఉష్ణోగ్రతను నియంత్రించుకోవడానికి భారీ మొత్తంలో నీటిని ఉపయోగిస్తాయి. 2024లో భారతదేశపు డేటా సెంటర్లు సుమారు 150 బిలియన్ లీటర్ల నీటిని వినియోగించుకున్నాయి. అలాగే 2030 నాటికి ఈ సంఖ్య 358 బిలియన్ లీటర్లకు దాదాపు రెట్టింపు లేదా మూడు రెట్లు అవుతుంది. ఒక్క డేటా సెంటర్ రోజుకు సుమారు 20 లక్షల లీటర్ల నీటిని ఉపయోగించే అవకాశం ఉంది. ఇప్పటికే తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్న భారతదేశంలో, ఇది స్థానిక జలాశయాలను మరింత దెబ్బతీస్తుంది. పెద్ద నగరాల్లో డేటా సెంటర్లు కేంద్రీకృతమై ఉండటం వలన ఈ నీటి సంక్షోభం మరింత తీవ్రమవుతుంది. కార్బన్ ఉద్గారాలతోపాటు, ఇంకా పర్యావరణానికి ఇతర నష్టాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఇ -వేస్ట్ ఉత్పత్తి చేసే దేశం. జిపియులు అలాగే ఎఐ హార్డ్‌వేర్ ర్యాపిడ్ రీప్లేస్‌మెంట్ ఎలక్ట్రానిక్ వేస్ట్ సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. అంతేకాకుండా, దక్షిణాసియాలో చాలా వరకు ఎఐ విస్తరణ దృశ్యాలు ఇప్పటికీ స్థిరత్వ పరిగణనలను పూర్తిగా విడిచిపెడుతున్నాయి. ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోని 20 శాతం డేటాను సృష్టిస్తుండగా, ప్రపంచంలోని డేటా సెంటర్లలో కేవలం 3 శాతం మాత్రమే ఇక్కడ ఉన్నాయి. ఇది పెద్ద వృద్ధి అవకాశాన్ని సూచిస్తుంది. కానీ భారీ మౌలిక సదుపాయాల పెట్టుబడులు అవసరమవుతాయి. వాణిజ్య దృక్కోణం నుండి, ఇది లాభదాయకంగా కూడా ఉంటుంది. పెద్ద- స్థాయి జిపియు మోహరింపులు 25.5 శాతం నుండి 28 శాతం వరకు అంతర్గత రాబడి రేటును సృష్టించగలవు. ఇది పెట్టుబడిని ఆకర్షిస్తుంది. వచ్చే ఐదేళ్లలో దేశంలో డేటా సెంటర్ కెపాసిటీ సుమారు 1.6 జిడబ్ల్యు నుండి 5 జిడబ్ల్యుకు చేరుకోబోతోంది. ఇది పెట్టుబడిదారులు అలాగే టెక్నాలజీ సంస్థలకు ఒక సువర్ణ అవకాశం కూడా. మరిన్ని కనుగొనండి బ్రేకింగ్ న్యూస్ అలర్ట్స్ జాతీయ వార్తలు వార్తల వీడియోలు భారతదేశం తన డేటా సెంటర్ సామర్థ్యాన్ని విస్తరించడం ద్వారా తన కృత్రిమ మేధ లక్ష్యాలను సాధించాలనుకుంటోంది. ఇది అమలు చేయబడిన భారీ పెట్టుబడులు నిస్సందేహంగా ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింపజేస్తాయి, సాంకేతిక రంగాన్ని ముందుకు నడిపిస్తాయి. అయితే, దీని కోసం అధిక విద్యుత్, భారీ మొత్తంలో నీటి వినియోగం వల్ల కలిగే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడం చాలా అవసరం. భారతదేశం 2030 నాటికి 50 శాతం పునరుత్పాదక ఇంధన లక్ష్యాన్ని చేరుకున్నప్పటికీ, ఎఐ వృద్ధి ఆ ఇంధన పునాదులను పరీక్షించనుంది. అదే విధంగా, తీవ్ర నీటి కొరత ఉన్న దేశంలో, సాంప్రదాయ జల శీతలీకరణ ప్రత్యామ్నాయాలు ఇకపై సాధ్యం కాకపోవచ్చు. అలాగే, నివేదికల ప్రకారం, ప్రస్తుతం రాష్ట్ర స్థాయి డేటా సెంటర్ విధానాలలో సస్టైనబిలిటీ ప్రొవిజన్లు చాలా తక్కువగా ఉన్నాయి. భారతదేశం విజయం సాధించాలంటే, ఈ అంతరాలను వెంటనే పూడ్చుకోవాలి.

# ఐదు సైబర్ మోసాల గుట్టురట్టు

## - ఐదుగురు కేటుగాళ్ల అరెస్ట్!

**- రూ. 50.31 లక్షల బాధితుల సొమ్ము రీఫండ్ - మల్కాజ్‌గిరి సైబర్ క్రైమ్ పోలీసుల ఘనత**







మల్కాజ్‌గిరి, మే30: భారత శక్తి, దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ విస్తరించి అమాయకులను నిలువునా ముంచుతున్న అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల గుట్టును మల్కాజ్‌గిరి కమిషనరేట్ సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. ఈ వారంలో (మే 24 నుండి మే 30 వరకు) ముమ్మరంగా దర్యాప్తు చేపట్టి, వేర్వేరు కోణాల్లో జరిగిన ఐదు ప్రధాన సైబర్ మోసాలను ఛేదించారు. ఈ కేసుల్లో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, సైబర్ బాధితులకు ఊరటనిస్తూ కోర్టు అనుమతితో రూ. 50,31,050/- ల మొత్తాన్ని రికవరీ చేసి తిరిగి రీఫండ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

### పోలీసులు ఛేదించిన కేసుల వివరాలు ఇలా ఉన్నాయి:

### 1. 'ఏరెస్ డైవర్సిఫైడ్' యాప్ పేరుతో రూ. 1.54 కోట్ల దోపిడీ

ముంబై పరిసర ప్రాంతాల్లో దర్యాప్తు జరిపిన పోలీసులు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌కు సహకరిస్తూ మూల్ (వీబశ్రీవ) బ్యాంక్ ఖాతాలను అందిస్తున్న యాకూబ్ ఇబ్రహీం ఖాన్‌ను అరెస్ట్ చేశారు. బాధితుడిని వాట్సాప్ స్టాక్ మార్కెట్ గ్రూప్‌లో చేర్చి, 'ఞాతీవం౦ఆజవతీం౦అటఅవ౦' అనే నకిలీ ట్రేడింగ్ యాప్ ద్వారా భారీ లాభాలు వస్తున్నట్లు నమ్మించారు. నమ్మకం కుదిరేందుకు మొదట్లో కొంత విత్‌డ్రా కూడా ఇచ్చారు. ఆ తర్వాత బాధితుడితో రూ. 1,55,94,358/- పెట్టుబడి పెట్టించడమే కాకుండా, లోన్ క్లియరెన్స్ పేరుతో మరో రూ. 28 లక్షలు వసూలు చేశారు. చివరకు యాప్ నిలిపివేసి మొత్తం రూ. 1,54,58,718/- ముంచేశారు.

### 2.కొటక్ ఇన్‌సైట్ గ్రూప్ పేరుతో రూ. 80 లక్షల మోసం

సూర్యాపేట పరిసరాల్లో రైడ్ చేసిన పోలీసులు ఒర్సు శ్రీనివాసు అనే నిందితుడిని పట్టుకున్నారు. 'ఞ147 ఖూాూఖ ×చీూ×+ు ౝాఖచీఱూూదీూజు' అనే వాట్సాప్ గ్రూప్, 'ఖశ్రీౌతీశీ ఞాజూజూ' అనే నకిలీ అప్లికేషన్ ద్వారా ఒక బాధితుడికి అధిక లాభాల స్క్రీన్‌షాట్లు చూపిస్తూ బురిడీ కొట్టించారు. నిందితుల మాటలు నమ్మి బాధితుడు రూ. 82,36,001/- బదిలీ చేయగా, చివరకు రూ. 80,86,001/- నెట్ లాస్ మిగిలింది.

### 3.బ్యాక్‌డోర్ జాబ్స్ పేరుతో గండ నాగరాజు లీలలు

హైదరాబాద్‌లోని బచ్చుపల్లి పరిసరాల్లో దర్యాప్తు చేపట్టి సైబర్ కేటుగాళ్లకు బ్యాంక్ ఖాతాలు సమకూరుస్తున్న గుండా నాగరాజును పోలీసులు అరెస్ట్ చేశారు. 'హవతీజఱఎవచీశీష ఖజూఙ్ఖవం' అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా బాధితుడైన పులి రంజిత్ కుమార్‌ను టార్గెట్ చేశారు. తాను హెచ్‌సీఎల్, ఆప్టమ్ కంపెనీల్లో రీసోర్స్ మేనేజర్‌నని నమ్మించి, గూగుల్ మీట్‌లో నకిలీ ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. ప్రాసెసింగ్ ఫీజులు, సీటీసీ ఛార్జీల పేరుతో 11 విడతల్లో రూ. 2,67,000/- యూపీఐ ద్వారా గుంజారు. బాధితుడు 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయడంతో నిందితుడి బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు.

### 4.స్విగ్గీ, అమేజాన్ ప్రతినిధులమంటూ కస్టమర్ కేర్ ఫ్రాడ్

సికింద్రాబాద్‌లోని మెట్టుగూడ ప్రాంతంలో పిల్లి ఆదిత్య అనే నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వాలెట్‌లో రీఫండ్ ఆగిపోయిందంటూ నమ్మించి బాధితుడితో పాటు అతని స్నేహితుల నుండి పలు విడతలుగా డబ్బులు వసూలు చేశారు. ఆ తర్వాత అమేజాన్ ఉద్యోగిగా నటిస్తూ హై-వాల్యూ లావాదేవీల పేరుతో మరో రూ. 70,000/- డిమాండ్ చేయడంతో బాధితుడికి అనుమానం వచ్చింది. తీరా ఆరా తీస్తే అలాంటి వాలెట్ సిస్టమ్ లేదని, నిందితుడు చూపిన ఆధార్ కార్డ్ కూడా నకిలీదని తేలింది. ఈ కేసులో బాధితుడు రూ. 1,99,946/- నష్టపోయాడు.

### 5.సీబీఐ అధికారులమంటూ 'డిజిటల్ అరెస్ట్' తీవ్ర భయాందోళన

ఆంధ్రప్రదేశ్ లోని ఎన్టీఆర్ జిల్లాలో నిందితుడు పగడాల కృష్ణా చైతన్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుడికి ఒక అపరిచిత నంబర్ నుండి కాల్ చేసి, తాము సీబీఐ అధికారులమంటూ పరిచయం చేసుకున్నారు. బాధితుడి ఆధార్ కార్డుపై ఢిల్లీ కెనరా బ్యాంక్‌లో ఖాతా తెరిచి, రూ. 485 కోట్ల భారీ స్కామ్‌కు పాల్పడ్డారని బెదిరించారు. బాధితుడిని నిరంతరం వీడియో సర్వైలెన్స్‌లో ఉంచి తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేశారు. భయాందోళనకు గురైన బాధితుడు నిందితులు చెప్పిన ఖాతాలకు ఏకంగా రూ. 71,25,094/- బదిలీ చేసి మోసపోయాడు.

### - నెటిజన్లు అప్రమత్తంగా ఉండాలి: పోలీసుల సూచనలు

ప్రస్తుతం పార్ట్ టైమ్ జాబ్స్, ఇన్వెస్ట్‌మెంట్ మరియు డిజిటల్ అరెస్ట్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయని మల్కాజ్‌గిరి సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరించారు. ప్రజలు కింది జాగ్రత్తలు ఖచ్చితంగా పాటించాలని కోరారు:

**- తెలియని వ్యక్తులు పంపే లింకుల ద్వారా ఎలాంటి ట్రేడింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దు.**

- వాట్సాప్, ఎస్ఎంఎస్, ఈమెయిల్స్ ద్వారా వచ్చే అనుమానాస్పద వెబ్‌సైట్ లింకులను క్లిక్ చేయొద్దు.
- లాభాలపై పన్ను (ప్రాఫిట్ టాక్స్), అకౌంట్ అన్‌ఫ్రీజ్ ఫీజుల పేరిట అదనపు డబ్బులు చెల్లించవద్దు.
- ప్రభుత్వ అధికారులు ఎవరూ డిజిటల్ అరెస్టులు చేయరని, అలా భయపెడితే వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.
- సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వస్తే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలి లేదా www.cybercrimes.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

# కిశోర బాలికల సాధికారతే సమాజాభివృద్ధికి పునాది..

**- బాలల మాక్ పార్లమెంట్‌లో మంత్రి సీతక్క పిలుపు**

**- సెల్‌ఫోన్లను జ్ఞానార్జనకే పరిమితం చేయాలి: జిల్లా కలెక్టర్**




రంగారెడ్డి , మే 30: భారతశక్తి, కిశోర బాలికల సాధికారతే సమాజాభివృద్ధికి పునాది అని, విద్య, ఆరోగ్యం, సంస్కారం బాలికలను ఉన్నత శిఖరాలకు చేరుస్తాయని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. ప్రభుత్వ 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా వారోత్సవాలను నిర్వహించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో జరిగిన 'బాలల మాక్ పార్లమెంట్ - స్నేహ కౌమార బాలికలతో బాలల హక్కుల సదస్సు' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ముందుగా 'అమ్మ మాట-అంగన్వాడీ బాటా' కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ చిన్నారులకు యూనిఫామ్‌లు, విద్యాభ్యాస ధ్రువీకరణ పత్రాలను మంత్రి అందజేశారు.

### -లక్ష్యం వైపు అడుగులు వేయాలి

సదస్సులో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కిశోర బాలికల సాధికారత, విద్యా ప్రగతి, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల పెంపే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత బాలికలను చిన్న వయసు నుంచే గుర్తించి సరైన దిశానిర్దేశం చేస్తే.. భవిష్యత్తులో వారు ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు, ఎస్పీలుగా ఉన్నత స్థానాలకు చేరుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.
"విద్య జీవితాన్ని మార్చగల అత్యంత శక్తివంతమైన ఆయుధం" అని నెల్సన్ మండేలా చెప్పిన మాటలను ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు.

బాలికలు చదువుతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్‌ను కేవలం వినోదం కోసమే కాకుండా.. జ్ఞానాన్ని, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి వాడుకోవాలన్నారు. జీవితంలో స్పష్టమైన లక్ష్యంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.

### - ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

పోషకాహారం తీసుకోవడం, స్థానిక ఆహార పదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని మంత్రి హితవు పలికారు. మహిళా సంఘాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వడ్డీ లేని రుణాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది కిశోర బాలికలు "స్నేహ" కార్యక్రమంలో భాగస్వాములుగా ఉన్నారని.. వారికి సైకిల్ తొక్కడం, నాయకత్వ వికాసం, వ్యక్తిత్వాభివృద్ధి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.

### - బాల్య వివాహాలను అడ్డుకోవాలి: కలెక్టర్

గత రెండు దశాబ్దాలుగా గ్రామీణాభివృద్ధిలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా కలెక్టర్ కొనియాడారు. సోషల్ మీడియా ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో కిశోర బాలికలకు సరైన మార్గనిర్దేశం అవసరమని, అందుకోసం 'స్నేహ' గ్రూపులు చక్కని వేదికలని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండకుండా ఏ బాలికకూ వివాహం జరగకుండా గ్రామస్థాయిలో సంఘాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాల్య వివాహాల వల్ల విద్య, ఆరోగ్యం దెబ్బతింటాయని హెచ్చరించారు. రీల్స్, సోషల్ మీడియాలో సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి పెట్టాలని విద్యార్థినులకు సూచించారు.

### - ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్

ఈ సదస్సులో నిర్వహించిన మాక్ పార్లమెంట్‌లో విద్య, ఆరోగ్యం, హోం శాఖలపై జరిగిన చర్చలు ఆకట్టుకున్నాయి. స్పీకర్, మంత్రులుగా స్నేహ సంఘాల సభ్యులు చక్కటి పాత్రలు పోషించారని కలెక్టర్ అభినందించారు. అనంతరం నూతన అక్షరాస్యులకు, వారికి చదువు నేర్పిన వాలంటీర్లకు మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమం ముగిసిన తర్వాత మంత్రి, చేవెళ్ళ శాసనసభ్యుడు, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు బాలికలతో కలిసి భోజనం చేశారు.

### పాల్గొన్న ప్రముఖులు:

ఈ కార్యక్రమంలో చేవెళ్ళ శాసనసభ్యుడు కాలే యాదయ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్, సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓజా, అదనపు కలెక్టర్ కె.కిరణ్మయి, విమెన్ కమిషన్ మెంబర్ సదాలక్ష్మి, పీడీ డీఆర్డీఏ శ్రీలత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేశ్ మోహన్, పీడీ మెప్మా వెంకట నారాయణ, అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ అనిత, డీపీఎంలు, ఏపీఎంలు, స్నేహ సంఘాల సభ్యులు, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు పండుగ కార్యక్రమం ను విజయ వంతం చేయండి

**– జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**

వై ఎస్ ఆర్ కడప,మే 30(భారత శక్తి ): వ్యవసాయ రంగం లో ఆధునిక సాంకేతికతలు, నూతన ఆవిష్కరణలు, ఉద్యాన పంటల ప్రాధాన్యతపై రైతులకు అవగాహన కల్పించేందుకు జూన్ 12 వ తేదీ మరియు 13 వ తేదీలలో "రైతు పండుగ- అగ్రి ఇన్నోవేషన్ ఱ హార్టికల్చర్ ఎక్స్పో 2026" కార్యక్రమాన్ని మేడా కన్వెన్షన్ సెంటర్ నందు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు..వై ఎస్ ఆర్ కడప జిల్లా లో "రైతు పండుగ- అగ్రి ఇన్నోవేషన్ ఱ హార్టికల్చర్ ఎక్స్పో 2026" కార్యక్రమాన్ని 2026,జూన్ 12 ఱ13 వ తేదీలలో రెండు రోజుల పాటు వ్యవసాయం మరియు ఉద్యానవన శాఖలకు సంబంధించిన ఆధునిక యంత్రాలు,సాంకేతిక పద్ధతులు,అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలు, సేంద్రియ వ్యవసాయం,డ్రిప్ ఱ స్ప్రింక్లర్ పద్ధతులు,విలువ ఆధారిత వ్యవసాయం,పంటల సంరక్షణ,మార్కెటింగ్ అవకాశాలు తదితర అంశాలపై ప్రత్యేక ప్రదర్శనలు మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహించ బడుతాయని తెలిపారు. అలాగే శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు మరియు ప్రగతిశీల రైతులతో ప్రత్యక్ష పరస్పర చర్చలు ఏర్పాటు చేయడం, రైతులు తమ సమస్యలను నిపుణులతో చర్చించి పరిష్కార సూచనలు పొంద వచ్చునని తెలిపారు. జిల్లాలోని రైతులు, రైతు సంఘాలు, యువ రైతులు, మహిళా రైతులు మరియు వ్యవసాయంపై ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

# జిల్లా ఎస్పీని కలిసిన జె జాక్ కో-కన్వీనర్ రామూర్తి



ములుగు జిల్లా ప్రతినిధి, మే 30 (భారత శక్తి): ములుగు జిల్లా జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్నాథ్ ను జె జాక్ కో-కన్వీనర్ టీ న్యూస్ రిపోర్టర్ పోలోజు రామూర్తీ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ములుగు జిల్లా లోని జర్నలిస్ట్ యూనియన్లకు అతీతంగా పాత్రికేయుల సమస్యలపై స్పందించేందుకు జర్నలిస్టులకు జె జాక్ అండగా ఉండి పనిచేస్తుందని ఎస్పీకి ఆయనవివరించారు.

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా నియమితులైన కైలాస్ శ్రీనివాస్ గుప్తా



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే 30: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా కైలాస్ శ్రీనివాస్ గుప్తా నియామితులయ్యారు. ఈ సందర్భంగా కైలాస్ శ్రీనివాస్ గుప్తా గారికి నియామక పత్రం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అందజేశారు.


## యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్స్ టాలెంట్ అచ్యువర్స్ అవార్డు అందుకున్న దళిత రత్న డా. ఏర్పుల శ్రీనివాసుకు ఘన సన్మానం




జిన్నారం మున్సిపల్, మే 30, (భారత శక్తి న్యూస్): సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ పరిధిలోని జిన్నారం గ్రామానికి చెందిన ప్రముఖ దళిత ఉద్యమ నాయకుడు, సీనియర్ పాత్రికేయుడు, దళిత రత్న డాక్టర్ ఏర్పుల శ్రీనివాస్కు ఇటీవల యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా బుక్ ఆఫ్ రికార్డు "టాలెంట్ అచ్యువర్స్ అవార్డు" లభించిన సందర్భంగా స్థానిక యువజన సంఘాలు ఘనంగా సన్మానించాయి. ఈ కార్యక్రమంలో ఎన్ ఎం ఎం యువసేన ఫౌండేషన్ చైర్మన్ నీరుడి మహేష్ ముదిరాజ్, వజ్రభారతి పాత్రికేయుడు జింక గణేష్ ముదిరాజ్తో పాటు సంఘ సభ్యులు డా.ఏర్పుల శ్రీనివాస్ నివాసానికి వెళ్లి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నీరుడి మహేష్ ముదిరాజ్, జింక గణేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే డా.ఏర్పుల శ్రీనివాస్ సమాజ సేవలో చురుకుగా పాల్గొంటూ దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయనకు ఇప్పటికే అంతర్జాతీయ అంబేద్కర్ సేవా పురస్కార్, అంతర్జాతీయ దళిత రత్న అవార్డు సహా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలు లభించాయని పేర్కొన్నారు. అదేవిధంగా 7 వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించడం జిన్నారం మున్సిపల్ ప్రజలకు గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సామాజిక ఉద్యమాల ద్వారా అట్టడుగు స్థాయి ప్రజలకు సేవలందిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిన్నారం మున్సిపల్ కేంద్రానికి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో డా. ఏర్పుల శ్రీనివాస్ సేవలు అభినందనీయమని యువజన నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# బీరు సీసాపై 'స్టిక్కర్' బాదుడు..!

**-కోనరావుపేటలో వైన్స్ షాప్ ల అదనపు వసూళ్ల దందా..**
**-బెల్ట్ షాపులకు మద్యం విక్రయిస్తే బీరుకు రూ.10, ఫుల్లుకు 40.అదనం..**
**-ఎవరి ఆదేశాలతో ఈ వసూళ్లు?**
**-ఈ వసూళ్లకు ప్రభుత్వ లేదా ఎక్సైజ్ శాఖ అనుమతి ఉందా?**
**-మూడు వైన్స్ షాపులు.. ఒకే సిండికేట్..!**
**-స్టిక్కర్ పేరుతో దోపిడీ..ఎక్సైజ్ అధికారుల మౌనంపై అనుమానాలు..?**




భారత శక్తి, రాజన్న సిరిసిల్ల, మే 30: కోనరావుపేట మండలంలో మద్యం విక్రయాల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఇక్కడి వైన్స్ షాపుల నిర్వాహకులు ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీరు, మద్యం సీసాలపై ప్రత్యేక స్టిక్కర్లు అతికించి బెల్టు షాపులకు విక్రయిస్తే ఒక్కో బీరు సీసాకు అదనంగా రూ.10, ఫుల్లుకు 40 చొప్పున వసూలు చేస్తున్నట్లు మద్యం ప్రియులు, బెల్ట్ షాపుల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. మండలంలోని మూడు వైన్స్ షాపుల నిర్వాహకులు పరస్పరం కుమ్మక్కై సిండికేట్గా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.బెల్ట్ షాపులకు సరఫరా చేసే మద్యం సీసాలపై స్టిక్కర్లు వేసి అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని సమాచారం. దీంతో బెల్ట్ షాపుల నిర్వాహకులు కూడా తమ లాభాలను జోడించి ఒక్కో సీసాపై రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. "వైన్స్ షాపుల వద్దనే ఎక్కువ ధర చెల్లించాల్సి వస్తోంది. అందుకే మేమూ అదనంగా తీసుకోవాల్సి వస్తోంది" అని బెల్ట్ షాపుల నిర్వాహకులు చెబుతున్నారు. మరోవైపు ఈ అదనపు భారం అంతిమంగా మద్యం ప్రియులపైనే పడుతోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్టిక్కర్ విధానం ప్రభుత్వ నిబంధనల్లో భాగమా? ఎక్సైజ్ శాఖ ఆదేశాల మేరకే అమలవుతోందా? లేక నిర్వాహకుల స్వచ్ఛంద నిర్ణయమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మండలంలో జరుగుతున్న ఈ వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి?. వైన్స్ షాపుల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి, కోనరావుపేట మండలంలోని వైన్స్ షాపులపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమ వసూళ్లు చేస్తున్న బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు కోరుతున్నారు.

# పాత్రికేయులకు భాషా వినియోగంపై అవగాహన కల్పించిన సీనియర్ పాత్రికేయులు, శిక్షకులు రాఘవ శర్మ



కడప, భారత శక్తి ప్రతినిధి, మే 30: జిల్లా గ్రామీణ విలేకరుల మొదటి రోజు పునశ్చరణ శిక్షణా తరగతుల మధ్యాహ్న షెషన్ లో పాత్రికేయులకు భాషా వినియోగంపై సీనియర్ పాత్రికేయులు, శిక్షకులు రాఘవ శర్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన జర్నలిజంలో భాష ప్రాధాన్యంపై విస్తృతంగా వివరిస్తూ, ఆధునిక తెలుగు భాష, వ్యవహారిక భాష, గ్రాంధిక భాషల మధ్య ఉన్న తేడాలు మరియు వాటి వినియోగ విధానాలను పాత్రికేయులకు వివరించారు. భాష కాలానుగుణంగా మారుతూ ప్రజల నిత్యజీవితంలో సులభంగా వినియోగంలోకి వచ్చినప్పుడు అది వ్యవహారిక భాషగా రూపాంతరం చెందుతుందని ఆయన తెలిపారు. ప్రజలు మాట్లాడే భాష, వారి ఆలోచనలు, జీవన విధానాలు, సామాజిక పరిస్థితులు భాషా రూపాన్ని ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు. జర్నలిజంలో పాఠకులకు సందేశం స్పష్టంగా చేరడం ప్రధాన లక్ష్యమని, అందుకే వార్తా రచనలో క్లిష్టమైన పదజాలం కంటే సరళమైన, సూటిగా అర్థమయ్యే పదాలను ఉపయోగించాలని సూచించారు. వార్తల్లో అనవసరమైన అలంకార పదాలు, పొడవైన వాక్యాలు, అధిక గ్రాంధిక పదజాలం వాడకం పాఠకుడికి భారంగా మారుతుందని చెప్పారు. ఒక వార్తను చదివిన వెంటనే పాఠకుడు దాని భావాన్ని అర్థం చేసుకునేలా భాష ఉండాలని పేర్కొన్నారు. ప్రజల భాషలోనే వార్త రాస్తే అది మరింత ప్రభావవంతంగా ఉంటుందని వివరించారు. భాషా పరిణామ క్రమాన్ని వివరిస్తూ కడప జిల్లాకు చెందిన ప్రముఖ సాహితీవేత్తలు, రచయితలు తెలుగు భాషకు చేసిన సేవలను గుర్తు చేశారు. 16వ శతాబ్దానికి చెందిన పెద్దతిరుమలాచార్యులు, తాళ్లపాక అన్నమాచార్యులు తమ రచనల ద్వారా భక్తి సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేశారని తెలిపారు. వారి కీర్తనల్లో కనిపించే సరళమైన భాష ప్రజలతో నేరుగా అనుసంధానం ఏర్పరిచిందన్నారు. అలాగే పుట్టపర్తి నారాయణాచార్యులు, గజ్జల మల్లారెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి వంటి రచయితలు తెలుగు భాషకు ప్రత్యేకమైన శైలిని అందించారని చెప్పారు. ముఖ్యంగా కేతు విశ్వనాథరెడ్డి రచనల్లో రాయలసీమ మాండలిక భాషకు విశిష్ట స్థానం కల్పించడం ద్వారా ప్రాంతీయ భాషా సంపదను సాహిత్యంలో నిలబెట్టారని వివరించారు. రచయితలు తమ ప్రాంతీయ సంస్కృతి, జీవన విధానాలను భాష ద్వారా ఎలా ప్రతిబింబించారో ఉదాహరణలతో వివరించారు. ప్రస్తుత సమాజంలో పత్రికలు కేవలం వార్తలను అందించే సాధనాలు మాత్రమే కాకుండా నిరంతర విద్యా కేంద్రాలుగా పనిచేస్తున్నాయని రాఘవ శర్మ పేర్కొన్నారు. ప్రజలు ప్రతిరోజూ చదివే పత్రికల ద్వారానే కొత్త పదాలు, కొత్త భావనలు, భాషా వినియోగ పద్ధతులను నేర్చుకుంటారని చెప్పారు. అందువల్ల భాషను సంరక్షించడం, అభివృద్ధి చేయడం, కొత్త తరాలకు చేరవేయడంలో పాత్రికేయుల బాధ్యత ఎంతో కీలకమన్నారు.

మాండలిక పదాల వినియోగంపై మాట్లాడుతూ, ప్రాంతీయ భాషా వైవిధ్యం తెలుగు భాషకు సంపద అని పేర్కొన్నారు. అయితే వార్తా రచనలో మాండలిక పదాలను ఉపయోగించినప్పుడు వాటి అర్థం అందరికీ సులభంగా అర్థమయ్యేలా జాగ్రత్త వహించాలని సూచించారు. స్థానికతను కాపాడుతూ, పాఠకుడికి స్పష్టతను అందించడం పాత్రికేయుడి నైపుణ్యమని తెలిపారు. తెలుగు వ్యాకరణంపై అవగాహన ప్రతి పాత్రికేయుడికి తప్పనిసరి అని చెప్పారు. వాక్య నిర్మాణం, విరామ చిహ్నాల వినియోగం, పదాల సరైన రూపాలు, సంధులు, సమాసాలు వంటి అంశాలపై పట్టు ఉంటే వార్త మరింత నాణ్యంగా తయారవుతుందని వివరించారు. భాషా స్థిరత్వం కోసం ప్రమాణ భాషను పాటించడంతో పాటు కాలానుగుణ మార్పులను కూడా స్వీకరించాల్సిన అవసరం ఉందన్నారు. మొత్తంగా భాష అనేది పాత్రికేయుడి ప్రధాన ఆయుధమని, సరైన పదప్రయోగం, స్పష్టమైన భావవ్యక్తీకరణ, వ్యాకరణబద్ధమైన రచన, పాఠకుడికి చేరువైన శైలి ఉంటేనే మంచి జర్నలిస్టుగా ఎదగగలరని రాఘవ శర్మ సూచించారు. భాషను ప్రేమిస్తూ, నిరంతరం చదువుతూ, రచనలో మెరుగులు దిద్దుకుంటూ ఉంటే జర్నలిజం రంగంలో విశిష్ట స్థానం సంపాదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

# సమాజానికి దిశానిర్దేశం చేసే టార్చిలైట్లా వార్తలు ఉండాలి

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**
**-రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణ విలేకరులకు రెండు రోజుల పునశ్చరణ శిక్షణా తరగతుల ప్రారంభం**




కడప, మే 30(భారత శక్తి ): మీడియా అందించే ప్రతి వార్త సమాజానికి వెలుగు చూపే టార్చిలైట్లా ఉండాలని, ప్రజలను ఆలోచింపజేస్తూ సామాజిక మార్పుకు వారధిగా నిలవాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా గ్రామీణ విలేకరులకు సూచించారు.శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా గ్రామీణ విలేకరులకు నిర్వహిస్తున్న రెండు రోజుల పునశ్చరణ శిక్షణా తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ అధ్యక్షత వహించగా, శిక్షకులుగా సీనియర్ పాత్రికేయులు, రచయిత ఉమామహేశ్వరరావు, ఎపియుడబ్ల్యుజె జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయకులు రామసుబ్బారెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఎడి పద్మజ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా మీడియా ప్రతినిధులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ నాల్గవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగడం, త్వరలోనే మూడో స్థానానికి చేరుకునే దిశగా పయనించడం దేశ ప్రజలందరికీ గర్వకారణమన్నారు. దేశ అభివృద్ధిలో మీడియా పాత్ర అత్యంత కీలకమైన పాత్ర పోషించే స్థాయిలోకి ఎదగాలని సూచించారు. ప్రస్తుతం మీడియా ద్వారా అందుతున్న సమాచారం సమాజానికి, ప్రభుత్వ పరిపాలనకు పరిమిత స్థాయిలో మాత్రమే ఉపయోగపడుతోందని, భవిష్యత్తులో వార్తలు ప్రజల జీవితాలను ప్రభావితం చేసే విధంగా, కనీసం 70 శాతం మేర ఉపయోగకరంగా ఉండేలా విలేకరులు తమ ఆలోచనా విధానాన్ని, విశ్లేషణాత్మక దృష్టిని విస్తరించుకోవాలని సూచించారు. "వార్త అనేది కేవలం సంఘటన వివరణ మాత్రమే కాదు; అది సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తి. ప్రజల్లో చైతన్యం పెంచుతూ, సమస్యలపై చర్చకు దారి తీస్తూ, పరిష్కార మార్గాలను సూచించగలగాలి" అని ఆయన సూచించారు. ఇరవై ఏళ్ల క్రితం సమాజంలో, పరిపాలనలో కనిపించిన ప్రశ్నించే తత్వం ప్రజాస్వామ్యానికి బలమని, ఆ విలువలను తిరిగి బలోపేతం చేసే దిశగా మీడియా కృషి చేయాలని కోరారు. ప్రజా సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, నిర్మాణాత్మక చర్చకు దోహదపడే కథనాలను అందించాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు. పాత్రికేయులకు భావ ప్రకటన స్వేచ్ఛ ఉన్నప్పటికీ వ్యక్తులు, సమాజం లేదా ప్రభుత్వ వ్యవస్థల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా బాధ్యతారహితంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా సమానంగా ఉండాలని, ప్రతి జర్నలిస్టు వృత్తి నైతిక విలువలను పాటిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. డిజిటల్ యుగంలో కంటెంట్ క్రియేషన్కు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడిందని, విలేకరులు కేవలం వార్తల సేకరణకే పరిమితం కాకుండా విశ్లేషణాత్మక, సమాచార ప్రధాన, ప్రజోపయోగ కంటెంట్ రూపొందించడంపై దృష్టి సారించాలని సూచించారు. కృత్రిమ మేధస్సు, డిజిటల్ మీడియా, ఆధునిక సమాచార సాంకేతికతలపై అవగాహన పెంపొందించుకుని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ పాత్రికేయులు ప్రజాస్వామ్యానికి కాపలాదారులు కావాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుంటూ ప్రజలకు నిష్పాక్షిక, బాధ్యతాయుత సమాచారాన్ని అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న ఆయన, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా వారధిగా నిలుస్తోందన్నారు. అందుకే గ్రామీణ స్థాయి విలేకరులు సమాజ అవసరాలను అర్థం చేసుకుని ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వార్తలను అందించాలని సూచించారు.

మీడియా చరిత్రను ప్రస్తావిస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ప్రజల్లో చైతన్యం రగిలించేందుకు పత్రికలు కీలక పాత్ర పోషించాయని, అనంతరం ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే సాధనంగా నిలిచాయని గుర్తు చేశారు. అయితే కాలక్రమేణా వాణిజ్య ధోరణులు, రాజకీయ ప్రభావాలు, పోటీ వాతావరణం పెరగడంతో జర్నలిజం మూల విలువలు కొంత మేర దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మీడియా రంగం తన విశ్వసనీయతను కాపాడుకోవాలంటే నిజాయితీ, నిష్పాక్షికత, సామాజిక బాధ్యతలను ప్రధానంగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడమే జర్నలిస్టుల ప్రధాన కర్తవ్యమని, ఏ పరిస్థితుల్లోనూ పక్షపాత ధోరణికి తావివ్వకూడదన్నారు. సోషల్ మీడియా విస్తృతంగా వినియోగంలోకి వచ్చిన ప్రస్తుత కాలంలో సమాచారాన్ని ధృవీకరించి మాత్రమే ప్రచారం చేయాలని ఆయన సూచించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఎడి పద్మజ మాట్లాడుతూ జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడం, గ్రామీణ ప్రాంత పాత్రికేయులకు వృత్తిపరమైన మెళకువలు అందించడం కోసం అకాడమీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. జర్నలిస్టుల సామర్థ్యాలను పెంపొందించేందుకు శిక్షణా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. గ్రామీణ స్థాయి జర్నలిస్టులకు నిర్వహిస్తున్న ఇటువంటి పునశ్చరణ తరగతులు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడతాయని, భవిష్యత్తులో కూడా అకాడమీ మరిన్ని శిక్షణా కార్యక్రమాలను చేపడుతుందని ఆమె తెలిపారు.ఎపియుడబ్ల్యుజె జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయకులు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ సమాజ హితం, ప్రజా చైతన్యం, అభివృద్ధి లక్ష్యాల సాధనలో మీడియా ఒక శక్తివంతమైన భాగస్వామిగా నిలవాలని ఆకాంక్షించారు. కరోనా మహమ్మారి వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా మీడియా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించిందని ఆయన కొనియాడారు. ప్రత్యక్ష సమావేశాలకు పరిమితులు ఉన్నప్పటికీ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఆన్లైన్ వేదికల ద్వారా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జర్నలిస్టుల అభ్యాసానికి దోహదపడుతోందన్నారు. సీనియర్ పాత్రికేయులు, రచయిత ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ స్థాయి జర్నలిస్టులు కేవలం సంఘటనలను నమోదు చేసే వారిగా కాకుండా, సమాజంలో జరుగుతున్న పరిణామాలను విశ్లేషించి ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందించే బాధ్యతాయుత పాత్రికేయులుగా ఎదగాలని సూచించారు. గ్రామీణ జర్నలిస్టులే మీడియా వ్యవస్థకు మూలస్తంభాలని పేర్కొన్నారు. గ్రామాల్లో జరిగే సంఘటనలు, ప్రజల సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు పరిస్థితులను ముందుగా గుర్తించి సమాజం దృష్టికి తీసుకువచ్చేది గ్రామీణ విలేకరులేనని అన్నారు. వార్త రాయడంలో ఐదు ముఖ్యమైన అంశాలు ఏమి జరిగింది, ఎక్కడ జరిగింది, ఎప్పుడు జరిగింది, ఎవరు సంబంధితులు, ఎందుకు జరిగింది ? అనే అంశాలపై స్పష్టత ఉండాలని వివరించారు. ఒక మంచి వార్త ప్రజలకు సమాచారం ఇవ్వడమే కాకుండా సమస్యల పరిష్కారానికి మార్గం చూపేలా ఉండాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రింట్ అండ ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు, వీడియో గ్రాఫర్లు, ఫోటోగ్రాఫర్లు తదితర మీడియా రంగ ప్రతినిధులు హాజరయ్యారు.

# విశిష్ట సేవలకు ఘన సత్కారం

**పదవి విరమణ పొందుతున్న పోలీసు అధికారులకు వీడ్కోలు పలికిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల**



నిర్మల్, జిల్లా ప్రతినిధి, మే 30(భారత శక్తి) నేడు 31.05.2026 రోజున పదవి విరమణ పొందనున్న జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ వారిని ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ1983 లో గంగాధర్ కానిస్టేబుల్ గా నియామకమై, తర్వాత కాలంలో ఎస్సైగా పదోన్నతి పొంది, ప్రస్తుతం నిర్మల్ టౌన్ లో ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్నారు.దాదాపుగా 43 సంవత్సరాలు,1989 బ్యాచ్ కి చెందిన ఎస్.సుదర్శన్ (ఏ.ఎస్.ఐ) భైంసా టౌన్,37 సంవత్సరాలు,1989 బ్యాచ్ కి చెందిన ఎమ్.గణేష్(ఏ.ఎస్.ఐ),నిర్మల్ టౌన్,37 సంవత్సరాలు,1990 బ్యాచ్ కి చెందిన కె.వి.రాజా రెడ్డి,(హెడ్ కానిస్టేబుల్), లోకేశ్వరం పోలీస్ స్టేషన్,36 సంవత్సరాలు,1990 బ్యాచ్ కి చెందిన బి.మల్లేశ్వర్(హెడ్ కానిస్టేబుల్), మామడ పోలీసు స్టేషన్,36 సంవత్సరాలు పోలీసు శాఖలో విశిష్ట సేవలు అందించి నేడు పదవి విరమణ చేయడం తీరని లోటు అన్నారు.వారు పోలీసు శాఖకు అందించిన సేవలు మారువలేనివని వారి సేవలను కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం పోలీసు శాఖ నుండి వారికి రావలసిన అన్నిరకాల రిటైర్మెంట్ బెన్ఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామని, రిటైర్మెంట్ అనంతరం కూడా ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని, మిగిలిన శేష జీవితం అతని కుటుంబంతో సంతోషంగా, ఆరోగ్యంగా గడపాలని కోరుకుంటున్నాను అని అన్నారు. జిల్లా పోలీస్ శాఖ తరపున వారికి, వారి కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తో పాటు జిల్లా అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏవో యూనస్ అలీ, ఆర్.ఐ రామ్ నిరంజన్ రావ్, ఇతర పోలీసు సిబ్బంది,రిటైర్డ్ అవుతున్న కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం అన్‌లోడింగ్‌ను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే,30 (భారత శక్తి)సాత్ గావ్, నగర్ గ్రామాల్లోని రైస్ మిల్లుల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు, ఆధునిక యంత్రాల వినియోగంపై యాజమాన్యాలకు సూచనలు, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.జిల్లాలో ధాన్యం కొనుగోలు, అన్‌లోడింగ్ ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఎక్కడా జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శనివారం లోకేశ్వరం మండలంలోని సాత్ గావ్, నగర్ గ్రామాల్లో ఉన్న రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను సమీక్షించారు.సాత్ గావ్ గ్రామంలోని శ్రీదుర్గా రైస్ మిల్లును సందర్శించిన కలెక్టర్, అక్కడ యంత్రాల సహాయంతో జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక యంత్రాల వినియోగం ద్వారా తక్కువ సమయంలో, తక్కువ మంది హమాలీలతో అధిక పరిమాణంలో ధాన్యం సంచులను అన్‌లోడ్ చేయవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని ఇతర రైస్ మిల్లుల యాజమాన్యాలు కూడా ఇటువంటి అధునాతన యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.తనిఖీల సందర్భంగా మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్య, మిల్లుల నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు అన్‌లోడ్ చేసిన ధాన్యం పరిమాణం, ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీల సంఖ్య తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. లారీల ద్వారా వచ్చే ధాన్యాన్ని వెంటవెంటనే అన్‌లోడ్ చేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం నగర్ గ్రామంలోని రైస్ మిల్లును సందర్శించిన కలెక్టర్, ధాన్యం నిల్వకు అవసరమైన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. తగిన సంఖ్యలో హమాలీలను అందుబాటులో ఉంచి అన్‌లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, లోకేశ్వరం తహసిల్దార్ సూర్యారావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 30(భారత శక్తి) కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు రాజశ్రీ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రేపు ధర్మపురిలో లోన్ మేళా, ఎస్‌హెచ్‌జీ అవగాహన కార్యక్రమం

ధర్మపురి, మే 30 (భారత శక్తి): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక--99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా ఆదివారం (మే 31) ఉదయం 9 గంటలకు ధర్మపురిలోని నంది విగ్రహం వద్ద లోన్ మేళా ఉ ఎస్‌హెచ్‌జీ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పురపాలక సంఘం కమిషనర్ తెలిపారు.ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యుల్లో నిరక్షరాస్యుల నుంచి ఉత్తమ అక్షరాస్యులుగా ఎదిగిన మహిళలను సన్మానించనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొననున్నట్లు కమిషనర్ తెలిపారు.

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) పకడ్బందీగా చేపట్టాలి


**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 30(భారత శక్తి) ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్--2026) కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుధర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్--2026 పురోగతిపై సమీక్షించారు.ఈ సందర్భంగా సి. సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు. బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పంపిణీ చేసి, పూర్తి చేసిన వివరాలను సేకరించాలన్నారు. ఓటర్లు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లోనే తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. సూపర్వైజర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు.?

అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను వంద శాతం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఏఈఆర్‌వోలు (అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు), ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యంగ్ ప్రొఫెషనల్ రౌండ్ టేబుల్” కార్యక్రమం





విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, మే 30: మై భారత్ ఎన్టీఆర్ మరియు కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ సమావేశ మందిరంలో “యంగ్ ప్రొఫెషనల్ రౌండ్ టేబుల్” కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశా ఐఏఎస్ మరియు ఎస్ పి ఎ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ సిరికొండ విచ్చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత మార్పు కోసం తమ ఆలోచనను అభిప్రాయాలను ప్రభుత్వము కు తెలుపుటకు ఇది ఒక చక్కను వేదిక అని కొనియాడారు. డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ శ్రీకొండ మాట్లాడుతూ యూత్ లెడ్ ఇనిషియేటివ్స్ అనేవి ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాముఖ్యం ఇస్తున్నారని వివరించారు. మై భారత్ రాష్ట్ర సంచాలకులు అన్నుమాన్ దాస్ మాట్లాడుతూ మైభారత్ ద్వారా భారత ప్రభుత్వం యువతను ప్రోత్సహించడానికి అనేక కార్యక్రమాలను చేపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ తరపున విచ్చేసిన నిపుణులతో యువత ముచ్చటించారు. యువత ప్రజాస్వామ్యంలో నిర్వహించాల్సిన పాత్ర గురించి డాక్టర్ అన్వేష్ దాసరి తెలిపారు. మరొక నిపుణులు సాహితీ మాట్లాడుతూ లోకల్ ఇస్ న్యూ గ్లోబల్ అనే నినాదం వెనక ఉన్న ప్రాధాన్యాన్ని వివరించారు. వృత్తి మరియు నైపుణ్యాల పైన అవగాహన కల్పిస్తూ కిలారు నాగస్రావన్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మై భారత్ డిడి ఉజ్వల్, కిరణ్మయి, జిల్లా యువజన అధికారి బి ప్రదీప్ కుమార్, స్టెప్ సీఈఓ కొల్లేటి రమేష్, రాము, పృథ్వీ, సుమన్, మరియు వైఐఐ ప్రతినిధులతో పాటు సుమారు 200 మంది యువత పాల్గొన్నారు.


## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 30(భారత శక్తి) జూన్ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.వేదికను పూలతో ఆకర్షణీయంగా అలంకరించాలని, వేడుకల ప్రాంగణంలో పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర అవతరణ వేడుకలకు ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను ఆహ్వానించాలని తెలిపారు.వేడుకలకు హాజరయ్యే అతిథుల కోసం తగిన సీటింగ్, తాగునీటి సౌకర్యం, సౌండ్ సిస్టమ్, షామియానా తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలని, పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ఉదయం నిర్ణీత సమయానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణిగా డాక్టర్ కే. లలితా దేవి



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మే 30: సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా కే లలితా దేవి బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ ని కలిశారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో ప్రోగ్రామ్ ఆఫీసర్స్ తో జిల్లా అభివృద్ధిపై సమీక్ష చేశారు.అందరూ కష్టపడి పనిచేయాలని, సమయపాలన పాటించి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు మంచి తేవాలని సూచించారు. ఇంతకుముందు చార్మినార్ జోన్ డిహెచ్ఎంఓ గా పనిచేశారు.

## ప్రమాద బీమాతో ఖాతాదారుల కుటుంబాలకు అండగా గాయత్రి బ్యాంక్



జగిత్యాల, మే 30 (భారత శక్తి ప్రతినిధి): ధర్మపురిలోని గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాదంలో మృతి చెందిన ఖాతాదారుడు జెల్ల సత్తయ్య కుటుంబానికి రూ.1 లక్ష ప్రమాద బీమా చెక్కును అందజేశారు. రాజారం గ్రామానికి చెందిన జెల్ల సత్తయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాకు అనుబంధంగా ఉన్న ప్రమాద బీమా పథకం కింద ఆయన భార్య జెల్ల మల్లవ్వకు చెక్కును ధర్మపురి సీఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్సై మహేశ్, గాయత్రి బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ వొర్ఘుల మోహన్ అందజేశారు.ఈ సందర్భంగా సీఐ రామ్ నరసింహారెడ్డి మాట్లాడుతూ, తక్కువ డిపాజిట్‌తో ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ గాయత్రి బ్యాంక్ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తోందన్నారు.బ్రాంచ్ మేనేజర్ వొర్ఘుల మోహన్ మాట్లాడుతూ, 24 గంటల ఏటీఎం సేవలు, సూక్ష్మ ఏటీఎం సేవలు, ఆధార్ ఆధారిత నగదు లావాదేవీలు, మొబైల్ బ్యాంకింగ్, తక్షణ నిధుల బదిలీ, ఎన్ఈఎఫ్టీ, యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బంగారు ఆభరణాలు, వ్యవసాయ అవసరాలు, వ్యాపారాభివృద్ధికి రుణాలు అందిస్తున్నామని చెప్పారు. అలాగే బ్యాంకింగ్ ప్రతినిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సేవలను విస్తరించామని, స్థిర డిపాజిట్లు, భద్రతా లాకర్లు తదితర సౌకర్యాలు కూడా వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## ఉన్నత చదువులతోనే ఉన్నత స్థానం.

**-సోషల్ మీడియాకు దూరంగా పుస్తకాలకు చేరువగా ఉండాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్.**




భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 30: విద్యార్థినులు ఉన్నత చదువులు అభ్యసించి అనుకున్న రంగాల్లో స్థిరపడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాల సందర్భంగా శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో స్నేహ సంఘాల సభ్యులతో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు అధికార, ప్రతిపక్ష పాత్రలు పోషిస్తూ బాల్యవివాహాల నిర్మూలన, బాలికల హక్కులు, విద్య తదితర అంశాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, సోషల్ మీడియా వినియోగాన్ని పరిమితం చేసి పుస్తకాలకు దగ్గర కావాలని సూచించారు. వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకోవద్దన్నారు.పోషకాహారం తీసుకోవడంతో పాటు ఆర్థిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ మహిళలు, బాలికలు షీటీమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేధింపులు ఎదురైతే షీటీమ్ నంబర్ 87126 56425ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు నగదు బహుమతులు, షీల్డులు అందజేశారు.

# నేడు హైదరాబాద్ లో జరిగే ఉద్యమకారుల ఫోరం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

### రేగొండ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు పత్తి బుచ్చిరెడ్డి.



రేగొండ,మే30(భారత శక్తి):తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నేడు ( 31)న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో కే కేశవరావు కమిటీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రేగొండ మండల శాఖ అధ్యక్షులు పత్తి బుచ్చి రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు విజ్ఞప్తి చేశారు. రేగొండ మండలంలో ఉన్న తెలంగాణ ఉద్యమకారులు ఈ సమావేశానికి విచ్చేసి విజయవంతం చేయవలసిందిగా అధ్యక్షులు బుచ్చిరెడ్డి పేరుపేరునా ఉద్యమకారులను కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కే కేశవరావు కమిటీ రాష్ట్రంలోని ప్రతి జిల్లా, ప్రతి మండలాన్ని పర్యటించి నిజమైన ఉద్యమకారులను గుర్తించాలని,తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంతో ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోయిన ఉద్యమకారులను గుర్తించాలన్నారు.ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని ,తెలంగాణ స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించి నెలకు రు 25 వేల రూపాయల పెన్షన్ మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అలాగే ప్రతి ఉద్యమకారునికి హెల్త్ కార్డులతో పాటు ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, నామినేటెడ్ పదవులలో తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యత కల్పించాలని బుచ్చిరెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున, ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రేగొండ మండల శాఖ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, కే కేశవరావు కమిటీకి విజ్ఞప్తి చేయనున్న దృష్ట్యా ఉద్యమకారులు ఈ సమావేశానికి హాజరు కావాలని బుచ్చిరెడ్డి ఫోన్ల ద్వారా సమాచారం అందించి కోరినట్లు తెలిపారు.

# వరి కొయ్యల దహనం వద్దు - నేల సంరక్షణే ముద్దు

### -సోలిపేట సర్పంచ్ బీరవోలు వెంకట కృష్ణారెడ్డి




సూర్యాపేట (భారత శక్తి)మే 30: సూర్యాపేట మండల పరిధిలోని సోలిపేట గ్రామంలో శనివారం నాడు రైతు సోదరులను ఉద్దేశించి ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ బీరవోలు వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు వరి పంట కోసిన తర్వాత పొలాల్లో మిగిలిపోయిన కొయ్యాలను తగులబెట్టడం కొందరు రైతులు సులభమైన మార్గంగా భావిస్తున్నప్పటికీ, దీని వల్ల కలిగే నష్టం చాలా తీవ్రమైనదని ఆయన అన్నారు. కొయ్యాల దహనం వల్ల నేలలో సహజంగా ఉండే సూక్ష్మ జీవులు, వానపాములు పంటలకు మేలు చేసే అనేక జీవులు నశించిపోతాయని ఆయన తెలిపారు.దీని ఫలితంగా నేల సారవంతత తగ్గి, భవిష్యత్‌లో పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు.ఈ నేపథ్యంలో గ్రామ రైతులకు అవగాహన కల్పిస్తూ సర్పంచ్ బీరవోలు వెంకట కృష్ణారెడ్డి చేసిన సూచనలు సమయోచితమైనవి. కొయ్యాలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రీయ పదార్థాలు నాశనమవడమే కాకుండా, గాలిలో కాలుష్యం పెరిగి పర్యావరణానికి కూడా హాని కలుగుతుంది. అంతేకాకుండా, పొగ కారణంగా ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావాలు పడే ప్రమాదం ఉందని తెలిపారు. వ్యవసాయం కేవలం ఈ ఏడాది పంటకే పరిమితం కాదని భూమిని ఆరోగ్యంగా ఉంచితేనే రాబోయే తరాలకు కూడా మంచి దిగుబడులు సాధ్యమవుతాయని కొయ్యాలను కాల్చకుండా వాటిని నేలలో కలపడం, పశువుల మేతగా లేదా సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించడం ద్వారా రైతులు అదనపు ప్రయోజనాలు పొందవచ్చు అన్నారు. రైతు సంక్షేమం అంటే కేవలం పెట్టుబడులు, మద్దతు ధరలు మాత్రమే కాదని నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమైన అంశం. అందుకే ప్రతి రైతు కొయ్యాల దహనానికి దూరంగా ఉండి, శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని ఆయన కోరారు .ప్రకృతిని కాపాడితేనే వ్యవసాయం నిలబడుతుందని వ్యవసాయం నిలబడితేనే రైతు కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. “కొయ్యాలను కాల్చొద్దు... భూమిని కాపాడండి. భూమిని కాపాడితేనే భవిష్యత్ పంటలు బంగారు పంటలవుతాయి” అనే సందేశం ప్రతి రైతుకు చేరాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్ర పరమేష్ రైతులు కందుల కుశలవరెడ్డి, కందుల అశోక్ రెడ్డి, ఉగ్గం రమేష్, సంపతి సత్తయ్య, పల్స బిక్షపతి, చల్లా సతీష్ రెడ్డి, తప్పెట్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన ప్రసవం..

## ముగ్గురు శిశువులకు జన్మనిచ్చిన మహిళ

### స్వప్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో విజయవంతమైన అత్యవసర శస్త్రచికిత్స

### తల్లి, ముగ్గురు శిశువులు క్షేమం




నిర్మల్, మే 30 (భారత శక్తి): నిర్మల్ జిల్లా కేంద్రంలోని స్వప్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అరుదైన ప్రసవం విజయవంతంగా నిర్వహించారు. రిషిక (25) అనే గర్భిణీ ఒకేసారి ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. వైద్యుల సమయోచిత చర్యలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న తల్లి, ముగ్గురు నవజాత శిశువులు సురక్షితంగా బయటపడ్డారు. వైద్యుల వివరాల ప్రకారం, గర్భధారణ 34 వారాలు పూర్తయిన సమయంలో రిషికకు తీవ్ర కడుపునొప్పి, అధిక రక్తస్రావం ప్రారంభమైంది. అదే సమయంలో రక్తపోటు 200/100కు చేరడంతో పరిస్థితి విషమించింది. కుటుంబ సభ్యులు ఆమెను అత్యవసరంగా స్వప్న హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన ఎం.ఎస్. సర్జన్ డాక్టర్ శశికాంత్, గైనకాలజిస్ట్ డాక్టర్ శైలజలు తక్షణమే అత్యవసర సిజేరియన్ శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ ఆపరేషన్ ద్వారా ఇద్దరు మగ శిశువులు, ఒక ఆడ శిశువు జన్మించారు. నెలలు నిండకముందే జన్మించిన ఈ శిశువుల బరువులు వరుసగా 1.4 కిలోలు, 1.3 కిలోలు, 1.2 కిలోలుగా నమోదయ్యాయి. అనంతరం చిన్న పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో నవజాత శిశువులకు ప్రత్యేక వైద్యం అందించారు. వైద్య బృందం నిరంతర పర్యవేక్షణతో తల్లి, ముగ్గురు శిశువులు పూర్తిగా కోలుకున్నారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో ప్రసవం జరిగిన 17 రోజుల అనంతరం వారిని శుక్రవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా తమ కుటుంబ సభ్యులను కాపాడిన డాక్టర్ స్వప్న, డాక్టర్ శశికాంత్, డాక్టర్ శైలజతో పాటు వైద్య సిబ్బందికి రిషిక కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిర్మల్‌లోనే ఇటువంటి సంక్లిష్టమైన ట్రిప్లెట్స్ డెలివరీ కేసును విజయవంతంగా నిర్వహించడంపై స్థానికులు వైద్య బృందాన్ని అభినందించారు.

# విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు

**- సిఎస్ఆర్ నిధులను ప్రజా సంక్షేమానికి సమర్థవంతంగా వినియోగించాలి**

**- సిఎస్ఆర్ నిధుల కేటాయింపు పై సంగారెడ్డి జిల్లా అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి దామోదర రాజనర్సింహ**





సంగారెడ్డి,భారత శక్తి, మే 30: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా, పారదర్శకంగా వినియోగించి సామాజిక అభివృద్ధికి దోహదపడే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సీఎస్ఆర్ సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా మంత్రి జిల్లాకు ఆయా పరిశ్రమల నుండి సి ఎస్ ఆర్ కింద ఎన్ని నిధులు వచ్చాయి,ఎంత ఖర్చు చేశాం, ఈ సంవత్సరం ప్రతిపాదనలు గురించి ఆరా తీశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్య సంస్థల మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను ప్రాధాన్యతతో కేటాయించాలని సూచించారు.జిల్లాలోని పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకొని ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. జిల్లాలోని ఆయా అవసరాలను గుర్తించి, కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ప్రభుత్వ విద్యా సంస్థల్లో వాష్ రూమ్స్ , కాంపౌండ్ వాల్స్ , కిచెన్ షెడ్స్, డైనింగ్ హాల్,డార్మెంటరీ , బెడ్స్, అదనపు క్లాస్‌రూమ్‌ల నిర్మాణం, ఫర్నిచర్, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య వసతుల కల్పనకు సీఎస్ఆర్ నిధులను ప్రాధాన్యతగా వినియోగించాలని మంత్రి తెలిపారు. సీఎస్ఆర్ ప్రతిపాదనల అమలు, పురోగతిపై సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ప్రతిపాదిత పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.జిల్లాలోని పరిశ్రమలు సామాజిక అభివృద్ధిలో భాగస్వాములై ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. సీఎస్ఆర్ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి వారికి పలు సూచనలు చేసారు. ప్రజా ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు, పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేరస్తులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుంది

### - కన్విక్షన్ శాతం పెంచాలి :పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 30 ( భారతశక్తి. ): నేరస్తులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుందని, బాధితులకు న్యాయం జరిగే విధంగా కోర్టు కానిస్టేబుళ్లు కృషి చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పెద్దపల్లి,మంచిర్యాల జోన్లలో పనిచేస్తున్న కోర్టు డ్యూటీ అధికారులు,లైజనింగ్ అధికారులతో సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నేరస్తులకు శిక్ష పడేలా సాక్షులను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.కోర్టులో బాధితులకు న్యాయం జరిగేలా మానవత్వంతో వ్యవహరించాలని అన్నారు.దోషులకు శిక్ష పడే ప్రక్రియలో కోర్టు కానిస్టేబుళ్ల బాధ్యత ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. నేరస్తులకు సంబంధించిన వారెంట్లు,సమన్లు సత్వరమే అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.కోర్టు ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలియజేయాలని, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూచనలు, సలహాలను పాటించాలని ఆదేశించారు.కోర్టులో పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసులు, వారెంట్లు,సమన్ల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటే పోలీసులపై ప్రజల నమ్మకం మరింత పెరుగుతుందన్నారు. ఏదైనా నేరానికి పాల్పడిన వ్యక్తులు, చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొన్న వారందరికీ తప్పనిసరిగా శిక్ష పడేలా కృషి చేయాలని సూచించారు.టీఎస్‌కాప్ (ూజబ్రూ) అప్లికేషన్‌లోని సీసీడీ (జజణ) మాడ్యూల్‌కు సంబంధించిన సమన్లు,వారెంట్ల నమోదు,జారీ ప్రక్రియ, సర్వీస్ వివరాల నమోదు,పెండింగ్ వారెంట్ల పర్యవేక్షణ, కోర్టు ప్రక్రియల నిర్వహణ అంశాలపై పోలీస్ సిబ్బందికి శిక్షణ అందించారు.

# వరి ధాన్యం ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 30 (భారత శక్తి): రైతు సంక్షేమంలో ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎ సి సి ప్రాంతంలో గల హనుమాన్ రైస్ మిల్లును సందర్శించి ధాన్యం దిగుమతి,నిల్వ ప్రక్రియలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని, లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.మందమర్రి మండల కేంద్రంలోని శ్రీ వాసవి, అంబికా సాయి,సప్తగిరి రైస్ మిల్లులతో పాటు సారంగపల్లి, పొన్నారం గ్రామాలలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసిల్దార్ సతీష్ కుమార్ తో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వ, ధాన్యం దిగుమతి,సి ఎం ఆర్ ప్రక్రియలను పరిశీలించారు.రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శకంగా,వేగంగా నిర్వహించాలని తెలిపారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని గోదాములలో నిల్వ చేయాలని తెలిపారు. కొనుగోలు చేసి తరలించిన మొక్కజొన్నలను సైతం గోదాములలో నిలువ చేయాలని తెలిపారు.అనంతరం నస్పూర్ మండలంలో గల స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ గోదామును మండల తహసిల్దార్ సంతోష్ కుమార్ తో కలిసి సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

# బాధ్యత స్వీకరించిన హయత్ నగర్ డిప్యూటీ కమీషనర్



ఎల్బీనగర్, మే 30 (భారత శక్తి): ఎల్బీనగర్ జోన్ పరిధిలోని హయత్ నగర్ సర్కిల్ 14 డిప్యూటీ కమిషనర్ గా అజ్మీరా స్వామిని నియమిస్తూ మల్కాజ్గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.శనివారం హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా అజ్మీరా స్వామి సరూర్ నగర్ లోని సర్కిల్ కార్యాలయంలో బాధ్యత స్వీకరించారు. హయత్ నగర్ సర్కిల్ ఇంచార్జ్ డిప్యూటీ కమిషనర్ విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ గా దినేష్ సింగ్ ను అదే పోస్ట్ లో తిరిగి నియమించారు.

# ఆడబిడ్డల పెళ్లిళ్లకు ‘కల్యాణలక్ష్మి’ కొండంత అండ

### లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి




ఇబ్రహీంపట్నం, మే 30 భారత శక్తి: పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు కొండంత అండగా నిలుస్తున్నాయని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసనసభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం మంచాల మండలానికి చెందిన 53 మంది లబ్ధిదారులకు ఆయన ఈ పథకాల కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు అప్పులపాలు కాకుండా, సంతోషకరమైన వాతావరణంలో జరగాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ పథకాలు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, లబ్ధిదారుల కుటుంబాలకు భరోసానిచ్చే కార్యక్రమాలని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, ఇందులో ఎలాంటి రాజీ ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కరాలపాడులో పోలీసులు కార్డెన్ సెర్చ్

## - మాదకద్రవ్యాలు వద్దు - జీవితమే ముద్దు - డి.ఎస్.పి మహేశ్వరరావు, సి ఐ లు వెంకట్రావు, రాజేష్



**పిడుగురాళ్ల (భారత శక్తి)** పిడుగురాళ్ల మండలం కరాలపాడు గ్రామంలో పోలీసులు గంజాయి నిర్మూలన పై యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాల డిఎస్పి మహేశ్వరరావు, పిడుగురాళ్ల సిఐ వెంకట్రావు, దాచేపల్లి సిఐ రాజేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ రహిత సమాజాన్ని సాధించేందుకు ప్రభుత్వం, పోలీస్, ఎక్సైజ్ శాఖలు కఠినమైన చర్యలను అమలు చేస్తున్నాయి అన్నారు. గంజాయి సాగును అణిచివేయటానికి "ఈగల్" అనే వ్యవస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. మాదకద్రవ్యాలు మన రాష్ట్రంలో వాడకం ఎక్కువ అయిందన్నారు. మాదకద్రవ్యాలు పిల్లల జీవితాలను బలి తీసుకుంటుంది అన్నారు. మన ప్రభుత్వం ప్రత్యేకంగా "ఈగల్" టీం ను ఒకటి ఏర్పాటు చేసింది అన్నారు. ఈ టీం ద్వారా గంజాయిని రాష్ట్రంలో నిర్మూలించే దిశగా కొన్ని కార్యక్రమాలు చేస్తున్నాయి అన్నారు. ఈ సందర్భంగా పిడుగురాళ్ల సిఐ వెంకట్రావు గ్రామస్తులతో మాట్లాడుతూ, అందరూ మీ కుడి చేతిని ముందుకు చాపి మాదకద్రవ్యాలు వద్దు - జీవితమే ముద్దు అంటూ ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రజలతో మాదకద్రవ్యాల నిర్మూలన ప్రమాణం చేయించారు. మనదేశంలో ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలు దుర్వినియోగం జరుగుతుందని, ఇది ఆందోళన కలిగించే విషయమని మేము గ్రహించాము అని పోలీస్ అధికారులు అన్నారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని అరి కట్టేందుకు సహకరిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాం అని అన్నారు. మేము ఎటువంటి ప్రయోజనం కోసం ఏ విధంగానూ, హానికరమైన చట్ట విరుద్ధమైన మందులను వినియోగించబోమని హామీ ఇస్తున్నాము అని అన్నారు. ప్రతి వ్యక్తిని ముఖ్యంగా యువతను ప్రోత్సహించటం ద్వారా, మాదకద్రవ్యాల దుర్వినియోగం. దుష్ప్రభావాల గురించి, అవగాహన కల్పిస్తాము, తద్వారా భారతదేశం లోనీ యువత మాదకద్రవ్యాల రహితంగా జీవించగలరు అని అన్నారు. సమాజంలో సృజనాత్మకత మరియు ముఖ్యమైన సభ్యులుగా మారవచ్చు అన్నారు. డ్రగ్స్ కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుతానని నేడు ప్రతిజ్ఞ చేస్తున్నాం అని గ్రామస్తుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి మహేశ్వరరావు, పిడుగురాళ్ల సిఐ వెంకట్రావు, దాచేపల్లి సిఐ రాజేష్, పిడుగురాళ్ల ఎస్ ఐ మోహన్, యస్ ఐ శివ నాగరాజు, ఏ ఎస్ ఐ లు, పోలీస్ సిబ్బంది, హోంగార్డ్స్ పాల్గొన్నారు.

# భద్రతా సూత్రాలు పాటించండి..

## - ప్రమాదాలను నివారించండి



**ప్రకాశం(భారత శక్తి)** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఈ-చలాన్లు విధిస్తూ రోడ్డు భద్రతపై ప్రకాశం జిల్లా, మార్కాపురం జిల్లా పోలీసులు అవగాహనా కల్పిస్తున్నారు., ప్రజల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రకాశం జిల్లా పోలీసులు మరియు మార్కాపురం జిల్లా పోలీసులు ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తున్న వాహనదారులను గుర్తించి వారికి ఈ-చలాన్లు విధించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, సీట్బెల్ట్ ధరించకుండా ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్, సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, అతివేగంగా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలు తీవ్రమైన రోడ్డు ప్రమాదాలకు దారితీస్తాయని పోలీసులు వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించి ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు.ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, తన భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా కాపాడేలా సహకరించాలని ప్రకాశం జిల్లా మరియు మార్కాపురం జిల్లా పోలీసులు కోరారు.

# నిమ్స్‌లో ఫైర్ మాక్ డ్రిల్



**(భారత శక్తి)** ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవం సందర్భంగా నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ట్రామా బ్లాక్‌లో శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది.హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం మరియు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో, హైదరాబాద్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులైన జిల్లా ఫైర్ ఆఫీసర్ టి. వెంకట్, అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ వి. భానుప్రసాద్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎం.డి. షౌకత్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి. సాయి రెడ్డి మార్గదర్శకత్వంలో ఈ మాక్ డ్రిల్ నిర్వహించబడింది.అగ్నిప్రమాదం సంభవించిన సందర్భంలో ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది, భద్రతా సిబ్బంది ఎలా స్పందించాలి, రోగులను సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలి, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై ఈ మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించడం జరిగిందని, రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా డమ్మీ పేషెంట్ల సహాయంతో డ్రిల్ నిర్వహించినట్లు నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు.ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం హెచ్. ఓ. డి డా.సునీల్ , ట్రామా బ్లాక్‌లోని వివిధ విభాగాల సిబ్బంది, నర్సింగ్ అధికారులు, టెక్నీషియన్లు, శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది ఈ మాక్ డ్రిల్ లో పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో మహిళను వేధించిన

# యువకులకు షాక్


### - అబిడ్స్ పోలీసుల స్పీడ్ యాక్షన్‌తో 48 గంటల్లోనే జైలు శిక్ష



**హైదరాబాద్(భారత శక్తి)** నిజాం కాలేజ్ దగ్గర డ్రంకెన్ కండిషన్‌లో మహిళను వేధించిన ఐదుగురు అరెస్ట్‌కోర్టు ఒక్కొక్కరికి 7 రోజుల జైలు శిక్ష విధించింది.మహిళల భద్రతపై కఠినంగా వ్యవహరిస్తామన్న హైదరాబాద్ పోలీసులు శిక్ష పడిన నిందితుల వివరాలు:అందరూ కేటరింగ్ కార్మికులు, నేపాల్ దేశస్థులు, ప్రస్తుతం నివాసం: కింగ్ కోఠి, ా ఎ ా ద ం ా బ ా ద ్ , సునీల్,ఉమేష్,లక్ష్మణ్,పురుషోత్త రామ్‌మహిళను వేధించిన కేసులో ఈ ఐదుగురికి కోర్టు 7 రోజుల జైలు శిక్ష విధించింది.

# పెళ్లికి ముందు"ట్రాఫిక్ క్యారెక్టర్" సర్టిఫికేట్:

## కూతురు భవిష్యత్తు కోసం తండ్రి వినూత్న ఆలోచన



**కాకినాడ (భారత శక్తి)** పెళ్లి అంటే కేవలం ఆస్తులు, ఉద్యోగాలు, కుటుంబ నేపథ్యం చూసే కాలం మాత్రమే కాదు,వ్యక్తిత్వం, బాధ్యత, సమాజం పట్ల ప్రవర్తన కూడా ముఖ్యమని కాకినాడలో జరిగిన ఓ ఘటన మరోసారి గుర్తు చేసింది.తన కూతురికి కాబోయే అల్లుడు నిజంగా బాధ్యతాయుతమైన వ్యక్తేనా,రోడ్డు నిబంధనలు పాటిస్తాడా,మద్యం సేవించి వాహనం నడిపే అలవాటు ఉందా? అనే విషయాలు తెలుసుకోవాలని ఓ తండ్రి వినూత్నంగా ఆలోచించారు. యువకుడి ఆధార్ వివరాలు, ఫోన్ నంబర్, కారు-బైక్ నంబర్లతో ట్రాఫిక్ పోలీసులను సంప్రదించి పూర్తి సమాచారం తీసుకున్నారు.డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘనలపై పరిశీలించిన అధికారులు..అతడిపై ఎలాంటి కేసులు లేదా పెండింగ్ చలానాలు లేవని తెలిపారు.ఈ సందర్భంగా ఆ తండ్రి తీసుకున్న జాగ్రత్తను ట్రాఫిక్ సీఐ ప్రత్యేకంగా అభినందించారు.సమాజానికి ఒక సందేశం:ఇప్పటి యువతలో రోడ్డు భద్రతపై అవగాహన చాలా అవసరం. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం కేవలం జరిమానాలు తప్పించుకోవడానికే కాదు, కుటుంబ భద్రత, ప్రాణాల రక్షణ కోసం కూడా ఎంతో ముఖ్యం. పెళ్లి సంబంధాల్లో వ్యక్తి ప్రవర్తన, బాధ్యతాయుత జీవనశైలి కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందనే చర్చకు ఈ ఘటన దారి తీసింది.

# అధికారుల అండతోనే చెరువు కబ్జా

## - కోరుకొండ మండలం నిడిగట్లలో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు



**కోరుకొండ (భారత శక్తి)** తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం నిడిగిట్ల గ్రామంలో చెరువును అక్రమంగా తవ్వేస్తున్నారు. అధికారుల అండదండలతోనే ఈ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.పట్టపగలే దోపిడీగ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ చెరువును కొందరు వ్యక్తులు జేసీబీలతో తవ్వేసి మట్టిని తరలిస్తున్నారు. రోజూ పదుల సంఖ్యలో లారీతో మట్టిని బయటి ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. "పట్టపగలే తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కళ్లు మూసుకున్నారు" అని స్థానికులు మండిపడుతున్నారు

### .మామూళ్లు' మత్తులో అధికారులు?"

అధికారులకు మామూళ్లు ముట్టకపోతే ఇంత బహిరంగంగా తవ్వకాలు జరుగుతాయా?'' అని గ్రామంలో చర్చ జరుగుతోంది. కంప్లైంట్ చేసినా చర్యలు లేవని, పైగా ఫిర్యాదు చేసిన వారినే బెదిరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.భవిష్యత్తుకు గండిచెరువును ఇష్టారాజ్యంగా తవ్వేయడంతో నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతింటోంది. భూగర్భ జలాలు అడుగంటిపోయి వేసవిలో తాగునీటి కటకట ఏర్పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులకు, సాగుకు నీరందక తీవ్ర ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజల డిమాండ్

1. నిడిగట్ల చెరువులో అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలి. 2. తవ్వకాలకు సహకరిస్తున్న అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. 3. అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి మట్టిని సీజ్ చేయాలి.జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి నిడిగిట్ల చెరువును కాపాడాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

## - పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్(భారత శక్తి)** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యంగా పోలీస్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధి నిర్వహణ చేపట్టాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, డిజిటల్ రికార్డుల నిర్వహణ మరియు క్షేత్రస్థాయి భద్రతా చర్యలపై శనివారం ఆయన ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.?ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ జారీ చేసిన ముఖ్యమైన ఆదేశాలు:?నేపాలి మరియు ఇతర రాష్ట్రాల కార్మికుల గుర్తింపు వివరాల నమోదు తప్పనిసరి.కరీంనగర్ పరిధిలో దాదాపు 1000 మంది వరకు నేపాలీలు వివిధ రంగాలలో పనిచేస్తున్నారని, ప్రస్తుతం వారిలో కేవలం 169 మంది వివరాలు మాత్రమే నమోదయ్యాయని సిపి తెలిపారు. ఇతర రాష్ట్రాలు మరియు దేశాల నుండి ఇక్కడికి వచ్చి కూలీలుగా, కార్మికులుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరి పూర్తి వివరాలను, వారి అధికారిక గుర్తింపు కార్డుల తో సహా సంబంధిత పోలీస్ స్టేషన్లలో రికార్డు చేయాలని ఆదేశించారు. యజమానులు సైతం తమ వద్ద పనిచేసే వలస కార్మికుల వివరాలను పోలీసులకు అందించాలని సూచించారు.?సీసీటీఎన్ఎస్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు డేటా అప్‌లోడ్:భవిష్యత్తులో కేసుల పరిశోధన, ట్రాకింగ్ మరియు రికార్డుల పరిశీలన అంతా పూర్తిగా సీసీటీఎన్ఎస్ పైనే ఆధారపడి ఉంటుందని సిపి స్పష్టం చేశారు.అందువల్ల, పోలీస్ స్టేషన్ లో నమోదయ్యే ప్రతి కేసు యొక్క పూర్తి వివరాలను నిర్ణీత గడువులోగా ఎలాంటి ఆలస్యం లేకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు.?రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై కఠిన నిఘా:సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులు, రౌడీ షీటర్లు మరియు హిస్టరీ షీటర్ల కదలికలపై స్థానిక పోలీసులు 24 గంటలూ నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. పాత నేరస్థుల ప్రవర్తనను నిశితంగా గమనిస్తూ, నగరంలో ప్రశాంత వాతావరణానికి భంగం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.మాల్ఖానాల సమర్థవంతమైన నిర్వహణ:పోలీస్ స్టేషన్లలోని మాల్ఖానా కేసులకు సంబంధించిన స్వాధీనపరుచుకున్న సొత్తు వస్తువుల గది నిర్వహణ అత్యంత పారదర్శకంగా, క్రమపద్ధతిలో ఉండాలని సిపి స్పష్టం చేశారు.మాల్ఖానాలోని ప్రతి వస్తువు రికార్డులలో స్పష్టంగా నమోదు కావాలని, వాటి భద్రత విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.?ఈ సమీక్షా సమావేశంలో కమిషనరేట్ పరిధిలోని ఏసీపీ సిసిఆర్బీ శ్రీనివాస్ జి, ఇన్స్పెక్టర్ సరిలాల్, కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కంటైనర్ను ఢీకొట్టిన

# డీసీఎం వ్యాన్

### - డీసీఎం డ్రైవర్ కు తీవ్ర గాయాలు




**పిడుగురాళ్ల (భారత శక్తి)** పిడుగురాళ్ల పట్టణంలోని పిల్లుట్ల రోడ్ ఎక్స్ జంక్షన్ వద్ద డీసీఎం వ్యాన్ కంటైనర్ ను వెనక నుండి ఢీకొనడంతో డీసీఎం డ్రైవర్ అందులో ఇరుక్కుపోయాడు.అతను బయటకు రాలేక రక్షించమని ఆర్తనాదాలు చేశాడు. అక్కడే రోడ్ పై ఉన్న తోటి లారీ డ్రైవర్లు, స్థానిక ప్రజలు, ప్రయాణికులు అందరూ కలిసి మానవత్వం చాటారు. సుమారు ఇరవై నిమిషాలు కష్టపడి మరొక లారీ సాయంతో డీసీఎం ముందు భాగానికి తాడు కట్టి లాగి అతన్ని బయటకు తీశారు. దీంతో డీసీఎం వ్యాన్ డ్రైవర్ కాలు పూర్తిగా తెగిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రు లను చికి త్సనిమిత్తంఆస్పత్రికితరలించారు.కేసునమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

# గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

### - ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాల సుమంత్, వీరపోగు రవి.




**కడప (భారత శక్తి)** జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఎలాంటి అనుమతులు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని శనివారం కడప ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జాల సుమంత్, వీరపోగు రవి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కడప జిల్లా వ్యాప్తంగా చదువు అనే పేరుతో గుర్తింపు లేని విద్యాసంస్థలు నడుపుతున్న యాజమాన్యాలు చాలా ఉన్నాయి.అలాగే ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా చదువుతో వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని వారన్నారు.

జిల్లావ్యాప్తంగా పుట్టగొడుగులు లాగా ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలు మరియు కళాశాలలు, కోచింగ్ సెంటర్లు ముందస్తు అడ్మిషన్ల పేరుతో వేల,లక్షలు తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వస్తున్నాయని కేవలం అధికారులను మభ్యపెట్టే విధంగా యాజమాన్యాలు చేస్తున్నాయని వారు అన్నారు. ఇప్పటికైనా గుర్తింపు లేని విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాలని లేని పక్షంలో రాబోవు రోజుల్లో ఎస్ఎఫ్ఐ కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వాటిని అడ్డుకొని రాజీలేని పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర నాయకులు నిత్య తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 1 నుంచి విశాఖ రైల్వే జోన్

**(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ ప్రజల దశాబ్దాల కల నెరవేరనుంది. విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు కానున్న దేశంలోని 18వ రైల్వే జోన్ 'దక్షిణ కోస్తా రైల్వే' జూన్ 1 నుంచి అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించనుంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లతో పాటు, తూర్పు కోస్తా రైల్వేలోని వాల్తేరు డివిజన్ను పునర్వ్యవస్థీకరించి 'విశాఖపట్నం డివిజన్'గా మార్చి కొత్త జోన్లో విలీనం చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లోని హామీ మేరకు ఈ ప్రాంతంలో రైల్వే పాలనను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2019 కేంద్ర బడ్జెట్లో ప్రకటించిన ఈ జోన్ ఏర్పాటు ప్రక్రియ ఇప్పుడు కార్యరూపం దాల్చింది. ఈ పునర్వ్యవస్థీకరణతో సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే పరిధి గణనీయంగా తగ్గనుంది. ప్రస్తుతం ఆరు డివిజన్లు ఉండగా, ఇకపై హైదరాబాద్, నాందేడ్, పునర్వ్యవస్థీకరించిన సికింద్రాబాద్ డివిజన్లతో మాత్రమే సౌత్‌సెంట్రల్ జోన్ కొనసాగుతుంది. కార్యకలాపాల సౌలభ్యం కోసం పలాస-ఇచ్ఛాపురం, రాయచూరు-వాడి వంటి కొన్ని సెక్షన్లను కూడా సర్దుబాటు చేశారు. కొత్త జోన్ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్లో రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వేగవంతం కావడంతో పాటు, పాలనా సామర్థ్యం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు

## 13 టీడీపీ మహానాడుకు
## 11 లక్షలమంది హాజరు

**(భారత శక్తి)** తొలిసారి హైబ్రిడ్ మోడల్ లో నిర్వహిస్తున్న మహానాడు సంచలన రికార్డు సృష్టించిందని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మహానాడు కార్యక్రమాలకు 11 లక్షల మంది క్యాడర్ హాజరయ్యారని ఆయన వెల్లడించారు. ఈ-అటెండెన్స్ లో వీరంతా నమోదు చేయించుకున్నారని తెలిపారు. పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలను తీసుకురావాల్సిన అవసరం ఉందని లోకేశ్ అన్నారు. ఎన్టీఆర్ కాలం నుంచే ఎప్పటికప్పుడు మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. సిద్ధాంత పరంగానే తాము సంస్కరణలు తీసుకొస్తున్నామని... ఎన్నికల కోసం కాదని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామని వెల్లడించారు. జెన్ జీ యువత ఏం ఆశిస్తుందో ఆలోచించి దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాల్సి ఉందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ సిద్ధంగా ఉందని లోకేశ్ తెలిపారు.

## రాజకీయాల్లో నయా ట్రెండ్..
### - తమిళనాడు వర్సెస్ కర్ణాటక

**బెంగళూరు,(భారత శక్తి)** రాజకీయ నాయకులు అంటే తెల్లటి కుర్తా, రబ్బరు చెప్పులు, నిరాండబరత.. దశాబ్దాలుగా 'సామాన్యుడు' అనే ముసుగులో ఎంతో జాగ్రత్తగా వీటిని కాపాడుకుంటూ వచ్చారు. ఒకవేళ విలాసవంతమైన జీవితం ఉన్నా, అది కేవలం మూసిన తెలుపులు దాటి ఇవతలికి వచ్చేది కాదు. కానీ, ఇప్పుడు కాలంతో పాటు రోజులు, రాజకీయాలు కూడా మారాయి. ఇటీవల తమిళనాడు ఎన్నికల్లో దళపతి నటుడు జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే సంచలనం సృష్టించి అతిపెద్ద పార్టీగా నిలిచింది. ముఖ్యమంత్రి అయిన ఆయన తన ఎన్నికల అఫిడవిట్లో రూ. 624 కోట్ల ఆస్తి, రూ. 13 కోట్లకు పైగా విలువైన విలాసవంతమైన కార్లు, బ్యాంకు ఖాతాల్లో వందల కోట్ల నగదు ఉన్నట్టు పేర్కొన్నారు. ఇప్పుడు, తమిళనాడు పొరుగున ఉన్న కర్ణాటకలో సిద్ధరామయ్య రాజీనామా చేయడంతో ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ట్రబుల్ షూటర్ పగ్గాలు చేపట్టడానికి సిద్ధమవుతున్నారు. రాజకీయాల్లో నిశ్శబ్ద సంపదకు విజయ్ ప్రతీక అయితే, శివకుమార్ అందుకు పూర్తిగా భిన్నం. ఆయన బహిరంగ విలాసానికి బ్రాండ్ అంబాసిడర్. తాను నిరాండరమైన నేతనని డీకే ఎప్పుడూ చెప్పుకోలేదు. ఖరీదైన లగ్జరీ వాచీలు, డిజైనర్ స్కార్ఫ్‌లను బహిరంగంగా ధరిస్తారు. తన విలాసవంతమైన అభిరుచులపై తరుచూ విమర్శలకు గురైనా ఆయన క్షమాపణలు చెప్పరు. గతంలో ఆయన ధరించిన రోలెక్స్, కార్టియర్ వాచీలపై విమర్శలు రాగా.. "నాకు నచ్చిన ధరించే హక్కు లేదా?" అని ఘాటుగానే సమాధానం ఇచ్చారు. ఈ ఒక్క మాట ప్రస్తుతం రాజకీయాల్లో వస్తోన్న మార్పును స్పష్టం చేస్తోంది. నేటితరం ముఖ్యమంత్రులు ఇకపై తమ సంపదను దాచుకోవాలనుకోవడం లేదు, కొందరు దాన్ని ప్రదర్శిస్తున్నారు. **డీకే ఓ 'బ్రాండ్'** డీకే శివకుమార్ విలాసవంతమైన శైలి ఆయన రాజకీయ గుర్తింపులో ఒక భాగమైపోయింది. గూచీ స్కార్ఫ్‌లు, లూయిస్ విట్టన్ స్టోల్స్, ఫెర్రాగామో ర్యాప్స్, కార్టియర్, రోలెక్స్ డేటోనా వాచీలు ఆయన పబ్లిక్ అప్పీరియన్స్ చూస్తే ఒక సాంప్రదాయ రాజకీయ రోడ్‌షో కంటే ఒక విలాసవంతమైన క్యాటలాగ్‌లా కనిపిస్తాయి. ఆయన ధరించేవాటిలో సుమారు రూ. 54,000 విలువైన గూచీ జాక్వర్డ్ ఉన్ని స్కార్ఫ్, రూ. 1 లక్షకు పైగా ఉన్న లూయిస్ విట్టన్ రేక్‌జావిక్ స్కార్ఫ్, రూ. 15 లక్షల నుంచి రూ. 1.4 కోట్ల మధ్య ఖరీదు చేసే రోలెక్స్ కాస్మోగ్రాఫ్ డేటోనా వాచీలు ఉన్నాయి. ఈ విలాసవంతమైన జీవనశైలిని రాజకీయ ప్రత్యర్థులు ఎంతగా విమర్శలు గుప్పించినా శివకుమార్ మాత్రం వెనక్కి తగ్గలేదు. 2023 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం.. శివకుమార్ తన ఆస్తుల విలువ రూ. 1,413.80 కోట్లు అని ప్రకటించారు. ఇందులో రూ. 1,140 కోట్ల విలువైన స్థిరాస్తులు, రూ. 273 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయి. రూ. 265 కోట్లకుపైగా అప్పులు ఉన్నప్పటికీ, ఆయన దేశంలోని అత్యంత ధనిక రాజకీయ నాయకులలో ఒకరిగా నిలిచారు. రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాలు, క్వారీయింగ్, విద్యారంగం వంటి పలు వ్యాపారాల వల్ల ఇంత సంపద వచ్చింది. తన కుటుంబానికి అనుబంధంగా ఉన్న ట్రస్టుల ద్వారా కర్ణాటక వ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీలు, ఫార్మసీ సంస్థలు, పబ్లిక్ స్కూళ్లు, మేనేజ్‌మెంట్ సంస్థలతో కూడిన ఒక పెద్ద విద్యా వ్యవస్థను కూడా నడుపుతున్నారు. రాజకీయాలకు అతీతంగా, భారత మొట్టమొదటి ఏఐ-ఆధారిత టౌన్‌షిప్‌గా ప్రచారం జరుగుతోన్న బిదిదిలోని గ్రేటర్ బెంగళూరు ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ వెనుక శివకుమార్ ఒక కీలక శక్తి. అయితే శివకుమార్‌తో పోల్చితే విజయ్ సంపద కథ భిన్నంగా ఉంది. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తన వద్ద అపారమైన సంపద ఉన్నప్పటికీ డబ్బు విషయంలో చాలా సాంప్రదాయబద్ధంగా సురక్షిత మార్గాలనే ఎంచుకుంటారు. అతని ఎన్నికల అఫిడవిట్ ఒక సెలబ్రిటీ పోర్ట్‌ఫోలియోలా కాకుండా, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చే పాతకాలపు వ్యాపారవేత్త బ్యాలెన్స్ షీట్‌లా ఉంది. ఆయన ప్రకటించిన రూ. 624 కోట్ల నికర ఆస్తిలో.. రూ. 313 కోట్లకుపైగా కేవలం బ్యాంకు డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాలలోనే ఉన్నాయి. ముఖ్యంగా రూ. 213 కోట్లు ఒకే సేవింగ్స్ ఖాతాలో ఉంచడం గమనార్హం. మ్యూచువల్ ఫండ్లు, ఈక్విటీ పెట్టుబడులు చాలా తక్కువ. ఆయన నికర ఆస్తిలో వీటి వాటా 0.04 శాతం కంటే తక్కువ కావడం గమనార్హం. అలాగే, విజయ్‌కు రియల్ ఎస్టేట్‌పై నమ్మకం ఎక్కువే. సుమారు రూ. 220 కోట్ల విలువైన భూములు ఎస్టేట్ పోర్ట్‌ఫోలియో, నీలన్‌కరై, సాలిగ్రామం, మైలాపూర్, షోలింగనల్లూర్‌లోని ఆస్తులతో సహా తమిళనాడు అంతటా విస్తరించి ఉన్నాయి. ఆయన గ్యారేజీలో బీఎండబ్ల్యూ ఐ7, లెక్సస్ 350, టయోటా వెల్‌ఫైర్, ఇంకా ప్రత్యేకంగా తయారు చేయించిన టాటా కారవాన్ వంటివి ఉన్నాయి. ఇది లగ్జరీ కానీ అవసరానికి ఉపయోగపడే విలాసం. కాబట్టి, ఒక నేత తన సంపదను ఆర్భాటంగా ప్రదర్శిస్తే, మరొకరు దానిని నిశ్శబ్దంగా దాచుకుంటారు. కానీ ఇద్దరూ ఒకే పెద్ద మార్పుకు సంకేతాలు ఇస్తున్నారు. భారత రాజకీయ వర్గం మారుతోంది. కొత్త తరం శక్తివంతమైన రాజకీయ నాయకుడు ఇకపై పొదుపు పాటించాల్సిన అవసరం లేదని భావిస్తున్నాడు. విలాసవంతమైన బ్రాండ్లు రాజకీయ ప్రతిబింబంలోకి ప్రవేశిస్తున్నాయి. ఒకప్పుడు రాజకీయ నాయకుడు రోలెక్స్ ధరిస్తే ప్రజలు ఆగ్రహించేవారు. కానీ, ఇప్పుడు వారి వ్యక్తిగత జీవితంలో భాగమైపోయింది.

## జూన్‌లో సినిమాల మేళ...

**హైదరాబాద్,(భారత శక్తి)** నిజానికి సమ్మర్ సీజన్ లో సినిమాల సందడి ఎక్కువ ఉండాలి. సమ్మర్ హాలిడేస్ ను ఉపయోగించుకోవడానికి మేకర్స్ ఎప్పుడూ రెడీగా ఉంటారు ఈ క్రమంలోనే ఏప్రిల్, మే , జూన్ నెలల్లో సినిమాలు విడుదల చేయాలని చూస్తుంటారు. కానీ ఈ ఈఏడాది మే సప్పగా సాంగింది. పెద్దగా సినిమాల హడావిడి కనిపించలేదు. విడుదలైన ఒకటి ఎందు సినిమాలు కూడా బాక్సాఫీస్ దగ్గర ప్రభావం చూపలేకపోయాయి. ఇక ఇప్పుడు జూన్ పై అందరి దృష్టి పడింది. జూన్ ను టార్గెట్ చేసుకొని అరడజను సినిమాలు రిలీజ్ కు రెడీ గా ఉన్నాయి. మరి వీటిలో ఏది విజయం సాధిస్తుందో చూడాలి. జూన్ లో విడుదలవుతున్న మొదటి బిగెస్ట్ సినిమా పెద్ది. బుచ్చిబాబు సన దర్శకత్వంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కాంబినేషన్ లో వస్తున్న సినిమా పెద్ది. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా కోసం ప్రేక్షకులు వెయ్యి కళ్లతో ఎదురుచుస్తున్నారు. ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, టీజర్, ట్రైలర్, సాంగ్స్ విపరీతమైన హైప్ క్రియేట్ చేశాయి. ఈ సినిమా భారీ హిట్ అవ్వడం ఖాయం అంటున్నారు ఫాన్స్. అలాగే పెద్ది సినిమా తర్వాత సింగ్ గీతం అనే సినిమా వస్తుంది. సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కామెడీ నేపథ్యంలో సాగనుందని తెలుస్తుంది. ఈ సినిమా జూన్ రెండో వారంలో విడుదలకానుంది. ఇక సమంత హీరోయిన్ గా నటిస్తున్న మా ఇంటి బంగారం సినిమా కూడా జూన్ లో విడుదలకానుంది. సమంత భర్త రాజ్ నిడిమోరు క్రియేషన్ లో నందినీ రెడ్డి దర్శకత్వం వహించిన ఇంటి బంగారం సినిమా జూన్ మూడో వారంలో విడుదలకానుంది. అలాగే అఖిల్ నటిస్తున్న లెనిన్ సినిమా కూడా జూన్ మూడో వారంలో విడుదలకానుంది. దీవానా, ట్రాన్స్ ఫర్ త్రిమూర్తులు, బాలన్ లాంటి సినిమాలు కూడా విడుదలకానున్నాయి. ఫైనల్ గా తమిళ్ సీఎం దళపతి విజయ్ నటించిన లాస్ట్ మూవీ జననాయగన్ కూడా జూన్ లోనే విడుదలకానుంది. ఈ సినిమాల్లో ఏ సినిమా భారీ హిట్ అవుతుందో చూడాలి.

# ప్రాంతీయ పార్టీల్లో ఆంధ్రానే టాప్

### ఆదాయంలో టీడీపీ ఖర్చులో వైసీపీ

**న్యూఢిల్లీ,(భారత శక్తి)** దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలకు సంబంధించి ఆదాయాల లెక్కలు ఆసక్తికరంగా మారాయి. 36 ప్రాంతీయ పార్టీలకు సంబంధించి 2024-2025 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం.. గత ఆర్థిక సంవత్సరం 2023-2024తో పోలిస్తే 51.57 శాతం తగ్గింది. ఆసక్తికరంగా 21 పార్టీలు ఆదాయం కంటే ఎక్కువ ఖర్చు చేయడం విశేషం. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ రిపోర్ట్ ద్వారా ఆసక్తికర విషయాలు తెలిశాయి. 2024-25కు సంబంధించి 67 గుర్తింపు పొందిన ప్రాంతీయ పార్టీలు ఉంటే.. వాటిలో 36 పార్టీలకు సంబంధించి ఆడిట్ వివరాలు వెల్లడించారు. 2024-2025లో 36 ప్రాంతీయ పార్టీలకు రూ. 1,192 కోట్ల ఆదాయం రాగా.. వీటిలో రూ. 1,433 కోట్లు ఖర్చు చేశారు.

ఈ ప్రాంతీ పార్టీలు వచ్చిన ఆదాయం కంటే రూ. 241 కోట్లు (20.13%) ఎక్కువ ఖర్చు చేయడం విశేషం. టీడీపీకి 2024-2025లో రూ. 228.31 కోట్ల ఆదాయం వచ్చింది. వీటిలో రూ. 120 కోట్లు రుసుము, చందాల రూపంలో వచ్చాయి.. విరాళాలుగా రై. 85.20 కోట్లు.. బ్యాంకు డిపాజిట్లపై వడ్డీ రూ. 23.02 కోట్లు.. అలాగే మరో రూ. 0.05 కోట్లు వచ్చినట్లు తెలిపారు. రెండో స్థానంలో తృణమూల్ కాంగ్రెస్ రూ. 219.35 కోట్లతో ఉంది, మూడో స్థానంలో వైసీపీ రూ. 140.38కోట్లు, బీఆర్ఎస్ రూ. 123.67 కోట్లు, బీజేడీ రూ. 110.13 కోట్లు, ఏఐడీఎంకే రూ. 86 కోట్లు, జనసేన రూ. 64 కోట్లు ఆదాయం వచ్చింది. వైఎస్సార్‌సీపీకి రూ. 140.05 కోట్లు విరాళాల రూపంలో, ఐటీ రీఫండ్ రూ. 18 లక్షలు, డిపాజిట్లపై వడ్డీగా రూ. 14 లక్షలు.. ఇతర మార్గాల్లో రూ. 27వేలు వచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్‌కు డిపాజిట్లపై వడ్డీగా రూ. 107.96 కోట్లు, చందాలు- రూ. 15.09 కోట్లు, ఐటీ రిఫండ్‌పై వడ్డీగా రూ. 13 లక్షలు, ఇతర మార్గాల్లో రూ. 48 లక్షల ఆదాయం వచ్చింది. జనసేన పార్టీకి మొత్తం రూ. 64 కోట్లలో సభ్యత్వ రుసుం కింద రూ. 59.62 కోట్లు, డిపాజిట్లపై వడ్డీ కింద రూ. 4.48 కోట్లు వచ్చాయి. 2023-24లో 36 పార్టీలకు రూ. 2,463.17 కోట్ల ఆదాయం వస్తే.. 2024-25లో రూ. 1,192.94 కోట్లకు తగ్గిందని లెక్కలు చెబుతున్నాయి. బీఆర్ఎస్‌కు ఆదాయం రూ. 561 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్-రూ. 427 కోట్లు, బీజేడీ- రూ. 187 కోట్లు, ఆర్జేడీ- రూ. 72 కోట్లు, టీడీపీకి-రూ. 56 కోట్లు, వైఎస్సార్‌సీపీకి-రూ. 50 కోట్ల మేర తగ్గింది. ఆసక్తికరంగా అన్నా డీఎంకేకు ఆదాయం రూ. 39 కోట్లు, ఎంఎన్ఎస్-రూ. 37 కోట్లు, జనసేన- రూ. 24 కోట్లు, జేఎంఎం-రూ. 21 కోట్లు, జేడీయూ- రూ. 16 కోట్లు, సీపీఐ ఆదాయం రూ. 10 కోట్ల మేర పెరిగింది. వైఎస్సార్‌సీపీ 2024-2025లో వైఎస్సార్‌సీపీ రూ. 340 కోట్లు, బీజేడీ రూ. 288 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్ రూ. 227 కోట్లు, బీఆర్ఎస్ రూ. 180 కోట్లు, సమాజ్‌వాదీ రూ. 74 కోట్లు, టీడీపీ రూ. 61.33 కోట్లు, జనసేన పార్టీ రూ. 56.94 కోట్లు ఖర్చు చేశాయి. ఓవరాల్‌గా ప్రాంతీయ పార్టీల్లో ఆదాయంలో టీడీపీ రూ. 228 కోట్లు, ఖర్చులో వైఎస్సార్‌సీపీ రూ. 340 కోట్లు తొలి స్థానాల్లో నిలిచాయి. వైసీపీకి ఆదాయం 140 కోట్లు ఉన్నప్పటికీ.. ఆ స్థాయిలో ఖర్చుపెట్టడం నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఏకంగా 340.20 కోట్లు ఖర్చు ఎలా సాధ్యమైందో అర్థం కావడం లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఆదాయానికి మించి చేసిన ఖర్చును.. ఎలా భర్తీ చేస్తారని.. ఇది ఎలా సాధ్యమవుతుందని టిడిపి నేతలు ప్రశ్నిస్తున్నారు. వచ్చిన ఆదాయాన్ని తక్కువ చేసి చూపించారా.. చేసిన ఖర్చును ఎక్కువ చేసి చూపించారా.. ఖర్చుకు.. వచ్చిన ఆదాయానికి లంకె కుదరకపోవడం ఏంటని ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు వైసిపికి భారీగా విరాళాలు వచ్చాయి. ఇందులో కొన్ని కాంట్రాక్టు సంస్థలు భారీగా ఆ పార్టీకి విరాళాలు సమర్పించాయని తెలుస్తోంది. వచ్చిన వాటిల్లో కొన్ని విరాళాలు మాత్రమే వైసిపి చూపించిందని.. మిగతా వాటిని దాచిందని టిడిపి నేతలు అంటున్నారు. పైగా ఖర్చు విషయంలో కూడా వైసిపి చెప్పిన సమాచారానికి పొంతనలేదని టిడిపి నేతలు విమర్శిస్తున్నారు. తమ పార్టీ దేశంలోనే రిచెస్ట్ రీజినల్ పార్టీగా నిలిచిందని వారు చెబుతున్నారు. 228.31 కోట్ల ఆదాయం ఉన్నప్పటికీ.. ఖర్చు కూడా దానికి తగ్గట్టుగానే ఉందని.. ఆదాయానికి మించిన ఖర్చు తాము చేయలేదని.. కానీ వైసీపీకి ఇది ఎలా సాధ్యమైందో అర్థం కావడం లేదని టిడిపి నేతలు ప్రశ్నిస్తున్నారు. వైసిపికి ఈ స్థాయిలో ఆదాయం వచ్చి.. ఖర్చు అంతకు మించిన స్థాయిలో ఉన్నప్పటికీ.. దీనికి సంబంధించిన ఒక వార్తను కూడా ఆ పార్టీ మీడియా విభాగం పబ్లిష్ చేయలేదని.. దీనినిబట్టి ఏం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చని టిడిపి నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి ఆర్థిక వ్యవహారాలకు పాల్పడే వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అధికారంలో ఉన్నప్పుడు ఏ స్థాయిలో దోచుకుని ఉంటారో అర్థం చేసుకోవచ్చని టిడిపి నేతలు వివరిస్తున్నారు. బహుశా దేశంలో ఇటువంటి ఆర్థిక వ్యవహారాలకు పాల్పడే రీజినల్ పార్టీలలో వైసిపి ప్రథమ స్థానంలో ఉంటుందని.. ఆ పార్టీ రికార్డును ఏ పార్టీ కూడా చెరిపి వేయలేదని టిడిపి నేతలు వ్యంగ్యంగా విమర్శిస్తున్నారు.

## జూన్ 2 నుంచి యమునా పుష్కరాలు

**లక్నో,(భారత శక్తి)** హిందూ సంప్రదాయంలో పుష్కరాలకు ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉంది. దేవగురువు బృహస్పతి ఒక రాశి నుంచి మరొక రాశిలోకి ప్రవేశించినప్పుడు, ఆ రాశికి అనుసంధానమైన పవిత్ర నదికి పుష్కర మహోత్సవాలు ప్రారంభమవుతాయి. ప్రతి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి ఈ పుష్కరాలు వస్తాయి. గురుడు కర్కాటక రాశిలో ప్రవేశించే సందర్భంగా యమునా నది పుష్కరాలు నిర్వహించబడతాయి. ఈ పవిత్ర కాలంలో లక్షలాది మంది భక్తులు యమునా తీరాలకు చేరుకుని స్నానాలు, పూజలు, దానధర్మాలు నిర్వహిస్తారు. పుష్కరాల్లో తొలి 12 రోజులను ఆది పుష్కరాలు, చివరి 12 రోజులను అంత్య పుష్కరాలు అని పిలుస్తారు. ఈ సమయంలో యమునా నదిలో స్నానం చేయడం ద్వారా పాప విమోచనం కలుగుతుందని, పితృదోషాలు తొలగుతాయని పురాణ విశ్వాసం.

**యమునా పుష్కరాలు 2026 తేదీలు** 2026 సంవత్సరంలో యమునా పుష్కరాలు జూన్ 2, మంగళవారం ప్రారంభమై జూన్ 13, శనివారంతో ముగుస్తాయి. యమునా పుష్కరాల ప్రధాన ఘాట్లు మధురలో ప్రముఖ ఘాట్లు శ్రీకృష్ణ జన్మభూమిగా ప్రసిద్ధి చెందిన మధురలో భక్తులు సందర్శించదగిన ఘాట్లు: బెంగాలీ ఘాట్, విశ్రాంత్ ఘాట్, స్వామి ఘాట్, కంస ఘాట్, చక్రతీర్థ ఘాట్ బృందావనంలోని పుష్కర ఘాట్లు.. కేశీ ఘాట్, చీర ఘాట్, కాళీయ ఘాట్, ఇమ్లీ తాలా ఘాట్ ప్రయాగరాజ్ ప్రాంతంలో.. త్రివేణి సంగమం, సరస్వతీ ఘాట్, అరైల్ ఘాట్ ఢిల్లీలో.. నిగంబోధ్ ఘాట్, వజీరాబాద్ ఘాట్ అలాగే యమునోత్రి, ఆగ్రా ప్రాంతాల్లో కూడా పుష్కర స్నానాలు నిర్వహిస్తారు. పుష్కరాల్లో చేయదగిన పుణ్యకార్యాలు యమునా పుష్కరాల సమయంలో భక్తులు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా పుష్కర స్నానం, పితృ తర్పణాలు, పిండ ప్రదానాలు, దానధర్మాలు, దీపదానం, యమునా హారతి, గాయత్రీ మంత్ర జపం, గోపూజ.. ఇవన్నీ ఆధ్యాత్మిక శాంతి, పుణ్యఫలాలను అందిస్తాయని విశ్వసిస్తారు. పుష్కరాల్లో 12 రోజుల దానాల విశిష్టత మొదటి రోజు: ధనం, ధాన్యాలు, భూమి, బంగారం, వెండి దానం చేయడం శుభప్రదం. రెండో రోజు: వస్త్రదానం, రక్తదానం, ఉప్పు దానం చేయడం మంచిదిగా భావిస్తారు. మూడో రోజు: పూలు, బెల్లం దానం చేయడం ద్వారా శుభఫలాలు లభిస్తాయని నమ్మకం. నాలుగో రోజు: నువ్వులు, నెయ్యి, పాలు, తేనె దానం చేయడం శ్రేయస్కరం. ఐదో రోజు: ధాన్యదానం, ఎద్దుల దానం వంటి సేవాకార్యాలు చేయడం మంచిది.

ఆరవ రోజు: చందనం, కస్తూరి, ఔషధ దానాలు చేయడం శుభప్రదం. ఏడో రోజు: పీటలు, మంచాలు, గృహ అవసర వస్తువులు దానం చేయడం ఉత్తమం. ఎనిమిదో రోజు: చందనం, కందమూలాలు, పుష్పమాలలు దానం చేయవచ్చు. తొమ్మిదో రోజు: పిండదానం, కంబళి దానం వంటి కార్యక్రమాలు చేయడం మంచిదిగా చెబుతారు. పదో రోజు: కూరగాయలు, పండ్లు వంటి ఆహార పదార్థాలను దానం చేయడం శ్రేయస్కరం. పదకొండో రోజు: గజదానం విశేష పుణ్యఫలితాలను ఇస్తుందని పురాణాలు పేర్కొంటాయి. పన్నెండో రోజు: నువ్వుల దానం చేయడం ద్వారా ప్రత్యేక ఫలితాలు లభిస్తాయని విశ్వాసం.

## పీసీబీలో ఇంటి దొంగలు...

**హైదరాబాద్ (భారత శక్తి)** రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్వహిస్తున్న కంప్యూటరైజ్డ్ తనిఖీ విధానంపై తీవ్రమైన అభ్యంతరాలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిశ్రమల్లో ఏ నెలలో తనిఖీలు జరుగుతాయనే సమాచారాన్ని ముందే యాజమాన్యాలకు, అధికారులకు చేరవేయడం వల్ల ఉల్లంఘనదారులకు అది అనుకూలంగా మారుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. దీనివల్ల లోపాలను ముందే సరిదిద్దుకోవడం లేదా అధికారులను ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉంటోందని తెలుస్తోంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా 'సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్' రూపొందించిన ఒక ప్రత్యేక టూల్ ద్వారా ఈ కంప్యూటరైజ్డ్ తనిఖీలను పీసీబీ చేపడుతోంది. ఈ విధానంలో ప్రతి నెలా 70 నుండి 120 వరకు పరిశ్రమలలో తనిఖీలు నిర్వహిస్తుండగా, అందులో దాదాపు 30 వరకు రాజధాని పరిధిలోని మూడు జిల్లాల్లోనే ఉంటున్నాయి. ఏ అధికారి ఎక్కడ తనిఖీ చేయాలో పీసీబీ కార్యాలయంలోని ప్రత్యేక విభాగం నిర్ణయిస్తుంది. ఈ తనిఖీల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచుతున్నారు. అయితే, ఈ పద్ధతిని పక్కనపెట్టి ఆకస్మిక తనిఖీలు చేసేలా ఒక పటిష్టమైన ప్రత్యేక వ్యవస్థను తీసుకురావాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్య ఉద్గారాల తీవ్రతను బట్టి వాటిని రెడ్, ఆరెంజ్, గ్రీన్ కేటగిరీలుగా విభజించి ఈ తనిఖీలు జరపాలి. గతంలో నిబంధనలు పాటించిన రికార్డులను బట్టి తనిఖీలను కేటాయిస్తారు. ఇన్ స్పెక్టర్లకు ఈ బాధ్యతలను రాండమ్‌గా లేదా రిస్క్ ఆధారంగా టూల్ ద్వారా కేటాయించడం జరుగుతుంది. తనిఖీ పూర్తయిన తర్వాత వాటర్, ఎయిర్ యాక్ట్‌ల ప్రకారం 72 గంటల్లోగా ఇన్స్‌పెక్షన్ రిపోర్టును ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. వ్యర్థాల శుద్ధి, వాయు కాలుష్య మూలాలు, నియంత్రణ పరికరాలు, ప్రమాదకర వ్యర్థాల ఉత్పత్తి , వాటి నిల్వ, పారవేత వంటి కీలక అంశాలను ఈ నివేదికలో పొందుపరచాల్సి ఉంటుంది. మరోవైపు, ఆన్‌లైన్ ఫిర్యాదుల విభాగమైన 'జనవాణి'కి ప్రజల నుండి ప్రతి నెలా 50కి పైగా ఫిర్యాదులు అందుతున్నాయి. ముఖ్యంగా వ్యర్థాలను ఇష్టానుసారంగా పారబోయడం, చెత్తను దహనం చేయడం, పరిశ్రమల నుండి వెలువడే ఘాటైన వాసనలు వంటి సమస్యలపై పౌరులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా ఆయా పరిశ్రమలలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి, ఆ నివేదికలను నేరుగా డాష్ బోర్డులో బహిరంగంగా ఉంచితే వ్యవస్థలో మరింత పారదర్శకత పెరుగుతుందని ప్రజల నుండి డిమాండ్లు వినిపిస్తున్నాయి

## రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు

### "ఫేస్ వాష్ అండ్ గో"కార్యక్రమం చేపట్టిన జగ్గంపేట పోలీసులు

**కాకినాడ(భారత శక్తి)** జగ్గంపేట పోలీసులు చేపట్టిన ఫేస్ వాష్ అండ్ గో"వినూత్న కార్యక్రమం డ్రైవర్లను నిద్రమత్తు నుంచి మేల్కొల్పి, ప్రయాణీకుల ప్రాణాలకు రక్షణగా నిలుస్తుంది... కాకినాడ జిల్లా ఎస్పీ శ్రీ బిందు మాధవ్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు పెద్దాపురం డిఎస్పి ఏ. బి.జి తిలక్ పర్యవేక్షణలో, జగ్గంపేట సీఐ తిరుపతిరావు సూచనల మేరకు కాకినాడ జిల్లా జగ్గంపేటలో జగ్గంపేట ఎస్సై రఘునాథరావు సిబ్బందితో హైవేల వెంట రాత్రి గస్తీ తిరుగుతూ...అటుగా వెళ్లే వాహనాలను ఆపి, డ్రైవర్లను వారితో స్వయంగా నీటితో ముఖం కడిగించారు.

ముఖం కడుక్కున్న తర్వాత డ్రైవర్లకు తగిన జాగ్రత్తలు చెబుతూ సురక్షితంగా గమ్యస్థానాలకు పంపించడం జరుగుతుందన్నారు. అర్ధరాత్రి దాటాక లారీలు, ట్రావెల్స్ బస్సులు, కార్లు తదితర సుదూర వాహనాలను నడిపే డ్రైవర్లలో నిద్రమత్తును, అలసటను పోగొట్టడమే దీని ముఖ్య ఉద్దేశమని జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు.

## ఒక్కసారిగా పెరిగిన కాఫీ డే షేర్లు

**బెంగళూరు,(భారత శక్తి)** కర్ణాటక రాజకీయాల్లో చోటుచేసుకున్న తాజా పరిణామాలు స్టాక్ మార్కెట్‌పై ఊహించని ప్రభావాన్ని చూపించాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామా వార్తల నేపథ్యంలో ప్రముఖ కాఫీ చైన్ సంస్థ కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ షేర్లు ఏకంగా 20 శాతం వరకు ఎగసిపడి అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకోవడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా కొత్త సమీకరణాలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయాల నేపథ్యంలో ఆయన రాజీనామా చేసినట్లు వార్తలు రావడంతో.. తదుపరి ముఖ్యమంత్రిగా ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేరు బలంగా వినిపిస్తోంది. ఈ వార్త వ్యాపార వర్గాల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది. దీనికి ప్రధాన కారణం కాఫీ డే వ్యవస్థాపకుడు దివంగత వీజీ సిద్ధార్థ కుటుంబంతో ఆయనకు ఉన్న సన్నిహిత సంబంధాలే. వీజీ సిద్ధార్థ కుమారుడు అమర్త్య హెగ్డేకు డీకే శివకుమార్ తన కుమార్తె ఐశ్వర్యను వివాహం చేయడం తెలిసిందే. డీకే శివకుమార్ సీఎం అయితే కాఫీ డే సంస్థకు మళ్లీ పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉందని మదుపరులు భావిస్తున్నారు. దీంతో మార్కెట్ ప్రారంభమైన వెంటనే పెట్టుబడిదారులు భారీగా షేర్ల కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫలితంగా కంపెనీ షేర్లు ఒక్కసారిగా 20 శాతం వరకు లాభపడి అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. ఒక రాజకీయ పరిణామం ప్రభావంతో ఒక కంపెనీ షేర్లు ఇంత వేగంగా పుంజుకోవడం మార్కెట్ వర్గాలను కూడా ఆశ్చర్యానికి గురిచేసింది. గత కొంతకాలంగా కాఫీ డే సంస్థ ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. వీజీ సిద్ధార్థ మరణానంతరం సంస్థ కార్యకలాపాలు కొంత మందగించాయి. అయితే ఇప్పుడు ఆ కుటుంబానికి అత్యంత దగ్గర వ్యక్తిగా భావించే డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కనిపించడం కంపెనీకి నైతికంగా, వ్యాపారపరంగా బలం చేకూరుస్తుందని పెట్టుబడిదారులు అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు కూడా వ్యాపారాలకు అనుకూలంగా ఉండొచ్చన్న అభిప్రాయం మార్కెట్లో వినిపిస్తోంది. ముఖ్యంగా పర్యాటక, రిటైల్, హాస్పిటాలిటీ రంగాలకు కొత్త ప్రభుత్వం ప్రోత్సాహక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో కాఫీ డే వంటి రిటైల్ బ్రాండ్‌లకు దీర్ఘకాలికంగా ప్రయోజనం కలిగే అవకాశముందని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. రాజకీయాలు, వ్యాపార రంగాల మధ్య ఉన్న అనుబంధానికి ఈ పరిణామం తాజా ఉదాహరణగా మారింది. డీకే శివకుమార్ అధికారికంగా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపడితే కాఫీ డే షేర్లలో మరింత కదలిక కనిపించే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## రైల్వే స్టేషన్ సోలార్ పవర్ ఆదా...

**హైదరాబాద్ (భారత శక్తి)** ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో సౌర విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. పర్యావరణహితంగా ఇక్కడ ఉత్పత్తి అవుతున్న సోలార్ పవర్‌ను స్టేషన్ పరిధిలోని వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారు. ఎస్పీడీసీఎల్ సరఫరా చేసే సాధారణ విద్యుత్‌తో పోలిస్తే సోలార్ విద్యుత్ యూనిట్ ధర సగానికి సగం తక్కువగా ఉండటంతో.. దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ ఎలక్ట్రికల్ విభాగానికి సంవత్సరానికి లక్షల రూపాయల ప్రజాధనం ఆదా అవుతోంది. ఈ విభాగం కేంద్ర ప్రభుత్వ విద్యుత్ శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ జాతీయ ఇంధన పొదుపు అవార్డును కూడా సొంతం చేసుకోవడం విశేషం. దక్షిణ మధ్య రైల్వే కాచిగూడ స్టేషన్‌లో విద్యుత్ కొనుగోలు కోసం 2018లో ఢిల్లీకి చెందిన 'రెన్యూ పవర్స్ సిస్టమ్స్' సంస్థతో 25 ఏళ్ల పాటు పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకుంది. ఇందులో భాగంగా యూనిట్‌కు రూ. 5 చొప్పున సౌర విద్యుత్‌ను సరఫరా చేసేలా ఒప్పందం కుదిరింది. స్టేషన్ ప్లాట్‌ఫారాల భవనాలపై 200 కేడబ్ల్యూపీ సామర్థ్యంతో రెండు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, వీటిపై సోలార్ ప్యానెళ్లను అమర్చారు. మొత్తం సోలార్ యూనిట్ల సామర్థ్యం 400 కేడబ్ల్యూపీగా ఉంది. గణనీయంగా పెరిగిన విద్యుత్ ఉత్పత్తి.. స్టేషన్ అవసరాల కోసం లోపల 1200 బీఎల్‌డీసీ ఫ్యాన్లు, 3 వేల ఎల్ఈడీ విద్యుత్ బల్బులను వాడుతున్నారు. వీటి కోసం, శీతాకాలంలో రోజుకు సగటున 1300 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుత వేసవి కాలంలో ఎండల వల్ల ఈ ఉత్పత్తి రోజుకు 1700 యూనిట్లకు పెరిగింది. ఏడాదికి రూ. 25 లక్షల ఆదా..గత ఏప్రిల్ నెలలో ఈ సోలార్ ప్లాంట్ల ద్వారా 43 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కాగా, కాచిగూడ స్టేషన్ అవసరాలకు 49 వేల యూనిట్లను వినియోగించారు. సోలార్ పవర్ పోను మిగిలిన 7 వేల యూనిట్లను మాత్రమే ఎస్పీడీసీఎల్ నుండి యూనిట్‌కు రూ. 10 చొప్పున కొనుగోలు చేశారు. సాధారణ విద్యుత్ రేటుతో పోలిస్తే సగం ధరకే (రూ. 5) సోలార్ పవర్ లభించడంతో ఒక్క ఏప్రిల్ నెలలోనే రైల్వేకు రూ. 2.12 లక్షలు మిగిలాయి. ఈ లెక్కన దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్‌కు సౌర విద్యుత్ వినియోగం వల్ల ఏడాదికి సుమారు రూ. 25 లక్షల వరకు ఆదా అవుతుందని అధికారులు వెల్లడించారు.


## హోంగార్డుపై దాడి



**అనకాపల్లి(భారత శక్తి)** అనకాపల్లి జిల్లాలో పోలీసులకే రక్షణ కరువు అయింది. లంకెలపాలెంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డుపై దాడి జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు హోంగార్డ్ తల పగలగొట్టారు. హోంగార్డ్ వెంకటరమణ తలకు బలమైన గాయం అయి . తీవ్ర రక్తస్రావం జరిగింది. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

# 'కరికాడ' మూవీ రివ్యూ!

కన్నడలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'కరికాడ'. నటరాజ్ హీరోగా ఆయన సొంత బ్యానర్లో ఈ సినిమా నిర్మితమైంది. యశ్ శెట్టి కీలకమైన పాత్రను పోషించిన ఈ సినిమాలో,నిరీక్ష శెట్టి కథానాయికగా కనిపిస్తుంది. వెంకటేశ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీన థియేటర్లకు వచ్చింది. అలాంటి ఈ సినిమా ఈ నెల 29వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్' లో స్ట్రీమింగ్ అవుతోంది. కన్నడతో పాటు తెలుగులోను అందుబాటులోకి వచ్చింది. అది అడవిని ఆనుకుని ఉన్న ఒక మారుమూల గ్రామం. ఆ గ్రామానికి ఓ మోతుబరి రైతు భూపతి (బల్ రాజ్) ప్రెసిడెంట్ గా ఉంటాడు. అతనికి మల్లి (యశ్ శెట్టి) కాంత (విపిన్ ప్రకాశ్) అనే ఇద్దరు కొడుకులు ఉంటారు. ఇక జార్జ్ అనే యువకుడు కూడా ప్రెసిడెంట్ కి నమ్మకస్తుడిగా ఉంటాడు. ప్రెసిడెంట్ మేనకోడలు 'కనక' ( నిరీక్ష) ఆ ఇంట్లోనే పెరుగుతుంది. ఆమె పేరుతో భూమి ఉండటం వలన, తన కొడుకు 'కాంత'కి ఇచ్చి పెళ్లి చేయాలని భూపతి నిర్ణయించుకుంటాడు. అయితే ఆమె 'కాడ'ను ఇష్టపడుతూ ఉంటుంది. 'కాడ'కి వయసు పైబడిన తండ్రి తప్ప మరెవరూ లేరు. అతను తన కష్టాన్ని నమ్ముకుని బ్రతుకుతుంటాడు. అడవి పందులను వేటాడటంలో ఆయనకి మంచి నైపుణ్యం ఉంటుంది. చేనులోకి అడవిపందులు రాకుండా అతను కాపలా కాస్తూ ఉంటాడు. అక్కడ అతనిని 'కనక' రహస్యంగా కలుస్తూ ఉంటుంది. అయితే ఆమె కలవారి అమ్మాయి కావడం వలన, కాడ పెద్దగా ఆసక్తిని చూపించడు. ఆమె మనసులో ఏముందనేది భూపతికి అర్థమైపోతుంది.'కనక' గనుక 'కాడ'ను పెళ్లి చేసుకుంటే తన కుటుంబ పరువు ప్రతిష్ఠలు దెబ్బతింటాయి. అంతేకాదు కనక పేరుతో ఉన్న భూమి తన చేజారిపోతుందని భూపతి భావిస్తాడు. అందువలన కాడ అడ్డు తొలగించుకోవాలని భావిస్తాడు. అందుకోసం అతను తన ఇద్దరు కొడుకులను రంగంలోకి దింపుతాడు. ఆ ముగ్గురూ కలిసి ఏం చేస్తారు? వారి కారణంగా 'కాడ'కి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? అనేది మిగతా కథ.చరిత్రను ఒకసారి పరిశీలిస్తే భూమికోసం యుద్ధాలు జరిగాయి. భుక్తి కోసం తిరుగుబాట్లు జరిగాయి. అలాగే స్త్రీ కోసం పోరాటాలు జరిగాయి. భూమి కోసం .. స్త్రీ కోసం జరిగే పోరాటమే ఈ సినిమా కథ. ఈ అంశాన్ని ప్రధానంగా చేసుకునే దర్శకుడు ఈ కథను అల్లుకున్నాడు. ఒక ప్రెసిడెంట్ .. ఆ ఇంటికి చెందిన ఓ అందమైన అమ్మాయి ..



అడవి పందులను వేటాడే ఒక యువకుడు. ఈ ముగ్గురి చుట్టూ ఈ కథ తిరుగుతూ ఉంటుంది.అడవి నేపథ్యంలో సాగే కథలో అందమైన ప్రేమకథ కూడా భాగం కావడంతో, ఆడియన్స్ ఈ సినిమా నుంచి లవ్ .. రొమాన్స్ ఆశిస్తారు. హీరోయిన్ వర్షంలో .. రాత్రివేళలో హీరోను కలుసుకునే సన్నివేశాలు చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తాయి. కానీ హీరో ఆమె పట్ల తనకి ఎలాంటి ఫీలింగ్స్ లేవని కసురుకుంటూ ఆడియన్స్ ను నిరుత్సాహ పరుస్తూ వెళతాడు.తన మేనకోడలు వేరొకరిపై మనసు పడటం ప్రెసిడెంట్ కి నచ్చదు. అవతల వ్యక్తి ఆమెను ప్రేమించడం ..ప్రేమించకపోవడం అనే విషయాలు ప్రెసిడెంట్ కి అనవసరమైన విషయం. అందువలన హీరో .. హీరోయిన్స్ మధ్య రొమాన్స్ ఉంచవలసింది. అందుకు అవకాశం లేకుండా చేయడం ప్రధానమైన లోపంగానే చెప్పుకోవాలి. ఒక బలమైన ట్రాక్ బలహీనపడినట్టుగా మనకి అనిపిస్తుంది.హీరో అడవి పందులను వేటాడే సన్నివేశాలు .. శత్రువుల బారి నుంచి తప్పించుకునే సన్నివేశాలు చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తాయి. ఈ కథను చెప్పడానికి దర్శకుడు ఎంచుకున్న లొకేషన్స్ ఎక్కువ మార్కులు కొట్టేస్తాయని చెప్పాలి. అక్కడక్కడా అనవసరమైన సన్నివేశాలు ఉన్నాయి. అలాగే ఈ సినిమా ఆరంభంలోను .. క్లైమాక్స్ లోను జోడించిన ఒక అంశం ఆడియన్స్ ను అయోమయానికి గురిచేస్తుంది. ఆ విషయాన్ని ఎలా తీసుకోవాలా అనే ఒక విషయం సామాన్య ప్రేక్షకుడికి అర్థం కాదు. ఇక సినిమా చివరిలో ఒక ట్విస్ట్ ఉంటుంది. ఆడియన్స్ గెస్ చేయని ఆ ట్విస్ట్ థ్రిల్ ఫీలయ్యేలా చేస్తుంది. కెమెరా పనితనం .. నేపథ్య సంగీతం ఫరవాలేదు. ఎడిటింగ్ వైపు నుంచి చూస్తే, ట్రిమ్ చేయవలసిన సన్నివేశాలు కనిపిస్తాయి. యాక్షన్ ను తప్ప మరే అంశాన్ని వాడుకోలేకపోయారు. ప్రధానమైన కథ ఆసక్తికరంగానే ఉన్నప్పటికీ, అదనంగా జోడించిన అంశం అయోమయానికి గురిచేసిందని చెప్పాలి.



## ఐవరీ చీరలో అప్సరసలా జాన్వీ.. 'పెద్ది' ప్రమోషన్లలో స్పెషల్ అట్రాక్షన్!

యువ నటి జాన్వీ కపూర్ తన రాబోయే చిత్రం 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా తన స్టైలిష్ లుక్స్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. తాజాగా ప్రముఖ డిజైనర్ అనామికా ఖన్నా ప్రత్యేకంగా రూపొందించిన ఐవరీ రంగు చీరలో ఆమె అచ్చం దేవకన్యలా కనిపించి ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేశారు.తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫొటోలను పంచుకుంటూ, "హెలో ఫ్రమ్ యువర్ జాను పాపా" అంటూ సరదా క్యాప్షన్‌ను జోడించారు. సున్నితమైన ఎంబ్రాయిడరీతో, షీర్ ఫ్యాబ్రిక్‌పై డిజైన్ చేసిన ఈ చీరలో ఆమె అప్సరసను తలపించారు. ఈ చీరకట్టులో డ్రామాటిక్ కేప్-స్టైల్ పల్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనికి జత చేసిన స్కాల్ప్డ్ లేస్ బోర్డర్లు సంప్రదాయానికి ఆధునికతను జోడించాయి. దీనికి మ్యాచింగ్‌గా హెవీ ఎంబ్రాయిడరీతో కూడిన స్వీట్‌హార్ట్ నెక్‌లైన్ బ్లౌజ్‌ను ధరించారు.రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం తెరకెక్కుతోంది. ఈ యాక్షన్ డ్రామాకు ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. జూన్ 4న ఈ సినిమా విడుదల కానుంది. ప్రమోషన్లలో భాగంగా బెంగళూరు, ఢిల్లీ వంటి నగరాల్లో జాన్వీ తన ఎత్నిక్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్నారు. స్టైలిస్ట్ మేగన్ కాన్సెసియో స్టైల్ చేసిన ఈ లేటెస్ట్ లుక్, ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.

## 'వారణాసి'కి మళ్లీ లీకుల బెడద.. జక్కన్న మౌనం వెనుక అసలు వ్యూహం ఏంటి?




టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై అభిమానులు, సినీ వర్గాల్లో ఆసక్తి పెరుగుతూనే ఉంది. ఇటీవల విడుదలైన టీజర్‌తో ఈ చిత్రం ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లబోతోందనే సంకేతాలు మరింత బలపడ్డాయి. అయితే సినిమా షూటింగ్ ఎంత వేగంగా సాగుతోందో, అంతే వేగంగా లీకుల సమస్య కూడా చిత్రబృందాన్ని వెంటాడుతోంది. ముఖ్యంగా రాజమౌళి సినిమాల విషయంలో భద్రతా చర్యలు అత్యంత కట్టుదిట్టంగా ఉంటాయని పేరుంది. గతంలో ఆయన తెరకెక్కించిన చిత్రాల సమయంలో కూడా లీకులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం వరుసగా కొన్ని విజువల్స్ బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. కొద్ది నెలల క్రితం మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ పాల్గొన్న కీలక సన్నివేశానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్రబృందంపై రాజమౌళి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని యూనిట్ సభ్యులను హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది.ఆ తర్వాత కొంతకాలం పరిస్థితి నద్దుమణిగినప్పటికీ, తాజాగా మరోసారి లీకుల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇటీవల చిత్రీకరించిన ఉగ్రభట్టి గుహల నేపథ్యంలోని కీలక సన్నివేశాలకు సంబంధించిన కొన్ని విజువల్స్ సోషల్ మీడియాలో దర్శనమివ్వడంతో అభిమానులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ దృశ్యాలు సినిమా కథలో కీలక భాగంగా భావిస్తున్న నేపథ్యంలో వాటి లీక్ కావడం యూనిట్‌కు ఆందోళన కలిగిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈసారి రాజమౌళి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో లీకులపై వెంటనే స్పందించిన ఆయన, ఇప్పుడు మౌనం పాటించడం వెనుక ఏదైనా ప్రత్యేక వ్యూహం ఉందా అనే చర్చ సోషల్ మీడియాలో సాగుతోంది.కొంతమంది నెటిజన్లు ఈ లీకులు ఉద్దేశపూర్వకంగా బయటకు వచ్చినవై ఉండొచ్చని అభిప్రాయపడుతుండగా, మరికొందరు లీకైన సన్నివేశాలు తుది చిత్రంలో ఉండకపోవచ్చని కామెంట్లు చేస్తున్నారు. ఇంకొందరు మాత్రం రాజమౌళి తనదైన శైలిలో పరిస్థితిని హ్యాండిల్ చేస్తున్నారని, సరైన సమయంలో స్పందిస్తారని భావిస్తున్నారు. ఇక అభిమానులు మాత్రం చిత్రబృందం మరింత అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. ఇటీవల కొన్ని భారీ చిత్రాలకు లీకులు పెద్ద సమస్యగా మారిన నేపథ్యంలో, 'వారణాసి' విషయంలో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ లీకుల వ్యవహారాన్ని రాజమౌళి ఎలా ఎదుర్కొంటారన్నది ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.

## ఈ అభిమానం ఇలాగే ఉండాలి



శ్రద్ధాకపూర్ కొత్త రికార్డును నమోదు చేసింది. మే 2026 లెక్కల ప్రకారం ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన కథానాయికగా ఆమె అవతరించింది. తాజాగా బయటకొచ్చిన అత్యధిక ఫాలోవర్లు కలిగిన టాప్ హీరోయిన్ల అధికారిక ఇన్‌స్టా జాబితాలో, మిగతా స్టార్ హీరోయిన్లందరినీ వెనక్కి నెట్టి, ఏకంగా 93 మిలియన్లు అనగా, 9కోట్ల 3లక్షల ఫాలోవర్లతో టాప్‌లో నిలిచింది శ్రద్ధాకపూర్. ఈ పోటీలో శ్రద్ధాకు.. ప్రియాంక చోప్రా గట్టి పోటీనే ఇచ్చింది. 92 మిలియన్ల ఫాలోవర్లతో ఆమె రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈ విజయంపై ఇన్‌స్టా ద్వారా శ్రద్ధా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. 'మీ అభిమానమే నాకు కొండంత బలం. ఈ అభిమానం కలకాలం ఇలాగే ఉండాలి' అని పేర్కొన్నది. ఎప్పటికప్పుడు మారే ఈ నంబర్ల రేస్‌లో ఈసారి మాత్రం శ్రద్ధా కపూర్ నంబర్‌వన్ అనిపించుకుంది. వచ్చే ఏడాది ఈ స్థానంలో మరో హీరోయిన్ ఉండొచ్చు.

## నేర ప్రపంచంలో 'సిగ్మా'




తమిళనాడు ముఖ్యమంత్రి, దళపతి విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'సిగ్మా'. సందీప్‌కిషన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్నది. రాబరీ నేపథ్యంలో సాగే యాక్షన్ థ్రిల్లర్ ఇది. జూలై 31న చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ధిక్కార స్వభావం కలిగిన ఓ యువకుడు తన తండ్రి చేసిన అప్పులు తీర్చాలనే తపనతో జూదం, దోపిడీలతో కూడిన ఓ నేర సామ్రాజ్యంలోకి అడుగుపెడతాడు. అక్కడ అతను ఎదుర్కొనే ప్రమాదకర పరిస్థితులు, లక్ష్యాన్ని చేరుకోవడానికి అతను చేసే ప్రయత్నాలు ఆద్యంతం ఉత్కంఠను పంచుతాయని, యాక్షన్ మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుందని మేకర్స్ తెలిపారు. ఫరియా అబ్దుల్లా, రాజు సుందరం, సంపత్‌రాజ్, శివ్ పండిట్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతాన్నందిస్తున్నారు. సుభాస్కరన్ నిర్మాత.

## కజిన్స్ అండ్ కల్యాణమ్స్ సిరీస్ రివ్యూ!



ఫ్యామిలీ డ్రామాలకు ఆదరణ అనేది ఎప్పటికీ ఉంటుంది. సహజత్వానికి దగ్గరగా ఉంటూ సరదాగా సాగిపోయే ఈ తరహా కథలకు ఆడియన్స్ వెంటనే కనెక్ట్ అవుతుంటారు. అలాంటి ఒక సిరీస్ ఇప్పుడు మలయాళం నుంచి వచ్చింది. ఈ నెల 29వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతున్న ఆ సిరీస్ పేరే 'కజిన్స్ అండ్ కల్యాణమ్స్'. నిజూ సోమన్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్ లో మొత్తం 60 ఎపిసోడ్స్ ఉండనున్నాయి. మలయాళంతో పాటు తెలుగు .. తమిళ ..కన్నడ ..హిందీ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. ఈ సిరీస్ నుంచి ప్రతి శుక్రవారం 4 ఎపిసోడ్స్ ను వదలనున్నారు. మనూ (కృష్ణ విజయచంద్ర) చందూ (సిద్ధార్థ్) దియా (మనస్విని) అశ్వతి (నైనిత) సంస్కృతి (మాన్య) మేఘ (నందిత) వీళ్లంతా కజిన్స్. కేరళకు చెందిన ఈ కుటుంబాలన్నీ కూడా ఎక్కడెక్కడో నివసిస్తూ ఉంటాయి. అందువలన బంధువుల ఇళ్లలో జరిగే ఫంక్షన్స్ లో తప్పకుండా కలుసుకుంటూ ఉంటారు. అందువలన పిల్లలందరి మధ్య చిన్నప్పటి నుంచి మంచి సాన్నిహిత్యం ఉంటుంది. ఎప్పటికప్పుడు వాళ్లు గతంలో తాము కలిసినప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉంటారు. కజిన్స్ బ్యాచ్ అంతా కూడా యవ్వనంలోకి అడుగుపెడతారు. అలాంటి పరిస్థితులలోనే 'మనూ'కి 'వీణ' అనే అమ్మాయితో పెళ్లి ఖాయమవుతుంది. పెళ్లికి సంబంధించిన పనులన్నీ చకచకా జరిగిపోతూ ఉంటాయి. ఆ పెళ్లికి అతని కజిన్స్ అంతా హాజరవుతారు. 'మనూ' .. దియా మధ్య చిన్నప్పటి నుంచి ఒక రకమైన ఆకర్షణ ఉంటుంది. వయసుకు వచ్చాక అది ప్రేమగా మారుతుంది. ఆ విషయం మిగతా కజిన్స్ కి కూడా తెలుసు. అయినా అనుకోని కారణాల వలన, వీణతో మనూకి పెళ్లి కుదురుతుంది. మనూ పెళ్లికి ముందురోజు రాత్రి అతణ్ణి రహస్యంగా కలుస్తుంది దియా. ఆ రాత్రే తాము ఊరొదిలి పారిపోవాలని అంటుంది. అందుకు అతను కూడా అంగీకరిస్తాడు. వాళ్లిద్దరూ 'త్రిశూల్' వెళ్లి అక్కడ పెళ్లి చేసుకోవడానికి కజిన్స్ ప్లాన్ చేస్తారు. ఆ ప్లాన్ ప్రకారం వెళ్లిపోయిన ఆ ఇద్దరిలో, మనూ తిరిగి రావడం కజిన్స్ ను షాక్ కి గురిచేస్తుంది. మనూ ఎందుకు వెళ్లలేదు? దియా ఏమైపోయింది? పెళ్లి ఆమెది వాళ్ల జీవితాలను ఎలా ప్రభావితం చేసింది? అనేది కథ. సాధారణంగా ఫంక్షన్స్ కి వెళ్లడానికి పిల్లలు ఎక్కువగా ఆసక్తిని చూపుతుంటారు. ఆ వేడుకలలో అయినవాళ్లతో మరింత సన్నిహితంగా మసలుకుంటూ ఉంటారు. ఆటపాటలతో కూడిన ఆ పరిచయాన్ని వాళ్లు అంత తేలికగా మరిచిపోలేరు. అలా ఒక్కో ఫంక్షన్ కి వెళ్లినప్పుడల్లా వాళ్ల మధ్య సాన్నిహిత్యం పెరుగుతూ వెళుతుంది. వయసుతో పాటు అది ప్రేమగా మారుతుంది. అలాంటి కజిన్స్ చుట్టూ అల్లుకొన్న కథ ఇది. దర్శకుడు ఈ కథను అల్లుకున్న తీరు బాగుంది. ఆరుగురు కజిన్స్ 7 పెళ్లిళ్లలో కలుసుకుంటారు. ఒక్కో పెళ్లి వేడుక వాళ్ల జీవితంలో ఒక మలుపుకు కారణమవుతుంది .. ఒక అందమైన జ్ఞాపకంగా మారిపోతుంది. పెళ్లి నేపథ్యంలో సందడిగా నడిచే సన్నివేశాలను డిజైన్ చేసుకున్న విధానం సరదాగా అనిపిస్తుంది. అలకలు .. అల్లరి పనులు .. సరదాలు .. గొడవలు ఆడియన్స్ ను వెంటనే కనెక్ట్ అయ్యేలా చేస్తాయి. ఇక కజిన్స్ అందరూ ఒక్కో ప్రదేశంలో పెరుగుతారు. అక్కడ వాళ్లు పెరిగిన తీరు .. అక్కడి లైఫ్ స్టైల్ .. వాళ్ల స్వభావాల మధ్య తేడా ఇవన్నీ కూడా దర్శకుడు ఆవిష్కరించిన పద్ధతి సహజత్వానికి చాలా దగ్గరగా అనిపిస్తుంది. ముఖ్యంగా పల్లెటూరి పిల్ల దియా .. పట్నం పిల్లాడు మనూ మధ్య చోటుచేసుకునే సన్నివేశాలు ప్రేక్షకులను తమతో పాటు పరిగెత్తిస్తాయి. లవ్ .. కామెడీ .. ఫ్యామిలీ ఎమోషన్స్ కు కనెక్ట్ చేస్తాయి. ఏడు పెళ్లి వేడుకలకి ఆరుగురు కజిన్స్ తమ పేరెంట్స్ తో కలిసి హాజరవుతారు.. ఆ ఏడు పెళ్లిళ్లు ఈ ఆరుగురు జీవితాలను ఎలా ప్రభావితం చేస్తాయనేది కథ. పెళ్లి వేడుకలలో ప్రేమ ప్రయాణం అనేట్టుగా సాగే ఈ సిరీస్ నుంచి ప్రస్తుతం 4 ఎపిసోడ్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దర్శకుడు ఈ సిరీస్ ను మొదలుపెట్టిన విధానం చూస్తేనే, స్క్రీన్ ప్లే బలంగానే ఉందనే విషయం అర్థమవుతోంది.

ప్రధానమైన పాత్రలను పోషించిన ఆర్టిస్టులంతా బాగా చేశారు. ప్రవీణ్ బాలకృష్ణన్ అందించిన ఈ కథకు, ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ న్యాయం చేశాయని అనిపిస్తుంది. నిర్మాణ విలువలతో పాటు, కథాకథనాలు .. కథకి తగిన లొకేషన్స్ ఈ సిరీస్ కి ప్రధానమైన ఆకర్షణ అనే చెప్పాలి. మొదటి నాలుగు ఎపిసోడ్స్ లోనే చాలా కథను చెప్పేశారు. అందువలన ఈ సిరీస్ కథనం వేగంగా ఉండేలానే కనిపిస్తోంది. మిగతా 56 ఎపిసోడ్స్ లో కొత్త పాత్రలు .. ఆసక్తికరమైన మలుపులు పలకరించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఫ్యామిలీ ఆడియన్స్ కి కనెక్ట్ అయ్యే కంటెంట్ గానే చెప్పుకోవలసి ఉంటుంది.



# ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయా?

మూత్రపిండాలు దెబ్బతినడం వల్ల శరీరంలో చర్మ సమస్యలు కూడా కనిపిస్తాయి. చర్మం పొడిగా లేదా దురదగా మారవచ్చు. ఈ సమస్య ఉదయం పూట ఎక్కువగా అనిపించవచ్చు. ఎందుకంటే మూత్రపిండాలు శరీరంలోని ఖనిజాల సమతుల్యతను కాపాడుతాయి. మూత్రపిండాలు రక్తాన్ని శుద్ధి చేయడమే కాకుండా, అవసరమైన పోషకాల సమతుల్యతను కూడా కాపాడుతాయి. కానీ కొన్నిసార్లు శరీరంలోని ఈ ముఖ్యమైన అవయవం ఇబ్బంది పడుతూ ఉంటుంది. కానీ దాని నష్టం సంకేతాలను మనం అర్థం చేసుకోలేము. ఈ నిర్లక్ష్యం ప్రమాదకరం కావచ్చు. ఆ సంకేతాలు ఏమిటి? మన మూత్రపిండాల ఆరోగ్యం గురించి మనం అప్రమత్తంగా ఉండాలి. ఉదయం నిద్ర లేచిన తర్వాత మీ కళ్ళ చుట్టూ, మీ ముఖం మీద వాపు కనిపిస్తే, అది మూత్రపిండాల దెబ్బతింటుందని హెచ్చరిక కావచ్చు. మూత్రపిండాలు శరీరంలో సోడియం, ద్రవం సమతుల్యతను నియంత్రిస్తాయి. అవి సరిగ్గా పనిచేయలేనప్పుడు కణజాలాలలో ద్రవం పేరుకుపోవడం ప్రారంభమవుతుంది. ఇది వాపుకు కారణమవుతుంది. ఉదయం నిద్ర లేచిన తర్వాత మూత్రం నురుగుగా ఉంటే, అది మూత్రపిండాలు దెబ్బతిన్నాయనడానికి సంకేతం కావచ్చు. శరీరంలో అవసరమైన ప్రోటీన్లను నిర్వహిస్తూనే మూత్రపిండాలు వ్యర్థాలను తొలగిస్తాయి. కానీ మూత్రపిండాలు సరిగ్గా పనిచేయలేనప్పుడు ప్రోటీన్ లీక్ కావడం ప్రారంభమవుతుంది. ఇది ఈ సమస్యకు దారితీస్తుంది. ఉదయం నిద్ర లేచిన తర్వాత శరీరం అలసిపోయినట్లు అనిపిస్తే, అది మూత్రపిండాలు దెబ్బతింటున్నాయనే హెచ్చరిక కావచ్చు. మూత్రపిండాలు శరీరం నుండి విషాన్ని తొలగిస్తాయి. కానీ మూత్రపిండాలు సరిగ్గా పనిచేయనప్పుడు ఈ విషపదార్థాలు రక్తంలో పేరుకుపోవడం ప్రారంభిస్తాయి. దీని కారణంగా అలసట, ఏకాగ్రత పెట్టడంలో ఇబ్బంది మొదలైనవి అనుభూతి చెందుతాయి. మూత్రపిండాలు దెబ్బతినడం వల్ల శరీరంలో చర్మ సమస్యలు కూడా కనిపిస్తాయి. చర్మం పొడిగా లేదా దురదగా మారవచ్చు. ఈ సమస్య ఉదయం పూట ఎక్కువగా అనిపించవచ్చు. ఎందుకంటే మూత్రపిండాలు శరీరంలోని ఖనిజాల సమతుల్యతను కాపాడుతాయి. మురికిని తొలగిస్తాయి. కానీ మూత్రపిండాల పనితీరు దెబ్బతినడం వల్ల శరీరంలోని ఈ రెండు మూలకాల సమతుల్యత చెదిరిపోతుంది. ఉదయం నిద్ర లేవగానే దుర్వాసన రావడం కూడా మూత్రపిండాల సమస్యను సూచిస్తుంది. మూత్రపిండాల పనితీరు సరిగా లేకపోవడం వల్ల, రక్తంలో టాక్సిన్స్ పేరుకుపోవడం ప్రారంభమవుతుంది. ఇది దుర్వాసనకు దారితీస్తుంది. ఈ పరిస్థితిని యురేమిక్ ఫ్యాట్ అంటారు.

# గుమ్మడి విత్తనాలు ఆరోగ్యానికి మంచివే..

## - కానీ వీరికి మాత్రం విషంతో సమానం!



గుమ్మడి గింజలను క్రమం తప్పకుండా ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఈ విత్తనాలలో విటమిన్ ఎ, ఫైబర్, ఐరన్, కాల్షియం, బి2, ఫోలేట్, బీటా-కెరోటిన్, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. గుమ్మడికాయ గింజలు ఆరోగ్య ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిని క్రమం తప్పకుండా ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఈ విత్తనాలలో విటమిన్ ఎ, ఫైబర్, ఐరన్, కాల్షియం, బి2, ఫోలేట్, బీటా-కెరోటిన్, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. కాబట్టి వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం ఆరోగ్యానిక మంచిది. కానీ మంచిదికదాని అతిగా తీసుకుంటే అమృతం కూడా విషంగా మారుతుందని మీరు వినే ఉంటారు. ఈ విషయంలో గుమ్మడికాయ గింజలకు ఎలాంటి మినహాయింపులేదు. వీటిని ఎక్కువగా తినడం వల్ల తీవ్రమైన దుష్ప్రభావాలు వస్తాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఆరోగ్యానికి మంచి చేసే గుమ్మడి గింజల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల వాటిని అధికంగా తినడం వల్ల కడుపు నొప్పి, విరేచనాలు సంభవిస్తాయని నిపుణులు అంటున్నారు. గుమ్మడి గింజలను అధికంగా తీసుకోవడం వల్ల కొంతమంది బరువు పెరిగే అవకాశం ఉంది.గుమ్మడి గింజలు తినడం వల్ల కొంతమందిలో అలెర్జీలు రావచ్చు. గుమ్మడి గింజల అలెర్జీ ఉంటే, వాటిని తీసుకోవడం తగ్గించడం మంచిది.ఈ విత్తనాలను అధికంగా తీసుకోవడం వల్ల తీవ్రమైన గొంతు నొప్పి, దగ్గు వస్తుంది.గుమ్మడికాయ గింజలను తరచుగా తీసుకోవడం వల్ల కొంతమందిలో రక్తపోటు తగ్గుతుంది. కాబట్టి ఇప్పటికే తక్కువ రక్తపోటుతో బాధపడుతున్నవారు వీటిని తినకపోవడమే మంచిది.గుమ్మడి గింజలను చిన్న పిల్లలకు ఇవ్వకూడదు. ఎందుకంటే ఈ విత్తనాలు పిల్లల గొంతులో చిక్కుకునే అవకాశం ఉంది. పెద్దలు కూడా దీన్ని సరిగ్గా నమిలి, తిని మింగాలి. గుమ్మడికాయ గింజలను సరిగ్గా తీసుకుంటేనే వాటి పూర్తి ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు అంటున్నారు. వీటిని అధికంగా తీసుకోవడం వల్ల మంచి కంటే కీడే ఎక్కువ జరుగుతుంది. కాబట్టి వీటిని తీసుకోవడంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. సలాడ్లు, గ్రానోలా బార్లు, స్మూతీస్ వంటి ఆహారాల్లో గుమ్మడికాయ గింజలను తీసుకోవచ్చు. వీటిని తేలికగా వేయించి కూడా తీసుకోవచ్చు.

# బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి తాగితే..?



బ్లాక్ కాఫీ తో నిమ్మరసం కలిపి తాగడం వల్ల బరువు తగ్గడానికి సహాయపడుతుందా.. అనే ప్రశ్న కు సమాధానాన్ని ఇప్పుడు తెలుసుకుందాం. ఇలా చేయడం వల్ల శరీరంలో కొవ్వును తగ్గించే ప్రక్రియ వేగవంతం అవడమే కాకుండా.. జీర్ణ వ్యవస్థ కూడా మెరుగుపడుతుంది. బ్లాక్ కాఫీలో ఉండే కెఫిన్, నిమ్మరసంలో ఉన్న విటమిన్ సి రెండూ కలిసి శరీరంలో కొవ్వు కరిగించే ప్రక్రియను వేగవంతం చేస్తాయి. ఇది బరువు తగ్గడంలో సహాయకారి అవుతుంది. శరీరం వేగంగా పని చేస్తే కేలరీలు త్వరగా ఖర్చయ్యే అవకాశం ఎక్కువ ఉంటుంది. కాఫీకి ఆస్ట్రిజెంట్ అనే లక్షణం ఉంటుంది. ఇది జీర్ణక్రియను సక్రియం చేయడంలో సహాయపడుతుంది. నిమ్మరసం కడుపులో పుల్లని రుచి కలిగి ఉండి, మలబద్ధకం, ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు తట్టుకోవడంలో సహకరిస్తుంది. కాబట్టి బ్లాక్ కాఫీతో నిమ్మరసం తాగితే కడుపు శుభ్రంగా, నిదానంగా ఉంటుంది.ప్రతి ఉదయం బ్లాక్ కాఫీకి నిమ్మరసం కలిపి తాగడం వల్ల శరీరం చురుకుగా మారుతుంది. ఇది మనోస్థితిని మెరుగుపరచడమే కాకుండా.. ఆలోచనలు కూడా తేలికగా ఉంటాయి. అలసట, నిరాశ వంటి భావాలు తగ్గిపోతాయి. అందువల్ల రోజంతా ఉత్సాహంగా ఉండటానికి ఇది ఉపయోగపడుతుంది.నిమ్మరసంలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. అవి చర్మంలోని దూషిత పదార్థాలను తొలగించి చర్మాన్ని సున్నితంగా, ప్రకాశవంతంగా చేస్తాయి. బ్లాక్ కాఫీ కూడా శుభ్రపరిచే లక్షణం కలిగి ఉండటంతో చర్మం బాగుంటుంది. కాఫీతో నిమ్మరసం కలిసి చర్మానికి ఆరోగ్యం ఇస్తాయి. నిమ్మరసంలోని విటమిన్ సి శరీర రోగ నిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. కాఫీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరానికి ఇన్ఫెక్షన్లు తట్టుకునే శక్తిని కలిగిస్తాయి. ఈ రెండు కలిపితే మీరు జ్వరాలు, జలుబులు వంటి వ్యాధులు ఎదుర్కోవడంలో బలం పొందగలుగుతారు. కొన్ని సందర్భాలలో నిమ్మరసం కలిపిన బ్లాక్ కాఫీ తాగడం వల్ల మైగ్రేన్ వేదనకు ఉపశమనం లభిస్తుంది. తలనొప్పులు తక్కువగా వచ్చేవిధంగా ఇది సహాయం చేస్తుంది. వ్యాయామానికి ముందు బ్లాక్ కాఫీకి నిమ్మరసం కలిపి తాగితే శక్తి ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల మీరు ఎక్కువ సమయం చురుకుగా ఉండవచ్చు. శరీరం ఎక్కువ కేలరీలను దహనం చేయడంలో సహాయపడుతుంది.



# ఈ టీ తాగితే పీరియడ్స్

## - నొప్పి మాయం అవుతుంది..!

హార్మోన్లు శరీరంలో సమతుల్యతలో ఉండాలి. ఇవి అసమతుల్యతగా మారితే మానసిక ఒత్తిడి, పీరియడ్స్ సమయంలో సమస్యలు, శరీరంలో వాపు వంటి సమస్యలు వస్తాయి. అయితే మన వంటింట్లో ఉండే కొన్ని సహజ పదార్థాలు ఈ హార్మోన్లను సమతుల్యంలో ఉంచడంలో చాలా ఉపయోగపడతాయి. పసుపులో మంట తగ్గించే గుణాలు ఎక్కువగా ఉంటాయి. ఈ గుణాలు శరీరంలోని హార్మోన్ల స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. పీరియడ్స్ సమయంలో వచ్చే తిమ్మిరి వంటి సమస్యలు తగ్గుతాయి. రోజువారీ ఆహారంలో పసుపు వేసి తింటే మంచి ఫలితం కనిపిస్తుంది. అల్లం కూడా మంట తగ్గించే గుణాలను కలిగి ఉంటుంది. శరీరంలో ఉన్న మంటను తక్కువ చేస్తుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే తిమ్మిరిని తగ్గించడంలో అల్లం మంచి పాత్ర పోషిస్తుంది. రోజూ అల్పాహారంలో లేదా టీగా తీసుకుంటే హార్మోన్లు సమతుల్యంలో ఉంటాయి. దాల్చిన చెక్క రక్తంలో చక్కెర స్థాయిని కంట్రోల్ చేస్తుంది. దీని వల్ల హార్మోన్ల స్థాయి కూడా సమంగా ఉంటుంది. దీనిలో కూడా మంట తగ్గించే గుణాలు ఉంటాయి. దీనిని టీలో వేసి తీసుకోవచ్చు లేదా ఇతర వంటకాలలో ఉపయోగించవచ్చు. అవిసె గింజల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఫైటో ఈస్ట్రోజెన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి హార్మోన్ల సమతుల్యతకు చాలా అవసరం. ఓట్స్ లేదా మజ్జిగలో కలిపి తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది.వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సహజ సమ్మేళనం ఉంటుంది. ఇది శరీరంలో వాపును తగ్గిస్తుంది. వెల్లుల్లి తినడం ద్వారా హార్మోన్లు స్థిరంగా ఉంటాయి. దీనితో పాటు రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పిని తగ్గించాలంటే మెంతులు చాలా ఉపయోగపడతాయి. మెంతి గింజలు, మెంతి టీ రూపంలో తీసుకుంటే హార్మోన్లు సమతుల్యంలో ఉంటాయి. ఉదయం ఖాళీ పొట్ట మీద మెంతి టీ తాగితే మంచి ఫలితం ఉంటుంది.ఒత్తిడిని తగ్గించడంలో అశ్వగంధ సహకరిస్తుంది. ఇది శరీరంలో అడ్రినల్ గ్రంథి పనితీరును మెరుగుపరుస్తుంది. దీనివల్ల హార్మోన్లు సమతుల్యంలోకి వస్తాయి. అశ్వగంధను పౌడర్ లేదా క్యాప్సూల్ రూపంలో తీసుకోవచ్చు.జీలకర్రలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న లక్షణాలు మంట తగ్గించి జీర్ణవ్యవస్థకు ఉపయోగపడుతుంది. జీలకర్ర టీ తాగడం వల్ల హార్మోన్ల సమతుల్యతకు సహాయమవుతుంది. తేనెలో ఎన్నో రకాల పోషకాలు ఉంటాయి. తేనె మంటను తగ్గించడంలో సహాయపడుతుంది.

# పొద్దున్నే బాదం తింటే బ్రెయిన్ షార్ప్ అవుతుందట..?



ప్రతి రోజు ఉదయం ఖాళీ కడుపు తో నానబెట్టిన బాదం పప్పులు తినడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇంటి పెద్దలు తరచుగా పిల్లలకి ఉదయం ఖాళీ కడుపుతో నానబెట్టిన బాదం పప్పులు తినమని చెప్తారు. దీనిలో విటమిన్ ఇ, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మెదడును బలపరిచే పనిలో ఉంటాయి. జ్ఞాపకశక్తి పెరిగేలా సహాయం చేస్తాయి. జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది. అంతే కాదు బాదం పప్పులు తినడం వల్ల శరీర బరువు నియంత్రణలో కూడా సహాయం లభిస్తుంది. నానబెట్టిన బాదం పప్పుల్లో ఉండే ఎంజైమ్ లు జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. ఈ పప్పులు తినడం వల్ల చర్మం సాఫీగా, మృదువుగా మారుతుంది. అందువల్ల శరీరంలో పోషకాలు బాగా శోషించబడతాయి. బాదం పప్పులో ఉండే మోనోశాచురేటెడ్ కొవ్వులు, విటమిన్ ఇ చెడు కొలెస్ట్రాల్ తగ్గించే పనిలో ఉంటాయి. దీని వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. గుండె కూడా బలంగా తయారవుతుంది. బాదంలో రిబోఫ్లేవిన్, ఎల్ కార్నిటైన్ ఉండటం వల్ల మెదడు శక్తి పెరుగుతుంది. జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. పక్కా శక్తితో మెదడు పనిచేస్తుంది.నానబెట్టిన బాదం పప్పుల్లో ఫైబర్, ప్రోటీన్ ఎక్కువగా ఉంటాయి. ఇవి ఆకలిని తగ్గించే పనిలో ఉంటాయి. అందువల్ల ఎక్కువ తినకుండా బరువు తగ్గడంలో ఇది సహాయకరంగా ఉంటుంది. బాదంలో విటమిన్ ఇ , యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. ముడతలు తగ్గే అవకాశం ఉంది.నానబెట్టిన బాదం పప్పుల్లో మాంగనీస్, రాగి ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో శక్తిని నిలుపుకోవడంలో సహాయం చేస్తాయి. రోజువారీ కష్టపడి పనిచేయడానికి శక్తి అవసరం. బాదం తినడం వల్ల శరీరానికి కావాల్సిన శక్తి వస్తుంది.బాదంలో కాల్షియం, మెగ్నీషియం కూడా ఉంటాయి. ఇవి ఎముకలను బలపరిచే పనిలో ఉంటాయి. అస్టియో ఆర్థరైటిస్ వంటి ఎముకల వ్యాధులను దూరంగా ఉంచుతాయి. ఎముకలు బలంగా ఉంటే కదలిక సులభం అవుతుంది. ఈ విధంగా ప్రతిరోజు ఉదయం ఖాళీ కడుపుతో నానబెట్టిన బాదం పప్పులు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. మెదడు, గుండె, చర్మం, ఎముకలు బలపడతాయి. బరువు కూడా అదుపులో ఉంటుంది.

# యూరిక్ యాసిడ్ ఎక్కువై ఇబ్బంది పడుతున్నారా..?



ప్రస్తుత రోజుల్లో చాలా మందిని వేధించే ఆరోగ్య సమస్యలలో యూరిక్ యాసిడ్ పెరగడం ఒకటి. ఇది చిన్న సమస్యలా అనిపించినా.. దీర్ఘకాలంలో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయగలదు. ముఖ్యంగా కీళ్ల నొప్పులు, వాపులు, కాళ్ళు చేతులు నొప్పించడం వంటి సమస్యలు ఈ స్థితికి సంబంధించినవే. శరీరంలో ప్యూరిన్ అనే పదార్థం విచ్ఛిన్నమైనప్పుడు యూరిక్ యాసిడ్ అనే వ్యర్థ పదార్థం ఏర్పడుతుంది. ఇది సాధారణంగా మూత్రం ద్వారా బయటకు వెళుతుంది. కానీ శరీరం సరిగా దీన్ని బయటకు పంపకపోతే అది రక్తంలో చేరి కీళ్లలో చేరుతుంది. దీనితో కీళ్లలో వాపు, నొప్పి, నడవలేకపోవడం వంటి ఇబ్బందులు వస్తాయి. ఈ పరిస్థితిని సహజంగా నియంత్రించాలంటే కొన్ని రకాల ఆహార పదార్థాలు ఎంతో ఉపయోగపడతాయి. వాటిలో ముఖ్యంగా పచ్చి బొప్పాయి ముందు వరుసలో ఉంటుంది. ఇందులో విటమిన్ ఎ, సి, మెగ్నీషియం, కాల్షియం, ఫైబర్ వంటి ఎన్నో పోషకాలున్నాయి. ఇవి శరీరాన్ని శుద్ధి చేయడంలో, అంతర్గతంగా వ్యర్థాలను తొలగించడంలో మెరుగైన పనితీరును చూపిస్తాయి.యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించేందుకు బొప్పాయిని కషాయంగా తయారు చేసి తీసుకోవడం చాలా మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఇది శరీరానికి తేలికగా జీర్ణమై, రక్తాన్ని శుద్ధి చేసే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. బొప్పాయి కషాయాన్ని తయారు చేయడం చాలా సులువు. తాజా పచ్చి బొప్పాయిని చిన్న ముక్కలుగా కట్ చేసి ఒక గిన్నెలో ఒక గ్లాసు నీరు వేసి.. అందులో ఈ ముక్కలను సుమారు 5 నిమిషాలు మరిగించాలి. మరిగిన తర్వాత వాటిని మిక్సీలో వేసి మెత్తగా రుబ్బాలి. ఆ రసాన్ని వడగట్టి ఒక కప్పులోకి పోసి చిటికెడు రాతి ఉప్పు కలిపి ఉదయం ఖాళీ కడుపుతో తాగితే మంచిది. ఇది యూరిక్ యాసిడ్ ను సహజంగా నియంత్రించడంలో సహాయపడుతుంది.ఈ ప్రక్రియను వారంలో మూడుసార్లు అనుసరిస్తే మంచి ఫలితాలు కనిపిస్తాయి. అయితే దీన్ని వైద్యుల సలహా మేరకు తీసుకోవడం ఉత్తమం. ఎప్పటికప్పుడు యూరిక్ యాసిడ్ స్థాయిలను పరీక్షించుకుంటూ.. ఆహారం జీవనశైలి మార్పులు చేసుకుంటే ఈ సమస్యను అదుపులో ఉంచవచ్చు.పచ్చి బొప్పాయితో తయారైన ఈ కషాయం ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా వ్యర్థ పదార్థాల తొలగింపులో సహాయపడుతుంది.

# ఆ మూడు తప్ప... వైసీపీ టార్గెట్ 172



**విజయవాడ,(భారత శక్తి)** వైసీపీ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధపడుతోంది. నిన్న తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమన్వయకర్తలతో సమావేశం అయ్యారు జగన్మోహన్ రెడ్డి. ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలకు ఒప్పుకునేది లేదని.. ఏకంగా నియోజకవర్గ ఇన్చార్జిలపై వేటు పడుతుందని హెచ్చరించినంత పని చేశారు. అయితే అక్కడే ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొందరు.. బాధ్యతలు చూస్తున్న తమపై కాదు.. ఆ కీలక నియోజకవర్గాలపై దృష్టి పెట్టండి అన్నట్టు అంతర్గత చర్చల్లో చెబుతున్నారు వైసీపీ నేతలు. ముఖ్యంగా చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం, లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి, పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో కనీసం వైసిపి ఉనికి లేదు. నేతల జాడలేదు. ముందుగా అక్కడ పని చూడండి అన్నట్టు వైసిపి నేతల సూచన ఉంది. గత రెండేళ్లలో ఆ మూడు నియోజకవర్గాల్లో వైసిపి చేసిన కార్యక్రమం అంటూ లేకపోవడం విశేషం.వై నాట్ కుప్పం అంటూ సౌండ్ చేశారు వైసీపీ నేతలు. 2024 ఎన్నికల్లో ఎలాగైనా కుప్పంను గెలిచేస్తాం అంటూ పెద్ద ఎత్తున ప్రకటనలు చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లాంటివారు పెద్దదిక్కుగా మారిపోయారు. తన పుంగనూరు విడిచిపెట్టి మరి కుప్పం పై ఫుల్ ఫోకస్ పెట్టారు. భరత్ అనే నేతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. చంద్రబాబును సొంత నియోజకవర్గంలో అడుగుపెట్టనీయలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్క పదవి కూడా వదలకుండా అంతా తీసుకున్నారు. అభివృద్ధి పనులు కూడా పగబట్టి మరీ చేశారు. కానీ కుప్పం ప్రజలు మాత్రం మళ్లీ చంద్రబాబునే పట్టం కట్టారు. ప్రస్తుతం అక్కడ వైసిపి ఇన్చార్జిగా ఉన్న భరత్ జాడలేదు. వైసిపి కార్యక్రమాలు జరగడం లేదు. పట్టించుకునే నాధుడు కూడా అక్కడ లేడు.ఇక మంగళగిరి విషయానికి వస్తే లోకేష్ మానియా నడుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి లోకేష్ వినూత్న తరహాలో ముందుకు వెళ్తున్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్నారు. ఎంతలా అంటే ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా. 2019లో ఓడిపోయిన తర్వాత సొంత ఖర్చుతో అభివృద్ధి చేసి చూపించారు. ఇప్పుడేమో ప్రభుత్వపరంగా చేసి చూపిస్తున్నారు. గతంలో ఉన్న వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి జాడలేదు. మొన్న పోటీ చేసిన మహిళా నేత కనిపించడం లేదు. పైగా అక్కడ మాజీ మంత్రి ఒకరు లోకేష్ పట్ల అనుకూల ప్రకటనలు చేస్తున్నారు.పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు లేవు. మొన్నటి ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు ముద్రగడ పద్మనాభం. అయితే ఓడించలేక తన పేరు మార్చుకున్నారు ముద్రగడ పద్మనాభ రెడ్డి గా. మరోవైపు మాజీ ఎమ్మెల్యే పెండ్యం దొరబాబు సైతం జనసేనలోకి వచ్చేసారు. పవన్ కళ్యాణ్ పై పోటీ చేసిన వంగా గీత ఆచూకీ లేదు. కనీసం అక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు లేవు. ఈ మూడు చోట్ల ముందు చూడండి.. తరువాత మాట్లాడండి అన్నట్టు ఉంది వైసీపీ నేతల వ్యవహార శైలి.

### గుడివాడలో నాని చేతులెత్తేశారా....

మాజీ మంత్రి కొడాలి నాని గుడివాడ నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారు. రెండు రోజుల క్రితం వైఎస్ జగన్ తో జరిగిన సమావేశంలో పాల్గొన్న కొడాలి నాని గుడివాడకు మాత్రం వెళ్లలేదు. 2024 ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత కొడాలి నాని గుడివాడకు దూరమయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. గుండెకు శస్త్ర చికిత్స జరగడం కొడాలి నాని హైదరాబాద్ కు మాత్రమే పరిమితమయ్యారు. ఏదైనా పోలీస్ స్టేషన్ కు రావాల్సినప్పుడే గుడివాడకు వస్తున్నారు తప్పించి అంతకు మించి ఆయన ప్రత్యేకంగా గుడివాడ వచ్చి వైసీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనలేదు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇంత వరకూ గుడివాడలో కార్యకర్తలతో భేటీ కూడా జరపలేదు.కొడాలి నాని మాత్రం గుడివాడలోని తన ముఖ్య అనుచరులతో టచ్ లోనే ఉన్నారు. హైదరాబాద్ లోనే ఎక్కువ కొడాలి నాని ఉంటున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉండటంతో ఇప్పుడే రావడం అనవసరమని కొడాలి నాని భావిస్తున్నట్లుంది.

గత ఎన్నికల్లో తన ఓటమిని జీర్ణించుకోలేని కొడాలి నాని తాను నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినా ప్రజలు తనను ఓడించడంపై ఒకింత అసంతృప్తితో తొలుత ఉన్నప్పటికీ ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. గుడివాడ నియోజకవర్గంలోతొలి సారి ఓటమి పాలయిన తర్వాత గుడివాడకు పూర్తి దూరం పాటిస్తున్నారు. విజయవాడ వరకూ వచ్చి గుడివాడకు వెళ్లకపోవడం చర్చనీయాంశమైంది.2004 కొడాలి నాని టీడీపీ నుంచి తొలిసారి గుడివాడ ఎమ్మెల్యేగా కొడాలి నాని ఎన్నికయ్యారు. 2009లోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

2014 ఎన్నికలకు వచ్చేసరికి వైసీపీలోకి వెళ్లారు.ఆ ఎన్నికలలో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మాత్రం వెనిగండ్ల రాము చేతిలో ఓటమి పాలయ్యారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దాదాపు రెండున్నరేళ్లు మంత్రిగా పనిచేశారు. కానీ ఇప్పుడు గుడివాడకు వచ్చినా చేసేదేమీ లేదని, ఎన్నికలకు ఏడాది ముందు వచ్చి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

## కృష్ణా , విజయనగరం రైతులకు

# జపాన్ ఎఫెక్ట్...

**విజయవాడ,(భారత శక్తి)** భారత మామిడి పండ్లపై జపాన్ ప్రభుత్వం విధించిన తాజా నిషేధం ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా ఉమ్మడి కృష్ణా, ఖమ్మం విజయనగరం జిల్లాల మామిడి రైతులకు మరియు ఎగుమతిదారులకు పెద్ద షాక్‌గా మారింది. ఏపీలో అత్యధికంగా పండే, ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ఉన్న 'బంగినపల్లి' రకం మామిడి కాయల ఎగుమతులపై ఈ నిర్ణయం కోలుకోలేని దెబ్బ తీయనుంది. జపాన్ మార్కెట్‌లో ఏపీ మామిడి పండ్లకు చాలా ఎక్కువ ధర లభిస్తుండటంతో, ఈ నిషేధం వల్ల ఇక్కడి వ్యాపారులు, రైతులు కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.నిజానికి ఏపీ నుండి జపాన్‌కు మామిడి కాయలను ఎగుమతి చేసే ముందు నాణ్యతా ప్రమాణాల కోసం వాటికి వేపర్ హీట్ ట్రీట్మెంట్ చేయడం తప్పనిసరి. అయితే, ఉత్తరప్రదేశ్‌లోని ఒక ట్రీట్మెంట్ ప్లాంట్‌లో క్వారంటైన్ నిబంధనలు, పురుగుల నివారణ ప్రక్రియల్లో లోపాలు ఉన్నట్లు జపాన్ ఫుడ్ అఫీషియల్స్ గుర్తించారు. జపాన్ దేశం పండ్ల ఈగల విషయంలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటిస్తుంది. ఒక ప్రాంతంలో లోపం జరిగినా, దాని ప్రభావం దేశవ్యాప్త ఎగుమతులపై పడటంతో ఏపీలోని అత్యాధునిక ప్యాక్ హౌస్‌ల ద్వారా ఎగుమతి చేసే రైతులు కూడా ఇప్పుడు నష్టపోవాల్సి వస్తోంది.ఈ ఏడాది ఇప్పటికే ఏపీలోని మామిడి రైతులకు వాతావరణం ఏమాత్రం కలిసిరాలేదు. ఎల్ నినో ప్రభావం వల్ల మార్చి, ఏప్రిల్ నెలల్లో నమోదైన విపరీతమైన ఎండలు, అకాల వాతావరణ మార్పుల కారణంగా పూత ఎండిపోయి, కాయ రాలిపోయి ఇప్పటికే 60 శాతం పైగా పంట నష్టం వాటిల్లింది. దిగుబడి తగ్గి కష్టాల్లో ఉన్న రైతులకు, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర దక్కుతుందనే ఆశ ఉండేది. కానీ కచ్చితంగా సీజన్ పీక్ స్టేజ్‌కు చేరే సమయంలో జపాన్ ఈ నిషేధాన్ని విధించడం ఏపీ మామిడి రైతులకు గోరుచుట్టుపై రోకటిపోటులా మారింది.ఇప్పుడు ఏపీ ఎగుమతిదారులు భయపడుతున్న మరో ముఖ్యమైన అంశం ఏంటంటే.. జపాన్ తీసుకున్న ఈ కఠిన నిర్ణయం వల్ల అంతర్జాతీయంగా భారతీయ క్వాలిటీ కంట్రోల్ సిస్టమ్స్‌పై నమ్మకం తగ్గే అవకాశం ఉంది. జపాన్ బ్యాన్‌ను చూసి ఏపీ మామిడిని భారీగా దిగుమతి చేసుకునే ఇతర యూరోపియన్ యూనియన్ దేశాలు లేదా గల్ఫ్ దేశాలు కూడా తనిఖీలను కఠినతరం చేస్తే ఏపీ మామిడి మార్కెట్ పూర్తిగా కుప్పకూలే ప్రమాదం ఉంది. ఏపీ ప్రభుత్వం, అపెడా అధికారులు తక్షణమే స్పందించి కేంద్రంతో మాట్లాడి, ఈ సాంకేతిక లోపాలను సవరించి జపాన్‌తో మళ్లీ చర్చలు జరపాలని రైతులు కోరుతున్నారు.

## మద్యం స్కాంలో బుక్కైన విజయసాయి

**నెల్లూరు,(భారత శక్తి)** ఏపీలో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఒకవైపు విచారణ చేపడుతుండగా.. సమాంతరంగా ఈడి కూడా దర్యాప్తు చేస్తోంది. తాజాగా వైయస్సార్ కాంగ్రెస్ మాజీ నేత విజయసాయిరెడ్డిని పిలిచి మరి విచారణ చేసింది ఈడి. ఏకంగా ఏడు గంటల పాటు విచారణ కొనసాగింది. విజయసాయిరెడ్డిని ఈడి విచారణ చేపట్టడం ఇది మూడోసారి. అయితే ఈసారి విజయసాయిరెడ్డి మొబైల్ ఫోన్ చుట్టూ విచారణ కొనసాగినట్లు సమాచారం. గతసారి ఈడి తనిఖీల సమయంలో విజయసాయిరెడ్డి వ్యక్తిగత ఫోన్ ను ఈడి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా దర్యాప్తులో భాగంగా విజయసాయిరెడ్డి ఎదుట ఆ సెల్ ఫోన్ లో ఉన్న వివరాలను ఫోరెన్సిక్ నిపుణులు క్లోనింగ్ చేపట్టారు. ల్యాబ్ నివేదిక వచ్చిన వెంటనే మరోసారి విజయసాయిరెడ్డిని విచారించే అవకాశం ఉంది.దాదాపు 7 గంటల పాటు ఈడి ఎదుట ఉండిపోయారు విజయసాయిరెడ్డి. హైదరాబాదులోని ఈడీ కార్యాలయం వద్ద ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. దర్యాప్తు అనంతరం మీడియా ముందుకు వచ్చిన విజయసాయిరెడ్డి అసలు తనను విచారణ చేపట్టలేదని.. తన సమక్షంలో ఫోన్లో ఉన్న వివరాలను తీసుకున్నారని చెప్పుకొచ్చారు. ల్యాబ్ నివేదిక వచ్చిన వెంటనే మరోసారి సమన్లు జారీ చేసి తనను పిలిచే అవకాశం ఉందని విజయసాయిరెడ్డి స్వయంగా పేర్కొనడం విశేషం. అయితే ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదు అని.. మొత్తం వ్యవహారం నడిపింది రాజ్ కసిరెడ్డి అని.. ఈ విషయం ఎన్నిసార్లు అడిగినా చెబుతానని తేల్చి చెప్పారు విజయసాయిరెడ్డి.అయితే ఇప్పుడు విజయసాయిరెడ్డి ఫోన్ కీలకంగా మారింది. ఐదేళ్లపాటు వైసీపీ హయాంలో విజయసాయిరెడ్డి ద్వారా జరిగిన లావాదేవీల లోగుట్టులు బయటపడే అవకాశం ఉంది. మద్యం కంపెనీల విషయంలో తాను మధ్యవర్తిత్వం వహించానని.. ఇప్పటికే పలుమార్లు హింట్ ఇచ్చారు విజయసాయిరెడ్డి. ఇప్పుడు ఏకంగా ఆయన సెల్ఫోన్ దొరకడంతో ఈడి అధికారులు డొంక మొత్తం కదిలించనున్నారు. విజయసాయిరెడ్డి నేరుగా చెప్పడం కంటే తన సెల్ ఫోన్ ద్వారా మొత్తం గుట్టు రట్టు చేశారు అనడం వాస్తవం. వైసిపి హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని విజయసాయిరెడ్డి ఒప్పుకున్నారు. ఇప్పటికీ అదే స్టాండ్ పై ఉన్నారు. అంటే మద్యం కుంభకోణంలో ఆయన అప్రూవర్ గా మారారు అన్నమాట. కానీ తనకు మద్యం కుంభకోణంతో సంబంధం లేదని.. తాను అప్రూవర్ గా మారలేదని చాలాసార్లు చెప్పారు విజయసాయిరెడ్డి. కానీ తన సెల్ ఫోన్ చుట్టూ విచారణ కొనసాగుతోందని.. మరోసారి ఇది తనను పిలిచే అవకాశం ఉందని స్వయంగా విజయసాయిరెడ్డి ధ్రువీకరించడం విశేషం.

## జగన్ మూడో కూటమి వైపు చూపు....

**కడప,(భారత శక్తి)** బిజెపి విషయంలో జగన్మోహన్ రెడ్డి స్టాండ్ మారుతున్నట్లు అర్థం అవుతోంది. ఢిల్లీ వర్గాల్లో సైతం ఇది చర్చకు దారితీస్తుంది. వరుసగా జరుగుతున్న పరిణామాలు చూస్తే జగన్మోహన్ రెడ్డి ఒక పక్కా ఆలోచనతో అడుగులు వేస్తున్నట్లు స్పష్టమౌతోంది. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ పెంపును నిరసిస్తూ ఆందోళనలు, పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ ఓటమికి ఆయన విశ్లేషిస్తున్న కారణాలు.. భారతీయ జనతా పార్టీకి కోపం తెప్పిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బిజెపిని నమ్ముకుంటే రాజకీయంగా తనకు ఇబ్బందులు తప్పవని జగన్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఏపీలో ఎన్డీఏ కూటమి బలంగా ఉన్న నేపథ్యంలో.. తనకు జాతీయస్థాయిలో ఏదో ఒక కూటమి అండ ఉండాలని ఆయన భావిస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది ఢిల్లీ వర్గాల్లో. ఈ విషయం బిజెపి పెద్దల వరకు తెలియడంతో వారు సైతం జగన్మోహన్ రెడ్డి విషయంలో సాఫ్ట్ కార్నర్ విడిచి పెట్టే పరిస్థితి కనిపిస్తోంది.ఏపీలో ప్రత్యేక ఓటరు సవరణ చేపడుతున్న సంగతి తెలిసిందే. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. రాజకీయ ప్రత్యర్థుల ఓట్లను తొలగించడమే దీని వెనుక ఉన్న ఎత్తుగడ అని చెబుతున్నారు జగన్. బెంగాల్లో మమతా బెనర్జీ ఓటమికి ఓటరు జాబితా సవరణ కారణం అని తేల్చి చెప్పారు. తద్వారా బిజెపి గెలుపును తప్పుపట్టారు.

ఎన్నికల సంఘం నిర్ణయాలను సైతం ఎత్తిచూపుతున్నారు. మొన్నటికి మొన్న డీజిల్ పెట్రోల్ ధర పెంపు పై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేశారు. పశ్చిమ ఆసియా పరిణామాల క్రమంలో పెంపు అనివార్యం అని తెలిసి కూడా.. ఇలా ఆందోళనలు చేయడం ఏంటనేది బిజెపి పెద్దల ప్రశ్న. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే జగన్మోహన్ రెడ్డి బిజెపితో కటీఫ్ చెప్పేందుకే నిర్ణయించినట్లు తెలుస్తోందిప్రస్తుతం ఏపీలో కూటమి బలంగా ఉంది. పైగా మూడు పార్టీల మధ్య సంబంధాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో బిజెపిని నమ్ముకుంటే ఇబ్బందులు అని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. క్రమేపి కాంగ్రెస్ పెద్దలతో ఆయన రహస్యంగా మంతనాలు జరుపుతున్నట్లు కూడా ప్రచారం ఉంది. తమిళనాడులో విజయ్ గెలుపుతో దక్షిణాది రాష్ట్రాల్లో ఒక ప్రత్యేక రాజకీయ శక్తిగా అవతరించాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే జగన్మోహన్ రెడ్డి వైఖరిలో వచ్చిన ఈ మార్పుతో బిజెపి పెద్దలు సైతం పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. వైసిపి తో పాటు జగన్ విషయంలో సాఫ్ట్ కార్నర్ తగ్గించుకోవాలని పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## డికె పదవీ స్వీకారానికి సిద్ధం

**(భారత శక్తి)** నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం.. ఎన్నో ఆటుపోట్లు, మరెన్నో విజయాలు.. పార్టీకి ట్రబుల్ షూటర్గా, ప్రత్యర్థులకు 'కనకపుర బండ'గా పేరుపొందిన ఒక క్షేత్రస్థాయి నాయకుడు ఇప్పుడు రాష్ట్ర అత్యున్నత పీఠాన్ని అధిరోహించబోతున్నారు. ఆయనే కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ప్రస్తుత ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేయడంతో, కర్ణాటక నూతన సారథిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది.సిద్ధరామయ్య తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ కార్యాలయానికి సమర్పించారు. దీంతో డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారానికి రంగం సిద్ధమైంది. అయితే ఈ స్థాయికి చేరడానికి ఆయన ప్రయాణం పూలపాన్పు కాదు. 1980లలో విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించిన శివకుమార్, 1989లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా, ఇప్పటివరకు ఎనిమిదిసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై 'అపజయం ఎరుగని నేత'గా తన పట్టు నిలుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి కష్టకాలం వచ్చిన ప్రతీసారీ డీకే శివకుమార్ ముందుండి సమస్యలను పరిష్కరించేవారు. అందుకే ఆయనకు పార్టీలో 'ట్రబుల్ షూటర్' అనే పేరు స్థిరపడింది. అయితే, ఆయన రాజకీయ జీవితంలో అత్యంత కఠినమైన దశ కూడా ఎదురైంది. మనీలాండరింగ్ ఆరోపణలపై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆయనను అరెస్ట్ చేయడంతో సుమారు 50 రోజులు తిహార్ జైలులో గడపాల్సి వచ్చింది

## మే నెలలో తలనీలాల రికార్డు

**తిరుమల (భారత శక్తి)**తిరుమలలో తలనీలాల సమర్పణలో ఏటికేడు కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. మే నెలలో గతంలో ఎన్నడూలేని విధంగా అత్యధిక మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నట్లు టీటీడీ వెల్లడించింది. గత సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది మే నెలలో రికార్డు స్థాయిలో తలనీలాల సమర్పణ జరిగినట్లు తెలిపింది. అలాగే భక్తుల రద్దీకి అనుగుణంగా కళ్యాణకట్టల వద్ద ఏర్పాట్లు చేశామని.. పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది.తిరుమల శ్రీవారికి తలనీలాలు సమర్పించే భక్తుల సంఖ్య ప్రతీ సంవత్సరం పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలోనే మే నెలలో కొత్త రికార్డులు నమోదు చేసింది. గత సంవత్సరాల కంటే 2026 మే నెలలో అత్యధిక మంది భక్తులు తలనీలాలు సమర్పించడం విశేషం. ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా టీటీడీ ఏర్పాట్లు చేపట్టి, నిరంతరాయంగా సేవలు అందిస్తోంది. ఇక ఈ ఏడాది మే నెలలో 14,43,063 మంది భక్తులు తిరుమల శ్రీవారికి తమ తలనీలాలు సమర్పించుకున్నారు. 2024 మే నెలలో 10,65,729 మంది భక్తులు, 2025 మేలో 10,18,370 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకుంటే.. ఈ ఏడాది మే నెల కొత్త రికార్డులు నమోదు చేసింది.మరోవైపు ఇటీవల వేసవి సెలవులు, వారాంతపు రద్దీతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. మే 18వ తేదీ నుంచి మే 23వ తేదీ వరకు వరుసగా ఆరు రోజుల పాటూ రోజూ 50 వేల మందికిపైగా భక్తులు తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరీ ముఖ్యంగా మే 23వ తేదీ ఒక్కరోజే 57,580 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నట్లు టీటీడీ తెలిపింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తలనీలాల సమర్పణకు ఎక్కువ సమయం పట్టకుండా టీటీడీ ఏర్పాట్లు చేసింది.ప్రధాన కళ్యాణకట్ట సహా పీఏసీ-1, పీఏసీ-2, పీఏసీ-3, పీఏసీ-5, జీఎన్‌సీ, హెచ్‌వీసీ, సప్తగిరి, నందకం, కౌస్తుభం, శ్రీవేంకటేశ్వర, శ్రీ పద్మావతి విశ్రాంతి గృహాలతో పాటుగా మొత్తం 11 మినీ కళ్యాణకట్టలు భక్తులకు అందుబాటులో ఉంచినట్లు టీటీడీ తెలిపింది. మొత్తం 1152 మంది క్షురకులు, అందులో 269 మంది మహిళా క్షురకులు భక్తులకు సేవలు అందిస్తున్నట్లు వెల్లడించింది. ఒక్కొక్కరు తమ 6 గంటల షిఫ్టులో 40 మందికి సేవ చేస్తారని తెలిపింది. మరోవైపు భక్తుల రద్దీకి అనుగుణంగా 250 మంది సిబ్బందికి అదనంగా విధులు కేటాయించినట్లు వెల్లడించింది.మరోవైపు తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులు కళ్యాణకట్టను అత్యంత పవిత్రంగా భావిస్తుంటారని.. అందుకే భక్తులకు ఇబ్బందులు కలగకుండా కళ్యాణకట్టలో పరిశుభ్రతకు పెద్దపీట వేసినట్లు టీటీడీ తెలిపింది. భక్తులకు కేటాయించే బ్లేడ్లు కూడా ముందుగా సోడియం సొల్యూషన్ లో ముంచి, డెటాయిల్‌తో శుభ్రపరుస్తున్నట్లు తెలిపింది. భక్తులు సమర్పించే తలనీలాలను ఎప్పటికప్పుడు సేకరించి భద్రపరుస్తున్నట్లు తెలిపింది. తలనీలాల సమర్పణ తర్వాత చందనం బిళ్లలు కూడా అందిస్తున్నట్లు వివరించింది.

**వైకుంఠం కాంప్లెక్స్ 3** తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 ప్రతిపాదన గతంలోనే వచ్చింది.. కానీ ఈ ప్రతిపాదనను స్థానికులు వ్యతిరేకించడంతో ఆగిపోయింది. తాజాగా మరోసారి ఈ ప్రతిపాదన తెరపైకి రాగా.. టీటీడీ అడిషనల్ ఈవో వెంకయ్యచౌదరి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. కొత్తగా క్యూ కాంప్లె?క్స్ నిర్మించడానికి స్థలాన్ని గుర్తించే పనిలో ఉన్నారు. తిరుమలలో సుపథం మార్గం దగ్గర కొన్ని ఇళ్లు ఉండేవి.. శ్రీవారి ఆలయాన్ని విస్తరిస్తున్న సమయంలో అక్కడున్న 84 కుటుంబాలను తరలించి ఆర్‌బీ సెంటర్‌లో ఇళ్లు నిర్మించి ఇచ్చారు. అది కూడా 20 ఏళ్ల పాటూ లీజు కింద నామమాత్రపు అద్దెతో కేటాయించా.. ఆ గడువు ముగిసింది. ఆ ఇళ్లపై తమకు శాశ్వత యాజమాన్య హక్కు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. టీటీడీ అధికారుల్ని కలిసి ఈ అంశంపై విన్నవించినా ఒప్పుకోలేదు. కొంతమంది కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారు.ప్రస్తుతం టీటీడీ ప్లాన్ చేస్తున్న వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3ని ఇదే స్థలంలో నిర్మించాలనే ప్రతిపాదనలు వచ్చాయి. ఈ క్రమంలో ఆర్‌బీ సెంటర్‌లో ఉన్న స్థానికులు వారి సమస్యల్ని, డిమాండ్లను టీటీడీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. టీటీడీ పాలకమండలి సభ్యులు ఈ అంశంపై స్థానికులతో మాట్లాడారు. టీటీడీ ఆలయ ఉన్నతాధికారులతో కూడా స్థానికులు సమావేశమయ్యారు. తమకు తిరుమల బాలాజీనగర్‌లో ఇళ్లు కట్టించి ఇవ్వాలని.. అప్పుడు ఆర్‌బీ సెంటర్‌ను ఖాళీ చేస్తామన్నారు. అయితే టీటీడీ అధికారులు మాత్రం తిరుమల కాదు తిరుపతిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని వారితో చెప్పారు. టీటీడీలో ఉద్యోగాలతో పాటుగా తిరుమలలో షాపులు కేటాయించాలని డిమాండ్ చేయగా.. అధికారులతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.

## పెద్దికి మోడీ ప్రశంసలు

**(భారత శక్తి)** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'పెద్ది' విడుదల తేదీ దగ్గరపడటంతో ప్రమోషన్ల వేగం పెరిగింది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ సినిమా ప్రచారంలో భాగంగా, చిత్ర బృందం మే 28న న్యూఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హీరో రామ్ చరణ్, హీరోయిన్ జాన్వీ కపూర్, దర్శకుడు బుచ్చిబాబు సానా, ఇతర ముఖ్య నటీనటులు హాజరయ్యారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసినప్పుడు ఆయన 'పెద్ది' సినిమా కథ గురించి అడిగారని గుర్తుచేసుకున్నారు. గ్రామీణ, గిరిజన కమ్యూనిటీలను క్రీడల ద్వారా ఎలా శక్తివంతం చేయవచ్చనేదే ఈ సినిమా కాన్సెప్ట్ అని తాను వివరించినట్లు తెలిపారు. తన మాటలు విన్న ప్రధాని పశ్చిమ బెంగాల్లోని ఒక మారుమూల గ్రామానికి చెందిన మహమ్మద్ అనే ఫుట్బాలర్ కథను గుర్తుచేశారని చరణ్ చెప్పారు. ఆ ఒక్క ఆటగాడి స్ఫూర్తితో ఆ గ్రామంలో ఇప్పుడు 80 శాతం మంది ఫుట్బాల్ ఆడుతున్నారని మోదీ తనకు వివరించారని తెలిపారు. 'పెద్ది' కూడా అలాంటి మట్టి వాసన ఉన్న, స్ఫూర్తిదాయకమైన కథ అని చరణ్ పేర్కొన్నారు.గ్రామీణ నేపథ్యంతో వచ్చిన తన గత చిత్రాలు ఘన విజయం సాధించాయని, 'పెద్ది' కూడా అదే కోవలో ప్రేక్షకులను అలరిస్తుందని రామ్ చరణ్ ధీమా వ్యక్తం చేశారు. రెండున్నరేళ్ల పాటు చిత్ర బృందం పడిన కష్టం కేవలం వినోదాన్నే కాకుండా స్ఫూర్తిని కూడా పంచుతుందని అన్నారు.

# మితిమీరుతున్న తమ్ముళ్ల గోల

**అనంతపురం,(భారత శక్తి)** తెలుగుదేశం పార్టీలో గ్రూపు తగాదాలు ఎక్కువయ్యాయి. నియోజకవర్గంలో నేతల మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. రాష్ట్రంలో అనేక చోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తుంది. జిల్లా ఇన్ ఛార్జి మంత్రులు కూడా పూర్తిగా చేతులెత్తేశారు. ఎవరి వైపు ఉంటే ఏం జరుగుతుందోనన్న భయంతో మంత్రులు కూడా మనకెందుకులేనని మౌనంగా ఉంటున్నారు. అయితే రాను రాను ఈ విభేదాలు పార్టీకి ఇబ్బందికరంగా మారుతాయేమోనన్న ఆందోళన పార్టీ క్యాడర్ లో వ్యక్తమవుతుంది. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదంటున్నారు. నియోజకవర్గ స్థాయి నేతల్లో గొడవలు తారా స్థాయికి చేరుకోవడంతో క్యాడర్ కూడా అయోమయంలో పడింది. మహానాడు సందర్భంగా ఈ విభేదాలు మరింత బహిర్గతమయ్యాయి.ఉత్తరాంధ్ర,కోస్తాంధ్ర, రాయలసీమ ఒక చోట కాదు దాదాపు అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. నెల్లూరు జిల్లాలో ఆత్మకూరు నియోజకవర్గంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వ్యతిరేకంగా కన్నబాబు వర్గం అసమ్మతి గళం విప్పింది. తమను పట్టించుకోకుండా వైసీపీ నుంచి వచ్చిన వారికే ప్రయోజనాలు చేకూరుస్తారని, వారికే కార్యక్రమాలకు కూడా ఆహ్వానాలు అందుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇక ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డికి, మాజీ టీడీపీ ఇన్ ఛార్జి ప్రవీణ్ రెడ్డికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. రెండు వర్గాలు ఇటీవల బాహాబాహీకి దిగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది.అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యేకు, మాజీ ఎమ్మెల్యేకు మధ్య పొసగడం లేదు. గుంటూరు జిల్లా, పల్నాడు జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నేతలు ఒకరిపై ఒకరు నాయకత్వానికి ఫిర్యాదు చేసుకుంటున్నారు. విశాఖ జిల్లాలో మాజీ మంత్రికి వ్యతిరేకంగా ఒక వర్గం పార్టీ నాయకత్వం ఎదుట పంచాయతీ పెట్టడం కూడా చర్చనీయాంశమైంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉందని పార్టీ కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా చంద్రబాబు, లోకేశ్ నేరుగా జోక్యం చేసుకుని విభేదాలను పరిష్కరించకపోతే ఈ ప్రభావం లోకల్ బాడీ ఎన్నికలపై పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతుంది. అందుకే పార్టీ అధినేత చంద్రబాబు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ లు కల్పించుకోవాని పార్టీ అభిమానులు కోరుతున్నారు.

## కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం,

# ముగ్గురు మృతి



**కర్నూలు (భారత శక్తి)**ఆదోని మండలం పాండవగల్లు గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. పాండవగల్లు నుంచి గనేకల్ గ్రామానికి బైక్పై వెళ్తున్న ఇద్దరు యువకులను, ఆదోని నుంచి కౌతాళం వెళ్తున్న ఆటో ఎదురుగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్పై ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, ఆటోలో ప్రయాణిస్తున్న మరోవ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

## రాయదుర్గంలో ఎకరాకు రూ 237 కోట్లు

రాయదుర్గం**(భారత శక్తి)** భూములు రికార్డ్ బ్రేక్ చేశాయి. రంగారెడ్డి జిల్లా రాయదుర్గంలో టీజీఐఐసీ భూములు వేలం వేశారు. ఎకరం భూమి రికార్డ్ స్థాయిలో 237 కోట్లు పలికింది. దక్షిణ భారత దేశంలోనే అల్ టైమ్ రికార్డ్ ఇది. సర్వే నంబర్ 83/1 లోని 6 ఎకరాల 29 గుంటల భూమికి వేలం నిర్వహించారు. మొత్తం వేలం విలువ రూ.1490 కోట్లు అని అధికారులు తెలిపారు. ఇక గతేడాది ఇదే ప్రాంతంలో ఎకరం భూమి ధర రూ.177 కోట్లు పలికింది.

7.67 ఎకరాల భూమి వేలం వేయగా ఈ రికార్డ్ ధర పలికింది. 7 ఎకరాలకు మొత్తం 1357.59 కోట్లు ఆదాయం ఆర్జించింది టిజిఐఐసి.రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని రాయదుర్గంలో టిజిఐఐసి (తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ) భూములు వేలం వేశారు. టిజిఐఐసి నిర్ణయించిన కనీస ధర 139 కోట్ల రూపాయలు కాగా వేలం ముగిసే సమయానికి అది దాదాపు 237 కోట్లకు చేరింది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy